ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-6-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 140 పేజీలు: 10+4 వెల: 6.50



ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు 3లో

చీలిక దిశగా శరద్ పవార్ ఎన్సీపి 5లో


## 'గాంధీసరోవర్'కు రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్

**83 ఎకరాల్లో మూసీ ప్రాజెక్టుకు అనుమతి**

**రూ. 533 కోట్ల భూ బదలాయింపునకు ఓకే**

**కృతజ్ఞతలు తెలిపిన సిఎం రేవంత్ రెడ్డి**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్19:** బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ అనుమతిని మంజూరు చేసింది. 83 ఎకరాల రక్షణ శాఖకు సంబంధించిన భూముల్లో మూసీ ప్రాజెక్టుకు అనుమతిచ్చింది. గోల్కొండ ఆర్టిలరీ పరిధిలోని రూ.533 కోట్ల విలువైన భూముల బదలాయింపునకు ఓకే చెప్పింది. అయితే మరోచోట రూ.533 కోట్ల విలువైన భూములు ఇవ్వాలని ప్రభుత్వానికి షరతు విధించింది. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్ నగరంలోని బాపూఘాట్ వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు అనుమతి మంజూరు చేయడంపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.... కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు, భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు అనుమతి లభించడం, తెలంగాణ ప్రభుత్వ విజన్ లక్ష్యాలను సాధించడంలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.మూసీ నది సమగ్ర పునరుజ్జీవనం, నదీ తీర ప్రాంతాల అభివృద్ధి, అలాగే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పర్యావరణ, సాంస్కృతిక, సామాజిక వనరులసృష్టి దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఈ నిర్ణయం మరింత బలాన్ని చేకూరుస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుద్వారా మూసీనది పరివాహక ప్రాంతం పర్యావరణ >>2

## నీట్ రీ ఎగ్జామ్‌కు 'సుప్రీం' పచ్చజెండా




**• పరీక్ష నిలిపివేయాలని దాఖలైన పిటిషన్ల కొట్టివేత • ఎన్‌టిఎ అధికారిక వాట్సప్ ఏర్పాటు • టెలిగ్రాం పిటిషన్‌కు తిరస్కృతి**

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 19:** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ రీ ఎగ్జామ్‌కు లైన్ క్లియర్ అయ్యింది. నీట్ రీ ఎగ్జామ్‌ను నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ నెల 21న జరగబోయే రీ ఎగ్జామ్ యథాతథంగా కొనసాగుతుందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. నీట్ రీ ఎగ్జామ్ నిలిపివేయాలంటూ కొందరు విద్యార్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. పిటిషన్లను అత్యవసరంగా విచారణ జరపాలంటూ అభ్యర్థుల తరఫు న్యాయవాది కోరగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం దాన్ని తోసిపుచ్చింది. నీట్‌కు సంబంధించిన అన్నీ పిటిషన్లు జస్టిస్ పీఎస్ నరసింహా ధర్మాసనం ముందుకు వెళ్లాయని వీటిని కూడా ఆ ధర్మాసనమే విచారిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులు వేసిన పిటిషన్లలో అత్యవసర పరిస్థితి లేదని ఆయన తేల్చి >>2

# ఇక సరికొత్త విద్యావికాసం




శుక్రవారం హైదరాబాద్‌లో విద్యార్థులకు గవర్నర్ శివప్రసాద్ శుక్లాతో కలిసి యంగ్ ఇండియా వెల్‌కమ్ కిట్స్ పంపిణీ చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి, మంత్రులు పొన్నం, అజారుద్దీన్ తదితరులు

**ప్రభుత్వ పాఠశాలల్లో 'నో అడ్మిషన్' బోర్డులు పెట్టే పరిస్థితి**

**విద్యాభివృద్ధికి రూ. 26,600 కోట్లు ఖర్చు**

**ఈ రంగాన్ని నేనే స్వయంగా ప్రక్షాళన చేస్తున్నా**

**బ్లూ కాలర్ జాబ్స్ వైపు దృష్టి సారించాం**

**యంగ్ ఇండియా వెల్‌కమ్ కిట్స్ పంపిణీ, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞలో సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్19:** ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సి వస్తుందని ఎవ్వరూ కలలోనూ ఊహించి ఉండరని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్ల పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించామన్నారు. శుక్రవారం సాయంత్రం ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది.
ఈ కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్‌శుక్లాతో పాటు సిఎం రేవంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. '60 యేళ్ల సుదీర్ఘ పోరాటం, వందలాది మంది యువత ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ భవి >>2



శుక్రవారం ఎల్బి స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞచేస్తున్న విద్యార్థులు

## అమెరికా, ఇరాన్ చర్చలకు బ్రేక్



**లెబనాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు** 5లో

**యుఎస్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ పర్యటన రద్దు**

**చర్చల కొత్త తేదీ త్వరలో ప్రకటించే అవకాశం**



శుక్రవారం హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్

## తెలంగాణ ఆకాంక్షలు నెరవేరేలా పనిచేద్దాం

**జనసేన కార్యాలయ ప్రారంభోత్సవంలో పార్టీ అధినేత, ఎపి డి.సిఎం పవన్**

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 19:** తెలంగాణ రాష్ట్రంలోనూ జనసేన తనకార్యక్రమాలను విస్తృతంచేయనుంది. ఇందుకనుగుణంగా హైదరాబాద్ లోని మణికొండలో పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని జనసేన అధినేత, ఎపి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం ప్రారంభించారు. తెలంగాణ ఆకాంక్షలు, ఆశలు తీరేలా పని చేద్దామని, >>2



శుక్రవారం స్పీకర్ ఓంబిర్లాతో భేటీ అయిన అభిషేక్ బెనర్జీ తదితరులు

## రెబెల్ ఎంపీలను అనర్హుల్ని చేయండి

**స్పీకర్ ఓం బిర్లాను కోరిన అభిషేక్ బెనర్జీ, ఇతర ఎంపీలు**

**న్యూఢిల్లీ,జూన్ 19:** పశ్చిమ బెంగాల్‌కు చెందిన టిఎంసి పార్టీలో రాజకీయ సందిగ్ధత ఇంకా కొనసాగుతోంది. ఇప్పటికే ఎమ్మెల్యేల తిరుగుబాటు విషయంలో అసెంబ్లీలో మమతా బెనర్జీకి వ్యతిరేక నిర్ణయం వెలువడింది. రెబల్ ఎమ్మెల్యేనే అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు టిఎంసి రెబల్ ఎంపీల వ్యవహారంలో ఉత్కంఠ కొనసాగుతోంది. టిఎంసికి చెందిన దాదాపు 20 మంది ఎంపీలు రెబల్స్‌గా మారిన సంగతి తెలిసిందే. వీరంతా తమను ఎన్‌సిపిఐలో విలీనం చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు రెబల్ ఎంపీలు స్పీకర్‌కు ఇటీవలే లేఖ ఇచ్చారు. ఇప్పుడు ఈ అంశంపై స్పందన తెలుసుకునేందుకు స్పీకర్ >>2

## 3 బుల్లెట్ రైళ్లతో సత్వరాభివృద్ధి

**హైదరాబాద్-పుణే, బెంగళూరు, చెన్నై మార్గాలలో మూడు కారిడార్లు**

**హైదరాబాద్ చుట్టూ ట్రిబులార్‌కు దాదాపు రూ. 25వేల కోట్ల ఖర్చు: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



శుక్రవారం కందుకూరు మండలంలోని లేమూరు, బేగంపేట, తిమ్మాపూర్ గ్రామాలలో రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

**కందుకూరు. జూన్ 19. (ప్రభాతవార్త):** మెరుగైన రవాణా సౌకర్యాలు ఉంటేనే రాష్ట్రాలు గాని దేశాలు గాని అభివృద్ధి సాధిస్తాయని కేంద్ర బొగ్గుగనుల శాఖామంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మరియు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని లేమూరు, బేగంపేట, తిమ్మాపూర్ గ్రామాలలో 87కోట్ల వ్యయంతో చేపట్టే రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం సహకారం అన్ని రంగాలలో ఉంటుందని తెలియజేశారు. దేశంలో ప్రారంభించే హైస్పీడ్ రైలు కారిడార్లు తెలంగాణలో మూడు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. హైదరాబాద్-పూణే, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై మార్గాలలో ఈ >>2



## 20 ఆధునిక గాదెలు

**ధాన్యం సురక్షిత నిల్వలకోసం ఏర్పాటు చేస్తామన్న మంత్రి ఉత్తమ్**

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ధాన్యం నిల్వ వ్యవస్థను మరింత శాస్త్రీయంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రధాన వరి ఉత్పత్తి చేసే పది జిల్లాల్లో 20 ప్రాంతాల్లో అత్యాధునిక దాన్యం గాదెలను ఏర్పాటుపై ప్రభుత్వం పరిశీలన చేస్తున్నట్లు వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం ధాన్య నిల్వ, రవాణా రంగానికి చెందిన ప్రముఖ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు.రాష్ట్రంలో వరి ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు ప్రతి యేడాది పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ సామర్థ్యాలనుకూడా పెంచాల్సినఅవసరంఉందని మంత్రి అన్నారు. ప్రారంభదశలో 50వేల మెట్రిక్‌టన్నుల నిల్వ సామర్థ్యంతో గాదెల వలయఅల్లిక (నెట్‌వర్క్) అభివృద్ధి చేసే అవకాశాలను అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న ధాన్యం కొనుగోలు, నిల్వ వ్యవస్థలకు గాదెలు ప్రత్యామ్నాయం కాదని, ధాన్యంలో నాణ్యత తగ్గిపోకుండా ఎలుకలు క్రిమికీటకాలతో నష్టం జరకుండా విత్తనోత్పత్తి సామర్థ్యం దెబ్బతినకుండా నిల్వచేయడమే దీని ప్రత్యేకత అని ఆయన వివరించారు."తెలంగాణలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో స్వయం సహాయక సంఘాలు, ఐకెపి కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో కూడా వారి పాత్ర కొనసాగుతుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రస్తుత కొనుగోలు వ్యవస్థను కొనసాగిస్తూనే ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేస్తాం" అని మంత్రి తెలిపారు.పంట కోతల అనంతరం నిల్వ నష్టాలను తగ్గించడం, ధాన్యం నాణ్యతను పరిరక్షిం >>2

## నేడు రైతు ఖాతాల్లో పిఎం కిసాన్ సొమ్ము

**రాష్ట్రంలో 31 లక్షల మందికి లబ్ధి**

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు ఆర్థిక సాయం అందించేందుకు ముహూర్తం ఖరారైంది. చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ ఖర్చులు, ఇతర అవసరాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద ఇచ్చే పెట్టుబడి సాయాన్ని ఈ నెల 20వ తేదీన రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ మేరకు దీనికి సంబంధించిన వివరాలను కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ విడతలో భాగంగా దేశ వ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.18,880 కోట్లు బదిలీ కానున్నాయి. తెలంగాణలో పిఎం కిసాన్ పథకం ద్వారా దాదాపు 31 లక్షల మందికి పైగా అర్హులైన రైతులు ప్రయోజనం పొందుతున్నారు. గతంలో రాష్ట్రంలో ఈ లబ్ధిదారుల సంఖ్య 70 లక్షల నుంచి 80 లక్షల వరకు ఉండేది, కానీ ఆధార్ అనుసంధానం, భూముల రికార్డుల ప్రక్షాళనతర్వాత అర్హులైనరైతులసంఖ్య తెలంగాణ >>2

## 'పెట్రో' ధరలు దిగివచ్చేనా?

**హార్ముజ్ నుండి భారీగా చమురు రవాణా**

**అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గుతున్న ధరలు**

**భారత్‌లో తగ్గింపుపై ఆయిల్ కంపెనీలు ససేమిరా**

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** మూడున్నర నెలలుగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య నెల కొన్న యుద్ధానికి ముగింపు పడి ఐదు రోజులు గడవడం, హార్మూజ్ జలసంధి నుంచి భారత్ సహా పలు దేశాలకు చమురు సరఫరా భారీగా రవాణా అవుతోంది. ఇదే సమయంలో చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్లో శుక్రవారం మరింత పతనమై పశ్చిమాసియా సంక్షోభం మొదలవక ముందు వున్న ధరల స్థాయికి చేరుతోంది. రాబోయే వారం రోజుల్లో మరింత తగ్గే వీలుందని అంతర్జాతీయంగా వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో భారత్‌లో పెరిగిన పెట్రోలియం ఉత్పత్తులధరలు ఏ మేరకు తగ్గుతాయి? అని సగటు జీవులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే ఆయిల్ కంపెనీలు మాత్రం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు ఇప్పటికిప్పుడు తగ్గించకూడదని, గతంలో తమకు జరిగిన నష్టాలు భర్తీ అ య్యేవరకు రెండు, మూడు నెలల దాకా ఇవే ధరలు కొనసాగాలని >>2



హార్ముజ్ జలసంధినుంచి పెద్దసంఖ్యలో బయలుదేరిన చమురు నౌకలు



శుక్రవారం న్యూఢిల్లీలో రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు చెందిన భద్రతా మంత్రిత్వ శాఖ ప్రతినిధి యున్ హోజుంగ్‌తో సమావేశమైన స్పీకర్ ఓం బిర్లా

# అనర్హుల్ని చేయండి

>> టిఎంసి ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీని పిలిపించారు. శుక్రవారం అభిషేక్ బెనర్జీ స్పీకర్‌ను కలిశారు. తిరుగుబాటు చేసిన ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆయన స్పీకర్‌ను కోరారు. ఎంపీల విలీనాన్ని ఆయన వ్యతిరేకించారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఎంపీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగాన్ని అనుసరించి రెబల్ ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని, విలీన ప్రతిపాదనను తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అభిషేక్ బెనర్జీతోపాటు టిఎంసి ఎంపీలు మహువా మొయిత్రా, సౌగతా రాయ్, డెరెక్ ఒబ్రెయిన్ పాల్గొన్నారు. అభిషేక్ బెనర్జీ అభిప్రాయం తెలుసుకున్న తర్వాత ఎంపీల విలీనం లేదా అనర్హత వేటు అంశాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బెంగాల్ అసెంబ్లీ ఫలితాల అనంతరం టిఎంసి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలు పార్టీపై తిరుగుబాటు చేయగా, ఎంపీలు కూడా రెబల్స్‌గా మారి వేరే పార్టీలో విలీనం చేయాలని కోరుతున్నారు. విలీనంజరిగితే టీఎంసీకి భారీ ఎదురుదెబ్బ తప్పదు. ఈఅంశంపై స్పీకర్‌తో మీటింగ్ తర్వాత అభిషేక్ బెనర్జీ మాట్లాడుతూ.. రెబల్ ఎంపీల చర్యలు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నాయని, వారు స్వచ్ఛందంగా టీఎంసీ సభ్యత్వాన్ని వదులుకోవడానికి సిద్ధపడ్డారని చెప్పారు. అందువల్ల పార్టీ ద్వారా వారికి వచ్చిన ఎంపీ పదవుల్ని కూడా రద్దు చేయాలని కోరారు. ఈ విషయంలో స్పీకర్ తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్పీకర్ నిర్ణయంపైనే ఎంపీల భవిష్యత్, టీఎంసీ భవిష్యత్ ఆధారపడి ఉంది.

# కమలం పువ్వులో పవన్ కళ్యాణ్ ఓ రెక్క

## - మహేష్ కుమార్ గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్19:** 'కమలం పువ్వులో జనసేన అధినేత, ఏపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓ రెక్కలాంటి వారు..' అని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎంత కమల్ కళ్యాణ్‌లు పుట్టుకుని వచ్చినా తమ పార్టీకి నష్టమేమీ లేదని ఆయన శుక్రవారం పార్టీ అధికార ప్రతినిధి సామ రామోహన్ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. జనసేన పార్టీ కార్యాలయాన్ని నగరంలోని మణికొండలో ప్రారంభించడం గురించి ప్రశ్నించగా, మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ప్రతిస్పందిస్తూ కమలం పువ్వుకు ఎన్నో రెక్కలు ఉంటాయని వాటిల్లో పవన్ కళ్యాణ్ ఓ రెక్క వంటివారని అన్నారు. సామరస్యంగా వస్తే తమకేమీ ఇబ్బంది లేదని ఆయన వ్యాఖ్యానించారు.

# 20 ఆధునిక గాదెలు

>> చడం, రవాణా వ్యవస్థను వేగవంతం చేయడం, సరఫరా గొలుసును మరింత సమర్థవంతంగా మార్చడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు.సమావేశంలో పాల్గొన్న సాంకేతిక నిపుణులు ఆధునిక గాదెల ద్వారా ధాన్యం స్వీకరణ నుంచి నిల్వ, రవాణా స్వయంచాలిత ప్రక్రియతో నిర్వహించవచ్చని వివరించారు. డిజిటల్ నాణ్యత పరీక్షలు, యాంత్రిక అన్‌లోడింగ్, సెన్సార్ ఆధారిత పర్యవేక్షణ, శాస్త్రీయ నిల్వ విధానాల ద్వారా ధాన్య నాణ్యతను దీర్ఘకాలం కాపాడవచ్చని తెలిపారు.ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు, నిల్వ కేంద్రాల వద్ద ఎదురవుతున్న కార్మికుల కొరత, రవాణా ఆలస్యం వంటి సమస్యలకు కూడా ఈ వ్యవస్థ సమర్థవంతమైన పరిష్కారం చూపగలదని మంత్రి అభిప్రాయపడ్డారు.రైల్వే అనుసంధానంతో కూడిన ఆధునిక రవాణా నిర్వహణ వ్యవస్థ ద్వారా ధాన్యాన్ని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, దేశవ్యాప్తంగా వినియోగ కేంద్రాలకు వేగంగా తరలించే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన వరి ఉత్పత్తి జిల్లాల్లో గాదెలు ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, నిల్వ సామర్థ్యాలు, పెట్టుబడి వ్యయం, అమలు విధానాలపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని మంత్రి సంబంధిత సంస్థలను ఆదేశించారు. "ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి రైతులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యం. సాంకేతికతను వినియోగిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## ఖర్గే ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ

# జన్మదిన వేడుకలు

**న్యూఢిల్లీ,జూన్ 18:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 56వ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని కాంగ్రెస్‌కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆధ్వర్యంలో బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రియాంకాగాంధీ, కేసీ.వేణుగోపాల్, తదితర నాయకులంతా పాల్గొన్నారు. ఇక పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలియజేశారు. రాహుల్‌గాంధీ ఫొటోలు కూడా దిగారు. ఇక ప్రధాని మోదీ కూడా ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక దేశ, విదేశాల్లో ఉన్న అభిమానులు విషెస్ చెప్పారు.2024 ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారు. దేశమంతా కలియతిరిగారు. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రతిపక్షహోదా దక్కించుకుంది. ఇటీవలి కాలంలో రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయాలు విస్తృతంగా చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా కేరళలో ఎమ్మెల్యే కె.సి. వేణుగోపాల్‌కు వ్యతిరేకత ఉన్నప్పటికీ ఆయన వి.డి.సతీశన్‌ను ముఖ్యమంత్రిగా నియమించారు. ఆ తర్వాత తమిళనాడులో ఆయన డీఎంకెను వీడి నటుడు విజయ్ పార్టీ అయిన టీవీకేతో కలిసి ప్రభుత్వంలో చేరారు. రాహుల్ గాంధీ ప్రత్యేక టీం బ్యాంకును సృష్టించడంలో పూర్వాపరాలు చేయడంలో నిమగ్నమై ఉన్నారు. రాహుల్ గాంధీ నిర్ణయంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నప్పటికీ ఆయన కూటమి ఒక కీలక మిత్రపక్షాన్ని ఎలా కోల్పోయిందని ఇది వెల్లడించింది. దీని తర్వాత రాహుల్ గాంధీ మమత బెనర్జీకి మద్దతుగా నిలవడం, ఆమె అధ్యక్షత మేరకు ఇండియా అలయన్స్ సమావేశాన్ని పిలవడం జరిగింది.

# ఇక సరికొత్త విద్యావికాసం

>> ష్యత్తు తరగతిగదుల్లోనేఉందని మేం సంపూర్ణంగా విశ్వసించాం. విధ్వంసమైన విద్యావ్యవస్థను వికాసం వైపు నడిపించాలని నిర్ణయించాం. అందుకే బడ్జెట్‌లో విద్య కోసం 8.5 శాతం నిధులు కేటాయించాం. విద్యాభివృద్ధికి ప్రభుత్వం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తోంది' అని చెప్పారు.

'ఇది ఖర్చుగా కాదు.. భవిష్యత్తు తరాల కోసం పెట్టుబడిగా మేం భావిస్తాం. పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లు.. విద్యకు ప్రాధాన్యం ఇవ్వలేదు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు కూడా పెంచలేదు. మేం అధికారంలోకి రాగానే వాటి ఛార్జీలు పెంచాం' అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మూసివేసి విద్యా వ్యవస్థను విధ్వంసం చేశారు. విద్యాశాఖకు మంత్రి లేడంటూ కొందరు మాట్లాడుతున్నారు. పదేళ్ల వాళ్ల చేసిన విధ్వంసంతో వందేళ్ల నష్టం జరిగింది అని రేవంత్ ధ్వజమెత్తారు. అందుకే విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి పేదలకు విద్య అందించాలని ఆ శాఖను నా వద్దే పెట్టుకున్నా, ప్రీప్రైమరీ విధానం తీసుకొచ్చి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరిస్తున్నాం అని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించి తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలపబోతున్నాం. రాబోయే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీనీ ఏర్పాటు చేశాం అని పేర్కొన్నారు. ఎఐ తుపాన్‌తో కోట్లాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. అందుకే బ్లూ కాలర్ జాబ్స్ వైపు దృష్టి సారించాం. యువతకు నైపుణ్య శిక్షణ అందించే కార్యక్రమాన్ని చేపట్టాం అని ముఖ్యమంత్రి వివరించారు. విద్యార్థులకు ఇంగ్లీష్‌తో పాటు జర్మనీ, జపాన్ భాషను కూడా నేర్పిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఐటీఐలను ఎటిసిలుగా మార్చాం. స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకున్నాం. మీలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి పదునుపెట్టి గొప్పవాళ్లుగా తీర్చిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సోషల్ వెల్ఫేర్‌లో చదువుకున్న విద్యార్థులు డాక్టర్లు, ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు, రాజకీయ నాయకులుగా ఎదగాలి. మీరంతా తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి. దేశాన్ని నడిపించే శక్తిగా ఎదగాలి అని పిలుపునిచ్చారు. రేపటి భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంది. మీ తలరాతను మార్చేది చదువొక్కటే. మీరు చదవండి.. మీకు ఏం కావాలో ఇచ్చే బాధ్యత మీ రేవంతన్న తీసుకుంటాడు అని పేర్కొన్నారు. 27.50 లక్షల మంది విద్యార్థులకు ఇవాళ యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్స్ అందిస్తున్నాం. తెలంగాణను ఎడ్యుకేషన్ హబ్‌గా, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ ప్రతిభను, శక్తిసామర్థ్యాలను దేశాభివృద్ధికి వినియోగించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి... జీవితానికి ఎస్ చెప్పండి" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి జీవిత మంత్రంగా మార్చుకోవాలని సూచించారు. విద్య అనేది కేవలం తరగతి గదులకు పరిమితం కాకూడదని, విద్యార్థులు ప్రయోగశాలలు, పరిశ్రమలు, పరిశోధనా కేంద్రాలు, స్టార్టప్‌లు, కార్యాలయాల్లోనూ నేర్చుకునే అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, స్కిల్ కౌన్సిళ్లతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం శుభపరిణామమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, ఇతర అవసరమైన వస్తువులతో కూడిన విద్యార్థి కిట్లను అందించడం అభినందనీయమన్నారు. సాధారణ పాఠశాల విద్యార్థులకు రూ.1,505 విలువైన కిట్, రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు రూ.2,976 విలువైన కిట్, హాస్టల్ విద్యార్థులకు రూ.5,096 విలువైన కిట్ అందజేయడం ద్వారా నాణ్యమైన విద్యకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.విద్యార్థి చేతిలో కొత్త పుస్తకాలు, కొత్త యూనిఫాం ఉంటే చదువుపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని గవర్నర్ అన్నారు. ఇది కేవలం సామగ్రి పంపిణీ కార్యక్రమం కాదని, ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించే సంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు.నశాముక్త తెలంగాణకు అందరి సహకారం అవసరం:గవర్నర్విద్యాసంస్థల వాతావరణం పూర్తిగా సురక్షితంగా, నశా రహితంగా ఉండాలని గవర్నర్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "నశా ముక్త్ భారత్ అభియాన్" దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. తెలంగాణలో పాఠశాల విద్యాశాఖ, పోలీసుశాఖ, ఈగల్ సంయుక్తంగా చేపట్టిన "డ్రగ్ ఫ్రీ తెలంగాణ" కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. తానుహిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన సమయంలో మాదకద్రవ్యాల వ్యతిరేకంగా ప్రజల భాగస్వామ్యంతో విజయవంతమైన ఉద్యమాన్ని నిర్వహించిన అనుభవాన్ని గవర్నర్ గుర్తు చేశారు. ప్రజలు, యువత, విద్యాసంస్థలు కలిసికట్టుగా పనిచేస్తే ఎలాంటి సామాజిక సమస్యనైనా అధిగమించవచ్చని చెప్పారు. తెలంగాణ కూడా దేశానికి ఆదర్శంగా నిలుస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. పిల్లలతో నిరంతర సంభాషణ, ప్రేమ, విశ్వాసం, వారి సమస్యల పట్ల సున్నితత్వం ప్రదర్శించడం ద్వారా వారిని చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచవచ్చని గవర్నర్ అన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి సారించి, క్షణిక ప్రలోభాలకు లొంగకుండా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.తెలంగాణలోని పాఠశాలలు జ్ఞానం, సంస్కారం, ఆవిష్కరణలు, సామాజిక బాధ్యతలకు కేంద్రాలుగా మారి "వికసిత భారత్" లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కాగా, విద్యార్థులతో రాష్ట్ర గవర్నర్ ప్రతాప్ శుక్లా,సిఎం రేవంత్‌రెడ్డి డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమానికి డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ సలహాదార్లు, ఎంపీలు,ఎమ్మెల్సీలు,వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు.

# తెలంగాణ ఆకాంక్షలు నెరవేరేలా పనిచేద్దాం

>> తెలంగాణలోని ప్రజల సమస్యలను వినేలా జనవాణిని నిర్వహిద్దామని పవన్ ప్రకటించారు. జనసేన ప్రజల పార్టీ అని, ప్రజల సమస్యలే మన అజెండా కావాలని అన్నారు. తెలంగాణ పార్టీ నాయకుల సమక్షంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కొబ్బరికాయ కొట్టి పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ సీనియర్ నాయకులతోపాటు కొత్తగా పార్టీలో చేరిన వారి సమక్షంలో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి, రామ్ తాళ్లూరి, కోశాధికారి ఎ.వి.రత్నం, పార్టీ తెలంగాణ ఇంఛార్జి ఎన్ శంకర్ గౌడ్, పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాధారాం రాజలింగం, పార్టీ నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, ఆర్ కె సాగర్, తనీష్, సంపత్ నాయక్, సతీష్ రెడ్డి, సురేష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మచ్చా సుధాకర్, ప్రజీత్ గౌడ్, రాజేష్, దాసరి రవీష్, వీర మహిళలు కావ్య, లిఖిత, శిరీష, నిహారిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ .. తెలంగాణ గడ్డ నుంచే జనసేన ప్రస్థానం మొదలైందని, దేశ సమగ్రతను కాపాడుతూ, తెలంగాణ ఆకాంక్షలు, ఆశలు ప్రతిఫలించేలా, ప్రతిబింబించేలా సిద్ధాంతపరమైన భావజాలంతో తెలంగాణలో జనసేన పార్టీ తన రాజకీయ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని పవన్ తెలిపారు. తెలంగాణ స్ఫూర్తిని పూర్తిగా అర్థం చేసుకున్నవాడినని, కేరళం, తమిళనాడు, కర్ణాటకలోనూ ఇప్పుడు జనసేన ప్రస్థానం మొదలైందన్నారు. తెలంగాణ ఆత్మను అర్థం చేసుకున్నవాడినని, ఇక్కడి నేల పోరాటం, త్యాగాలు అన్ని నాకు స్ఫూర్తినిచ్చాయన్నారు. సైద్ధాంతిక భావజాలంతో ఇంతకాలం మనం ముందుకు నడిచాం. ఇప్పుడు దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. జనసేన పార్టీ.. పీపుల్స్ పార్టీ అనే విషయం చాటి చెప్పాలన్నారు. రాజకీయాల్లో ప్రజల సమస్యలు వినే ఓపిక అవసరం, ఓ వ్యక్తి తన సమస్యను చెప్పుకోవడానికి మన దగ్గరకు వస్తున్నారంటే వారిని మొదట గౌరవించాలి. వారి సమస్యను సావధానంగా వినాలి, పరిష్కారాన్ని కనుగొనాలన్నారు. తెలంగాణలోనూ జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని నాయకులను ఆదేశించారు.

# రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్

>> పరంగా పునరుజ్జీవం పొందడమే కాకుండా ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రజా స్థలాలు, సాంస్కృతిక కేంద్రాలు, పర్యాటక ఆకర్షణలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, భారత సైన్యం అందిస్తున్న సహకారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మూసీ, ఇసి నదుల సంగమ స్థలిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనుంది. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు అక్కడున్న రక్షణ భూములు ఇవ్వాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్దిరోజుల క్రితం విజ్ఞప్తి చేశారు. మూసీ, ఇసి నదుల సంగమస్థలిలో గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం చేపడుతున్నామని ఆయనకు వివరించారు. అందుకోసం అక్కడున్న 98.20 ఎకరాల రక్షణశాఖ భూములను రాష్ట్రప్రభుత్వానికి బదలాయించాలని కొద్దిరోజుల క్రితం కోరారు. జాతీయ సమైక్యత, గాంధీ విలువలకు సంకేతంగా చేపడుతున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ పరంగా చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో మహాత్ముడి సిద్ధాంతాలను ప్రచారం చేసే విజ్ఞాన కేంద్రం, ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోదస్థలాలు,ఘాట్లు, శాంతి విగ్రహం, మ్యూజియం నిర్మించనున్నారు. ఇందుకు రక్షణశాఖ భూములుకూడా అవసరమైనందు వల్ల కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. తాజాగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ అనుమతి మంజూరుచేయడంతో పనులు ముందుకు సాగనున్నాయి.

# 3 బుల్లెట్ రైళ్లతో సత్వరాభివృద్ధి

>> బుల్లెట్ ట్రైన్లను నడపడం జరుగుతుందన్నారు ప్రాథమిక అంచనాల ప్రకారం దాని వీటివ్యయం ఐదు లక్షల కోట్ల వరకు ఉంటుందని మారుతున్న భూసేకరణ వ్యాయాలను బట్టి పది లక్షల కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఈ రైలు కారిడార్ల సర్వే పనులు కొనసాగుతున్నాయని సర్వే మరియు టిపిఆర్ పూర్తి అయిన వెంటనే టెండర్ల ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. దానికోసం కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిందని తెలియజేశారు ఈ మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు తెలంగాణ అభివృద్ధికి గేమ్ చేజర్లుగా మారనున్నాయని అభిప్రాయపడ్డారు. అలాగే తెలంగాణ రాజధాని హైదరాబాద్ చుట్టూ ట్రిబుల్ ఆర్ రింగ్ రోడ్డును ఏర్పాటు చేయడం జరుగుతుందని హైదరాబాద్‌కు ఉత్తర భాగంలో భూసేకరణ పనులు చురుకుగా సాగుతున్నాయి అన్నారు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 20 నుండి 25 వేల కోట్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉందన్నారు. మారుమూల ప్రాంతాలకు సైతం రోడ్లను రవాణా సౌకర్యాలను విస్తరించడం ద్వారా అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని సూచించారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధిలో రంగారెడ్డి జిల్లా కీలకమైందిఅన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో రహదారుల రోడ్ల నిర్మాణం అత్యంత ఆవశ్యకత ఉందన్నారు. దానికోసం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కృషివలన ఈ ప్రాంతానికి కేంద్రంనుండి 100 కోట్ల నిధులతో మంజూరైన రహదారుల ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో నిధులు లేమి వలన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు సమస్య ఏర్పడిందని ఇకపై అలాంటి పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఈరోజు ప్రారంభించు కున్న రోడ్ల నిర్మాణంపనులనువెంటనే పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈప్రాంతం అభివృద్ధిలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రోడ్లు మరియు భవనాల శాఖ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

20-06-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
షష్ఠి మ.3.53
మఖ ఉ.9.29
వర్జ్యం : సా.5.30-రా.7.07
దు.తె.5.33-ఉ.7.15
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ పురోభివృద్ధి బాగుంటుంది. విదేశీయాన వ్యవహారాలు సానుకూలమవుతాయి. వస్త్రలాభం.

**వృషభం:** ఆర్థిక విషయంలో ఒడిదుడుకులు తొలగుతాయి. ఋణాలు తీరి మనసుకు ప్రశాంతత ఏర్పడుతుంది.

**మిథునం:** సంతాన విద్యావిషయంలో బాధ్యతాయుతంగా మసలుతారు. ఊహించని పరిణామాలు కలతలు సృష్టిస్తాయి.

**కర్కాటకం:** ఉద్యోగంలో మార్పులు వెనువెంటనే ఫలితాలు ఇవ్వకపోయినా భవిష్యత్తులో కలిసి వస్తుంది.

**సింహం:** మీ పని మీరే చేసుకోండి. కారణం లేని చికాకులు ఉంటాయి. అయినా చెప్పుకోదగిన ఇబ్బందులు పడరు.

**కన్య :** ఒకరికి అప్పు ఇవ్వడం, మీరు మరొకరి వద్ద అప్పు చేయడం రెండూ వద్దు. వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి.

**తుల :** వస్తుభద్రత పట్ల విశేషమైన జాగ్రత్తలు తీసుకోవడం చెప్పదగినది. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.బంధువుల కలయిక.

**వృశ్చికం:** నాణ్యత లేని వస్తువులు మీకు అంటగట్టే ప్రయత్నాలు జరుగుతాయి. స్పెక్యులేషన్ లాభించదు.కొత్త పరిచయాలు.

**ధనుస్సు:** ఒకరికి మీరు సహాయం చేయడమే తప్ప మీకు ఇతరులు సహకరించకపోవడం కొంత ఇబ్బంది కలిగిస్తుంది.

**మకరం :** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**కుంభం:** ఆస్తి వ్యవహారాలు మీకు అనుకూలంగా మారే అవకాశాలు సూచిస్తున్నాయి. సంగీతరంగాల వారికి విదేశీయానం.

**మీనం:** భవిష్యత్తు బంగారు బాటగా కనబడుతుంది. స్త్రీ సంతాన విషయమై విశేషంగా శ్రమించి సత్ఫలితాలు సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం నాగ్‌పూర్‌లో పదివేల టన్నుల అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ ప్రెస్‌కు భూమిపూజ చేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# నీట్ రీ ఎగ్జామ్‌కు 'సుప్రీం' పచ్చజెండా

>> చెప్పారు. పేపర్ లీకేజీ, అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో సమస్యలు ఉన్నాయన్న పిటిషన్లను ఈ మేరకు సుప్రీంకోర్టు కొట్టివేసింది. విద్యార్థులు, నీట్ యుజి అభ్యర్థులు దాఖలు చేసిన ఒక ప్రత్యేక పిటిషన్‌పై తక్షణమే విచారణ చేపట్టాలని న్యాయవాది అదీల్ అహ్మద్ కోరారు. అభ్యర్థుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని జూన్ 21న పరీక్ష నిర్వహించే సాధ్యాసాధ్యాలను పునఃపరిశీలించాలని ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. మానసిక క్షోభ, తీవ్ర ఆందోళన, పరీక్ష రద్దు కావడం వల్ల తలెత్తిన అనిశ్చితి, తగినంత సన్నద్ధత సమయం లేకపోవడం, పరీక్ష సమగ్రతపై అనుమానాలు, ఇతర పరీక్షలతో తేదీలు ఒకేలా ఉండటం, నిర్వహణాపరమైన ఇబ్బందులు, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు వంటి అంశాల నేపథ్యంలో ఈ విజ్ఞప్తులు వస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 21న నీట్ రీ ఎగ్జామ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి అపోహలకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో నీట్ పరీక్షను నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ప్రత్యేకంగా వాట్సాప్ సేవలను ప్రారంభించింది. అధికారిక వాట్సాప్ సేవలను ప్రారంభించిన ఎన్‌టిఏ తప్పుడు ఎస్ఎంఎస్‌లు, ఈ-మెయిల్స్‌ను నమ్మొద్దని స్పష్టం చేసింది. 7827980287 నంబరుతో ఎన్‌టిఏ అధికారి వాట్సాప్‌ను ప్రారంభించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పేరుతో ఉండే ఈ ఖాతాకు బ్లూ టిక్ ఉంటుందని, అభ్యర్థుల పరీక్షా కేంద్రాలకు సంబంధించిన వివరాలతోపాటు పరీక్షకు సంబంధించిన అన్ని అప్‌డేట్స్ ఈ నంబర్ నుంచే వస్తాయని ఎన్‌టిఏ స్పష్టం చేసింది. బ్లూటిక్ లేకుండా ఇదే పేరుతో వచ్చే సమాచారాన్ని నమ్మవద్దని అభ్యర్థులకు ఎన్‌టిఏ సూచించింది. వాట్సాప్ నోటిఫికేషన్లతోపాటు అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని రిమైండర్ ఎస్ఎంఎస్, ఈ-మెయిల్‌లను కూడా పంపుతున్నట్టు తెలిపింది. అధికారిక ఎస్ఎంఎస్‌లు ఎన్ఐసిపిఐఇపిఅనే సెండర్ ఐడీ నుంచి, ఈ మెయిల్‌లు నోరిప్లయ్.నీట్.ఎన్‌టిఎ-ఎన్ఐసి.ఇన్ నుంచి మాత్రమే వస్తాయని తెలిపింది.

**డ్రెస్ కోడ్ నిబంధనలు..**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) నీట్ విద్యార్థులకు పలు సూచనలు చేసింది. డ్రెస్‌కోడ్‌లో భాగంగా .. అభ్యర్థులు సాధారణ, లేత రంగు దుస్తులు మాత్రమే ధరించాల్సి ఉంటుందని ఎన్‌టిఏ తెలిపింది. పెద్ద పెద్ద బటన్లు, ఎంబ్రాయిడరీ, పాకెట్స్ ఎక్కువగా ఉన్న దుస్తులకు అనుమతి లేదు. ఫుల్ హ్యాండ్స్ చొక్కాలు కాకుండా హాఫ్ స్లీవ్స్ దుస్తులు మాత్రమేధరించాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రానికి షూస్ వేసుకుని రాకూడదు. కేవలం తక్కువ హీల్స్ ఉన్న శాండల్స్, స్లిప్పర్స్ మాత్రమే అనుమతిస్తారు. పరీక్షా హాలులోకి అడ్మిట్ కార్డ్, ప్రభుత్వం ఇష్యూ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్‌లతో పాటు ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిళ్లను మాత్రమే లోపలికి అనుమతిస్తారు. ఇక ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ డివైజ్‌లు, స్మార్ట్ వాచీలు, క్యాలిక్యులేటర్లు, పర్సులు, బెల్టులు, ఎలాంటి బంగారు, వెండి ఆభరణాలను ఎగ్జామ్ సెంటర్‌లోకి అనుమతించరు. మే 3న నిర్వహించిన నీట్ పరీక్ష అడ్మిట్ కార్డులు కాకుండా, రీఎగ్జామ్ కోసం విడుదల చేసిన కొత్త హాల్‌టికెట్లను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎన్‌టిఏ ప్రకటించింది.

**టెలిగ్రామ్ పిటిషన్‌ను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు**

మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై కేంద్రం ఆంక్షలు విధించడాన్ని ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. కేంద్రం ఆంక్షలను సవాలు చేస్తూ టెలిగ్రామ్ వేసిన పిటిషన్‌ను విచారణకు తిరస్కరించింది. నీట్ రీ ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం విధించిన తాత్కాలిక నిషేధాన్ని ఢిల్లీ న్యాయస్థానం సమర్థించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టెలిగ్రామ్ యాప్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేజస్ కారియా ఈ మేరకు తీర్పు వెలువరించారు. నిషేధం విధించటం తీవ్రమైన చర్యేమీ కాదని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి అసమానతలు కన్పించలేదని, కేంద్రం తీసుకున్న చర్య చాలా చిన్నదన్నారు. టెలిగ్రామ్ సేవలను పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించే అధికారం కేంద్రానికి ఉందని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

**మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి నష్టపరిహారం ఇవ్వాలిః ప్రధానికి కాక్రోచ్ పార్టీ అధ్యక్షుడి లేఖ**

నీట్ పరీక్షల్లో గందరగోళం కారణంగా విద్యార్థుల బలవన్మరణంపై కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షల గందరగోళం కారణంగా బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. తమ జీవిత కాలపు సొమ్మును ధారపోసి చదివించిన పిల్లలనే కోల్పోయిన ఆ కుటుంబాలు పూర్తిగా నిరుపేదలుగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలన్న తమ సంస్థ డిమాండ్‌ను దీప్కే పునరుద్ఘాటించారు.

# 'పెట్రో' ధరలు దిగివచ్చేనా?

>> కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా భారత్‌లో నెలన్నర క్రితం వరుసగా పెరిగిన పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి గ్యాస్, వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలు సామాన్యులపై పెనుభారం మోపడం తెలిసిందే. వారం నుంచి రెండు వారాల వ్యవధిలో పెట్రోల్, డీజిల్‌పై ఎనిమిది రూపాయల నుంచి 12 రూపాయల వరకు ధరలు పెరగగా సబ్సిడీ సిలిండర్లు, వాణిజ్య సిలిండర్లు మరింత ప్రియమవడం విదితమే. సబ్సిడీ సిలిండర్ల సరఫ రాలో కోతపడగా, కొత్త కనెక్షన్లపై నిషేధం విధించారు. ఇక వాణిజ్య సిలిండర్ల ధరలు ఆకాశానంటడానికి తోడు వీటి సరఫరా బాగా తగ్గి పోవడంతో చిన్నపాటి హోటళ్లు, టిఫిన్ సెంటర్లు వేల సంఖ్యలో దేశ వ్యాప్తంగా మూతపడ్డాయి. ఆర్థిక స్తోమత వున్న వారు కాస్త ఎక్కువ డబ్బులు వెచ్చించి బ్లాక్‌లో కొని హోటళ్లు నడిపినా అక్కడ భోజనం, టిఫిన్ ధరలు భారీగా పెరిగాయి. బడా హోటళ్లు, స్టార్ హోటళ్లలో ఆహార ధరలు మరింత పెరిగాయి. ఇవన్నీ సామాన్యులతో పాటు మధ్య తరగతి ప్రజలపై తీవ్రంగా చూపిందని చెప్పాలి. పశ్చిమాసియా సంక్షోభానికి ముందు క్రూడ్ ఆయిల్ ధరలు 70 నుంచి 75 డాలర్ల మధ్య వుండగా బ్రెంట్ ఆయిల్ ధరలు 75 నుంచి 78 డాలర్ల మధ్య పలికేది. ఇరాన్, అమెరికా యుద్ధం వల్ల క్రూడ్ ఆయిల్ ధరలు, బ్రెంట్ ఆయిల్ ధరలు వంద డాలర్లను దాటడడంతో ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరిగాయి. భారత్‌లోనూ ఈ ధరల పెరుగుదల సామాన్యుల నడ్డి విరిచింది. ఒక దశలో పశ్చిమాసియా సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగుతుందని వార్తలు రావడంతో క్రూడ్ ఆయిల్ ధరలు 130 డాలర్ల వరకు చేరుతుందని నిపుణులు హెచ్చరించారు. అయితే సోమవారం ఉదయం (భారత కాలమానం ప్రకారం) ఇరాన్, అమెరికా యుద్ధానికి ముగింపు పలికేందుకు ఇరుదేశాలు అంగీకరించడంతో పాటు హార్మూజ్ జలసంధి తెరుచుకోనుందని ప్రకటించిన దరిమిలా క్రూడ్ ఆయిల్ ధరలు దిగివచ్చాయి. ఆరు రోజుల క్రితం అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆ యిల్ ధరలు 86 డాలర్లుగా వుండగా యుద్ధం ముగింపుపై ప్రకటన వెలువడగానే ఒక్కసారిగా ఆరు డాలర్లు తగ్గింది. ఇక బ్రెంట్ ఆయిల్ ధరలు 79 డాలర్లకు తగ్గింది. శుక్రవారం నాడు అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు 76 డాలర్లుగానూ బ్రెంట్ ఆయిల్ ధరలు 78 డాలర్లుగానూ వుంది. ఆరు రోజుల్లో చమురు ధరలు పది డాలర్ల వరకు తగ్గడం గమనార్హం. రాబోయే వారం రోజుల్లో క్రూడ్ ఆయిల్ ధరలు 70 డాలర్ల వరకు బ్రెంట్ ఆయిల్ ధరలు 75 డాలర్ల వరకు పడిపోయే వీలుందని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. అంటే పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభం కావడానికి ముందు వున్న ధరల వరకు చేరతాయన్న మాట. ఈ లెక్కన ప్రపంచ వ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు భారీగా తగ్గాల్సిన అవసరం వుందని నిపుణులు చెబుతున్నారు. ఇతర దేశాల సంగతి ఎలా వున్నా భారత్‌లో అయితే ఆయిల్ కంపెనీల మనోగతం మరో విధంగా వుంది. పశ్చిమాసియా సంక్షోభం వల్ల మొదటి నెలన్నర రోజుల పాటు ఆయిల్ ధరలు పెరిగినా తాము పాత ధరల కు సరఫరా చేసి భారీ నష్టాలను చవిచూశామని, వీటిని పూడ్చుకునేందుకు మరో రెండు లేదా మూడు నెలల పాటు ఇవే ధరలు కొనసాగాలని ఆయిల్ కంపెనీలు కోరుతున్నట్లు చెబుతున్నారు. ఒకవేళ రాజకీయంగా ఒత్తిడి వస్తే నాంకే వాస్తేగా రెండు నుంచి మూడు రూపాయల వరకు తగ్గేవీలుందని నిపుణులు చెబుతున్నారు.

# పిఎం కిసాన్ సొమ్ము

>> మొత్తం మీద 31,15,499గా నిర్ధారించబడి ఆమేరకు రూ.623 కోట్ల మేర పిఎం కిసాన్ పథకం ప్రయోజనాలను పొందుతున్నారు. ఇక బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించనున్నారు. ఇదే సమయంలో పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి పిఎం ఫసల్ యోజన సహా వివిధ వ్యవసాయ పథకాలను కూడా ప్రారంభించనున్నారు. కాగా 2019లో ప్రారంభించిన పిఎం కిసాన్ పథకం కింద ఇంతవరకు రూ.4.46 లక్షల కోట్లను రైతులకు అందజేసినట్టు కేంద్ర వ్యవసాయ మంత్రి పేర్కొన్నారు. కాగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన కింద కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ నెల 20వ తేదీన రూ.2 వేలు జమ చేయనుండగా, రైతు భరోసా పథకం కింద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30వ తేదీన రూ.6 వేలను రైతుల ఖాతాల్లో వేయనుంది.

# గేట్‌వే పాల్కన్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడి అరెస్టు

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రెండేళ్ల క్రితం హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటై స్వల్ప వ్యవధిలో ఏడు వేల మందికి పైగా డిపాజిటర్లను ముంచి నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా దోచుకుని బోర్డు తిప్పేసిన గేట్ వే పాల్కన్ సంస్థ గోల్‌మాల్ వ్యవహారంలో మరో మోసగాడిని సిఐడి అరెస్టు చేసింది. ఆ సంస్థ అప్పట్లో దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో 7056 మంది డిపాజిటర్లను ముంచి 4215 కోట్ల రూపాయలను దోచుకోవడం తెలిసిందే. ఇందులో 4065 మంది నుంచి 792 కోట్ల రూ పాయలను క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ లిమిటెడ్ పేరిట వసూలు చేసి ంది. బాధితుల ఫిర్యాదు మేరకు మొదట సైబరాబాద్‌లో ఈ సంస్థపై కేసు నమోదు కాగా అనంతరం ఈ కేసును సిఐడికి బదలాయించారు. ఈ కేసు విచారణ సిఐడికి వచ్చాక వేగం పెరిగి వరుసగా దోషులు అరెస్టవుతూ వచ్చారు. తా జాగా కంపెనీ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు షేక్ మొహియుద్దీన్‌ను సిఐడి అరెస్టు చేసింది. నిందితుడిని ముంబాయిలో అరెస్టు చేసిన సిఐడి అధికారులు అతన్ని హైదరాబాద్‌కు తరలించి ఇక్కడి కోర్టులో హాజరు పరిచి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో మొహియుద్దీన్ తప్పుడు పత్రాలతో 7.53 కోట్ల రూపాయలను పొందినట్లు సిఐడి గుర్తించింది. ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతుందని సిఐడి డిజి చారుసిన్హా మీడియాకు తెలిపారు.

# ప్రజాప్రతినిధుల కోర్టులో మీనాక్షి నటరాజన్‌పై ఫిర్యాదు పిటిషన్ దాఖలు

**హైదారబాద్, జూన్ 19,ప్రభాతవార్త:** ప్రజాప్రతినిధుల కోర్టులో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌పై ప్రైవేట్ కంప్లెంట్ పిటిషన్ దాఖలైంది నారాయణపేట జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత కంభం శివకుమార్ రెడ్డి తనను లైంగికంగావేధింపులకు పాల్పడుతూ చంపుతానని బెదిరించినా, ఆయనపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకోవడం లేదంటూ శ్రీలత అనే మహిళ గతంలో నాంపల్లి కోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన నాంపల్లి కోర్టు శ్రీలత దాఖలు చేసిన పిటిషన్ కేసు తమ పరిధిలోకి రాదని పేర్కొంటూ పిటిషన్ ను రిటర్న్ చేయడమే కాకుండా ప్రజాప్రతినిధుల కోర్టుకు వెళ్లాలని సూచించింది. శుక్రవారం శ్రీలత ప్రజాప్రతినిధుల కోర్టులో కొత్త పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌లో మీనాక్షినటరాజన్‌తోపాటు ఏడుగురిని ప్రతివాదులుగా చేర్చింది. ఈ పిటిషన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టు త్వరలోనే విచారణ చేపట్టనుంది.

# అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

## సోమవారం విచారణకు రావాలని ఆదేశం

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో కీలక పరిణామం

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన సంధ్య థియే టర్ తొక్కిసలాట ఘటనలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. 2024 డిసెంబరు ఐదవ తేదీ రాత్రి పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీమియర్ షో సమయంలో తొక్కిసలాట జరగగా ఒక మహిళ చని పోవడం, ఆమె కుమారుడు ఇప్పటికీ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడు తుండడం తెలిసిందే. దీనిపై చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో అల్లు అర్జున్ 11వ నిందితుడుగా ఉండడం తెలిసిందే. నాటి కేసులో సంధ్య థియేటర్ నిర్వాహకులను అక్కడి సిబ్బందిని పోలీసులు అరెస్టుచేసి జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ నాంపల్లి కోర్టులో జరుగుతోంది. మొత్తం 23 మంది నిందితులు వున్న ఈ కేసు విచారణ వచ్చే సోమవారం జరగనుంది. ఈ విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు శుక్రవారం సమన్లు జారీ చేసింది. అల్లు అర్జున్‌తో పాటు మిగతా నిందితులకు కూడా కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టుచేసి చంచల్‌గూడజైలుకు తరలించగా ఆయన ఒకరోజు పాటు రిమాండు ఖైదీగా ఉండడం తెలిసిందే.

# ఎపి మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రమ్మానాయుడుకు బెయిల్ మంజూరు.. జైలు నుంచి విడుదల

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** నగర శివార్లలోని గండిపేట్ మండలంలోని పదెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు నకిలీపత్రాలు, తప్పుడు జిఒలు సృష్టించిన కేసులో అరెస్టయిన వైసిపి మాజీ ఎంఎల్ఎ బొల్లా బ్రహ్మానాయుడుకు రంగారెడ్డి జిల్లా కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. గత నెల 23న వెలుగుచూసిన ఈ కేసులో మొదట ముగ్గురు నిందితులు అరెస్టవగా ఆ తరువాత మరో ఇద్దరు పట్టుబడడం తెలిసిందే. ఈ కేసులో అసలు నిందితుడు బొల్లా బ్రహ్మానాయుడు అజ్ఞాతంలో వెళ్లి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం దీనిని డిస్మిస్ చేయడం, అనంతరం ఆయనను ఈ నెల 5న తమిళనాడు కాంచీపురంలో తలదాచుకున్నచోట అరెస్టు చేయడం విదితమే. రెండు వారాలుగా చంచల్‌గూడ జైల్లో ఉన్న బ్రహ్మానాయుడును పోలీసులు మూడు రోజులపాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. అనంతరం ఆయనను రంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపరిచారు. ఇదే సమయంలో బ్రహ్మానాయుడు తరపున బెయిల్ పిటిషన్ దాఖలు కాగా దీనిని విచారించిన న్యాయమూర్తి ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలని, పోలీసుల విచారణకు అడ్డంకులు కల్పించవద్దని ఆదేశించారు. రెండు ష్యూరిటీలు సమర్పించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల దరిమిలా బెయిల్ పత్రాలను సాయంత్రం నాలుగు గంటల సమయంలో బ్రహ్మానాయుడు తరపు న్యాయవాదులు చంచల్‌గూడ జైలు అధికారులకు అందజేసిన తరువాత ఆయన జైలు నుంచి విడుదలయ్యారు.

# ఫిన్‌లాండ్‌లో హైదరాబాద్ విద్యార్థి మణిదీప్ అదృశ్యం

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** తెలంగాణకు చెందిన ఓ విద్యార్థి విదేశాల్లో అదృశ్యమై 45 రోజులు గడుస్తున్నా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఫిన్‌లాండ్‌లో బీటెక్ చదువుతున్న మణిదీప్‌రెడ్డి ఎక్కడున్నాడో తెలియక కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. తమ కుమారుడిని క్షేమంగా తీసుకురావాలని ప్రభుత్వాలను వేడుకుంటు న్నారు. హైదరాబాద్ వనస్థలిపురంలోని వైదేహినగర్‌కు చెందిన మణిదీప్‌రెడ్డి ఉన్నత చదువుల కోసం ఫిన్‌లాండ్ వెళ్లాడు. లాతి పట్టణంలోని ఎలయూటీ యూని వర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గత నెల 4న తల్లిదండ్రులతో చివరిసారిగా మాట్లాడిన మణిదీప్ మే 5వ తేదీ నుంచి ఫోన్‌కు స్పందించకపోవడంతో కుటుంబసభ్యుల్లో ఆందోళన మొదలైంది. ఫిన్‌లాండ్ లోని స్నేహితులు, తెలిసిన వారిని రూమ్‌కు, కాలేజీకి పంపించినా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో అక్కడ మిస్సింగ్ కేసు కూడా నమోదు చేశా రు. అయినా, ఇప్పటివరకు మణిదీప్‌రెడ్డి ఆచూకీ తెలియలేదు. 45 రోజులు గడుస్తున్నా ఫిన్‌లాండ్ అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, అధికారులు చొరవ తీసుకొని తమ కుమారుడి ఆచూకీ కనుగొని క్షేమంగా తీసుకురావాలని మణిదీప్‌రెడ్డి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

**తెలంగాణ హైకోర్టులో పిటిషన్..**

ఫిన్‌లాండ్‌లో చదువుతున్న భారతీయ విద్యార్థి అదృశ్యంపై వివరణ ఇవ్వాలంటూ కేంద్రానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అదృశ్యంపై ఇచ్చిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యలు వివరించాలంటూ కేంద్రం, ఫిన్‌లాండ్‌లోని భారత రాయబార కార్యాలయం, తెలంగాణ పోలీసులు తదితరులకు నోటీసులు జారీ చేసింది. తమ కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదంటూ తల్లిదండ్రులు జి.మర్ణత, ముత్యంరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. న్యాయమూర్తి జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిష నర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ మణిదీప్ మే 5న తల్లితో చివరిసారిగా మాట్లాడారని తెలిపారు. అనంతరం ఎన్నిసార్లు ఫోన్‌చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. కేంద్రం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పోలీసులు కేసు నమోదు చేశారని, దర్యాప్తు కొనసాగుతోందన్నారు. దర్యాప్తుపై తదుపరి వివరాలను సమర్పించాలని ఆదేశిస్తూ ఇరు వాదనలు విన్న న్యాయమూర్తి విచారణను ఈ నెల 24కు వాయిదా వేశారు.

## రాబడి రూ. 39,045.24 కోట్లు

## అంతకుముందు నెల కంటే పెరిగిన రెవెన్యూ

## రూ.37,412.33 కోట్ల వ్యయం

# ప్రభుత్వ ఖజానాకు జోష్

## మే నెలలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదిక

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ ఖజానా ఆర్థిక పరిస్థితి క్రమేపీ మెరుగుపడుతోంది. దీనికి తోడు ఆదాయం కన్నా వ్యయం ఎక్కువగా ఉంటుండగా, ఈ సారి రాబడి ఎక్కువగా ఉండటం విశేషం. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోని రెండో నెల అయిన మే లో ప్రభుత్వానికి రూ.39,045.24 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఇందులోంచి అన్ని పద్దుల కింద రూ.37,412.33 కోట్లను ప్రభుత్వం వ్యయం చేసింది. అయితే మే నాటికి రూ.5,038.34 కోట్ల భారీ లోటుగా మారింది. అలాగే ద్రవ్యలోటు మే నాటికే రూ. 10,595.98 కోట్లకు చేరింది. ఇది వార్షిక బడ్జెట్ అంచనాలో 18.13 శాతానికి సమానం. ఈ మేరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ మే నెలకు సంబంధించి ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. దీని ప్రకారం రూ.15,494.93 కోట్ల పన్ను ఆదాయం రాష్ట్రానికి సమకూరింది. ప్రతి నెలా వసూలయ్యే పన్ను రాబడి కంటే ఎక్కువ ఇది. ఇక పన్నేతర రాబడి రూ. 1443.87 కోట్లు వచ్చింది. ఏప్రిల్‌లో పన్నేతర రాబడి రూ.359 కోట్లు మాత్రమే. మే నెలలో భూముల అమ్మకం ద్వారా పన్నేతర రాబడి పెరిగినట్లు తెలుస్తోంది. జీఎస్టీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, సేల్స్ ట్యాక్స్, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాలు, కేంద్ర పన్నుల్లో వాటా, ఇతర పన్నులు సుంకాలు కలిపి ఏప్రిల్ నెలలో రూ.10,598.33 కోట్లు సమకూరగా, మే నెలలో రూ.15,494.93 కోట్లు రావడం గమనార్హం. ప్రతి నెలా రాష్ట్ర ఖజానాకు సగటున రూ.13 వేల కోట్ల పైచిలుకు పన్ను రాబడి ఉంటుంది. కానీ మే నెలలో ఏకంగా రూ.15 వేల కోట్ల మార్కు దాటడం గమ నార్హం. వస్తు సేవల పన్ను (జీఎస్టీ)లో పెరుగుదల నమోదు కావడం వల్లే పన్ను రాబడి ఎక్కువగా వచ్చి నట్లు అధికార వర్గాలు వివరిస్తున్నాయి. ఏప్రిల్‌లో జీఎస్టీ కింద రూ.3,155 కోట్లురాగా, మే నెలలో రూ.6,536 కోట్లు సమకూరాయి. ఇక ఏప్రిల్ నెలలో తీసుకున్న రుణంలో ప్రభుత్వానికి రూ.11,413.93 కోట్లు నికరంగా చేతి కందాయి. మే నెలలో మరో రూ.6 వేల కోట్ల రుణాన్ని సమీకరించింది. కానీ ఈ సొమ్ము పాత అప్పుల కిస్తీలు, వడ్డీలకే జమ చేసింది. ఇవి పోనూ అదనంగా ప్రభుత్వం ఖజానా నుంచే మరో రూ. 817 కోట్ల సొమ్మును చెల్లించింది. ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ప్రభుత్వానికి అందిన రుణాల నికర సొమ్ము రూ. 10,595.98 కోట్లు. ఇలా పన్నులు, పన్నే తరాలు, కేంద్ర గ్రాంట్లు, అప్పులన్నీ కలిపి రాష్ట్రానికి మే నెల నాటికి రూ.39,045.24 కోట్లు రాబడి సమకూ రింది. ఇందులోంచి అన్నిపద్దుల కింద రూ. 37,412.33 కోట్లను ప్రభుత్వం వ్యయం చేసింది. సం క్షేమ పథకాలకు రూ.9,929.84 కోట్లు, వడ్డీ చెల్లింపు లకు రూ. 4,658.27 కోట్లు, ఉద్యోగుల జీత భత్యాలకు రూ. 8,324.21 కోట్లు, పెన్షన్లకు రూ.4,758.64 కోట్లు, సబ్సిడీలకు రూ.5,809.01 కోట్లు ఖర్చుపెట్టింది.

# చైనాకు కౌంటర్‌గా భారత్ భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు

**ఇటానగర్, జూన్ 19:** చైనా తన భూభాగంలో భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుకు కేవలం 50 కిలోమీటర్ల దూరంలో టిబెట్‌లోని యార్లంగ్ త్సాంగ్‌పో నదిపై ప్రపంచంలోనే అత్యంత భారీ జలవిద్యుత్ ప్రాజెక్టును నిర్మిస్తూ భారత్‌కు ప్రమాదకరంగా తయారవుతుండటంతో అందుకు ధీటుగా భారత్‌కూడా భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధం అయింది. ఎగువన చైనా నిర్మిస్తున్న ఈ భారీ ఆనకట్ట వల్ల భారత దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు తీవ్ర నీటి కొరత ఏర్పడటంతో పాటు, అకస్మాత్తుగా వరదలు ముంచెత్తే ప్రమాదంకూడా ఉంది. ఈ ఊహించని వ్యూహాత్మక సవాలును ధీటుగా ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం వెంటనే సిద్ధం అయింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని సియాంగ్ నదిపై భారత్ ఓ ప్రతిష్టాత్మక బహుళార్థసాధక ప్రాజెక్టును వేగవంతం చేస్తోంది. సియాంగ్ ప్రాజెక్ట్ వ్యూహాత్మక ప్రాధాన్యత నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించబోయే ఈ సియాంగ్ ప్రాజెక్ట్ పూర్తయితే భారతదేశంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుగా సరికొత్త రికార్డు సృష్టిస్తుంది. దీని ద్వారా ఏటా దాదాపు 47 బిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని అంచనా వేస్తున్నారు. సుమారు 1.5 లక్షల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో నిర్మించే ఈ ఆనకట్ట కేవలం రికార్డు విద్యుత్ ఉత్పత్తి కోసమే కాకుండా, దిగువ ప్రాంతాలలో వరదలను సమర్థవంతంగా నియంత్రించడానికి ఉపయోగపడుతుంది.



సామర్థ్యం పరంగా చైనా నిర్మిస్తున్న మెదోగ్ జలవిద్యుత్ ప్రాజెక్ట్ దాదాపు 60 వేల మెగావాట్ల సామర్థ్యంతో ఇప్పటికే నిర్మాణ దశకు చేరుకుంది. దానికి భిన్నంగా భారత్ తలపెట్టిన ప్రాజెక్ట్ ప్రస్తుతం ప్రాథమిక అధ్యయన, సర్వే దశలోనే కొనసాగుతోంది. చైనా ప్రాజెక్ట్‌తో పోల్చితే మనది పరిమాణంలో చిన్నదైనప్పటికీ దేశ జలవనరుల భద్రతను కాపాడటంలో ఇది ఒక కీలకమైన రక్షణ కవచంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

# రుతుపవనాల పట్ల అప్రమత్తం

## ఎస్పీడిసిఎల్ సిఎండి ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు వ్యాపిస్తున్న నేపథ్యంలో అందుకు సన్నద్ధంగా నిర్వహిస్తున్న పోల్స్ అండ్ లైన్స్ స్పెషల్ డ్రైవ్ - వాక్ అలోంగ్ ది లైన్ కార్యక్రమంలో భాగంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ జితేష్ వి. పాటిల్ వివిధ ప్రాంతాల్లో అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా మాట్లాడతూ విద్యుత్ లైన్లకు సమీపంగా ఉన్న చెట్ల కొమ్మలను సకాలంలో తొలగించడం ద్వారా విద్యుత్ అంతరాయాలు నివారించడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నిర్వహణ పనుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, విద్యుత్ సరఫరా నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు 11 కేవీ విద్యుత్ లైన్‌ను పరిశీలించిన ఆయన నెట్‌వర్క్‌లో గుర్తించిన లోపాలపై అధికారులకు, సిబ్బందికి అవసరమైన సూచనలు జారీ చేశారు. చెట్ల కొమ్మల కత్తిరింపు (ట్రీ ట్రిమ్మింగ్) కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొని పనుల పురోగతిని పరిశీలించారు. విద్యుత్ నెట్‌వర్క్‌ను లైన్‌టులైన్ సర్వే ద్వారా సమగ్రంగా పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు, హెచ్‌టీ, ఎల్‌టీ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, జంపర్లు, సర్వీస్ కనెక్షన్లు తదితర మౌలిక సదుపాయాల పరిస్థితిని సమీక్షి ంచారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన నెట్‌వర్క్ లోపాలు, విద్యుత్ వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై సిబ్బంది తక్షణమే స్పందించి త్వరితగతిన పరిష్కారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది

# పాస్‌పోర్టు ధ్రువీకరణ ప్రక్రియలో పోలీసుల ఉత్తమ ప్రతిభ

## విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్ నుంచి ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్న డిజిపి ఆనంద్

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** పాస్‌పోర్టు ధృవీకరణ ప్రక్రియలో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు తెలంగాణ పోలీసు శాఖకు కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటించిన ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్మార్మెన్స్ అవార్డును డిజిపి సి.వి ఆనంద్ అందుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం జ రిగిన ఓ కార్యక్రమంలో విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ జయశంకర్ చేతుల మీదుగా డిజిపి ఈ అవార్డును అందుకున్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో పాస్‌పోర్టు ధృవీకరణకు సంబంధించి పోలీసులు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించిన విదేశాగ శాఖ ఇందులో తెలంగాణ పోలీసులు అమలు చేస్తున్న పద్ధతులు ఉత్తమమైనవిగా నిర్ణయించి, ఇందుకు గానూ ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్మార్మెన్స్ అవార్డును ఇటీవలే ప్రకటించడం తెలిసిందే. ఈ కార్యక్రమంలో విదేశాంగ శాఖ అధికారులతో పాటు ఆయా రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి జిపి ఆనంద్ మాట్లాడుతూ పాస్ పోర్టు జారీ ప్రక్రియలో పోలీసు ధృవీకరణ కీలకమైనదని అన్నారు.



పాస్‌పోర్టు ధ్రువీకరణలో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్ నుంచి ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు అందుకుంటున్న డిజిపి ఆనంద్

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందు కు రాష్ట్ర పోలీసు శాఖ ఈ విషయంలో ఉత్తమ పద్ధతులను ఎంచుకుని, దానిని విజయవంతంగా అమలు చేస్తోందని ఆయన తెలిపారు. రాష్ట్ర పోలీసులు చూపుతున్న నిబద్ధతకు గుర్తింపుగా అవార్డు లభించినట్లుగా తాను భావిస్తున్నట్లు ఆనంద్ తెలిపారు. సాంకేతికతను క్షేత్రస్థాయిలో అమ లు చేస్తూ ప్రజలకు మరింత మేలు చేయడం తమ లక్ష్యమని ఆయన వెల్లడించారు. 2025.. 2026లో రాష్ట్రంలో అందిన ఎనిమిది లక్షల 67 వేల 741 పాస్‌పోర్టు దరఖాస్తుల్లో ఇప్పటివరకు ఎనిమిది లక్షల 67 వేల 452 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశామని, ఇది 99 శాతంగా డిజిపి తెలిపారు. 2015 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ పోలీసు శాఖకు ఈ అవార్డు రావడం ఇది ఏడవ సారిగా డిజిపి ఆనంద్ తెలిపారు. పాస్‌పో ర్టుల దరఖాస్తు పరిశీలనలో కృత్రిమ మేధస్సు ను వాడుతున్నట్లు ఆయన తెలిపారు.



# సుప్రీంలో తమిళనాడు సిఎం విజయ్‌కు ఊరట

## సిబిఐ దర్యాప్తు కోసం దాఖలు చేసిన పిటిషన్ తిరస్కృతి

**న్యూఢిల్లీ, జూన్ 19:** తమిళనాడులోని అధికార తమిళగ వెట్రి కజగం పార్టీకి సుప్రీంకోర్టులో భారీ ఉపశమనం లభించింది. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకునేందుకు టీవీకే అధినాయకత్వం గుర్రాల బేరాలకు పాల్పడుతోందంటూ, దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం డిస్మిస్ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనాతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించడానికి నిరాకరిస్తూ ఇందులో పేర్కొన్న అంశాలన్నీ ఎటువంటి ఆధారాలు లేని అస్పష్టమైన ఆరోపణలు అని తేల్చిచెప్పింది. మదురైకి చెందిన కేకే రమేష్ అనే వ్యక్తి దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో వివిధ రాష్ట్రాల్లో అధికార పార్టీలు అవినీతి, బెదిరింపులకు పాల్పడుతూ విపక్ష ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నాయని, దీనిపై కోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు.

పిటిషనర్ తరపు న్యాయవాది జె.ఆర్. సుకిన్ వాదనలు విన్న అనంతరం ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఈ రిట్ పిటిషన్ ఎటువంటి ఆధారాలు లేని అస్పష్టమైన, ఊహాజనిత, సాధారణ ఆరోపణలపై ఆధారపడి ఉంది. దీనిని విచారించడానికి మాకు ఎలాంటి బలమైన కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను తోసిపుచ్చింది. అంతకుముందు మంగళవారమే ఈ వ్యవహారంపై మద్రాస్ హైకోర్టు కూడా కీలక తీర్పునిచ్చింది. తమిళనాడులో నలుగురు ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి అధికార టీవీకే పార్టీలో చేరడం వెనుక భారీ అవినీతి జరిగిందని, సీబీఐ దర్యాప్తు కావాలని దాఖలైన పిల్ ను చీఫ్ జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారి, జస్టిస్ జి. అరుళ్ మురుగన్‌ల ధర్మాసనం కొట్టివేసింది.

# కెసిఆర్ ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్

## బిజెపి నేత చీకోటి ప్రవీణ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుల విచారణ, వాంగ్మూలం నమోదు కొనసాగుతూనే వుంది. నెల రోజులుగా వేగంగా జరుగుతున్న ఈ ప్రక్రియలో భాగంగా శుక్రవారం నాడు బిజెపి నేత చీకోటి ప్రవీణ్‌ను సిట్ అధికారులు విచారించారు. బషీర్‌బాగ్‌లో గల సిట్ కార్యాలయంలో చీకోటి ప్రవీణ్‌ను గంటన్నర పాటు విచారించిన సిట్ అధికారులు నాటి ఘటనలపై ఆయన నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. నాటి బిఆర్ఎస్ సర్కారు అధినేత కెసిఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించారు. విచారణకు ముందు ఇదే ప్రాంతంలో ని అమ్మవారి దేవాలయంలో పూజలు చేసిన చీకోటి ప్రవీణ్ మీడియా ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ పాపం మొత్తం కెసిఆర్‌దేనని, ఆ సమయంలో సర్కారులో చక్రం తిప్పిన కెటిఆర్‌కు కూడా ఇందులో భాగం వుందని ప్రవీణ్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వల్ల నాటి పాలకులు వేల మంది వ్యక్తిగత సమాచారం విన్నారని, ఇది నీచమైన చర్యగా ఆయన తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్‌లో బాధితులు ప్రతి పక్ష నాయకులతో పాటు బిఆర్ఎస్ నాయకులు ఎక్కువగానే వున్నారని ఆయన తెలిపారు. తాను అనుకున్నది 200 మంది వరకు ఫోన్‌లు ట్యాపింగ్ అయి వుండవచ్చని, కానీ రెండు వేల మందికి పైగా ఫోన్‌లను ట్యాపింగ్ చేశారని, ఇది దారుణమైన నేరంగా చీకోటి అభివర్ణించారు. తనతో పాటు తన సతీమణి, ఇంట్లో పనిచేసే వాళ్ల ఫోన్‌లు కూడా ట్యాపింగ్‌కు గురైందని ఆయన తెలిపారు. అప్పట్లో బిఆర్ఎస్‌కు చెందిన ఎంఎల్ఎలతో పాటు వారి భార్యలు, కుటుంబ సభ్యుల ఫోన్ లు

కూడా ట్యాప్ అయ్యిందని ఆయన తెలిపారు. వీరంతా అసమ్మతి స్వరం వినిపించి నట్లు తేలడంతో కెసిఆర్ ఆదేశాల మేరకు ఎస్ఐబి పోలీసులు ట్యాపింగ్ చేశారని చీకొటి ఆరోపించారు. అప్పట్లో ఎస్ఐబి, టాస్క్‌ఫోర్స్ అధికారు లు ఎవరో తనకు తెలియదని కెసిఆర్ చెప్పారని, పదవీ విరమణ చేసిన పలువురికి ఈ విభాగాల్లో పోస్టింగులు ఇచ్చింది కెసిఆర్ అన్న విషయం అందరికి తెలిసిందేనని చీకోటి తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌పై సమగ్రంగా విచారించాలని, బాధ్యులైన వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నాపై ఈడీ దాడులు జరగడానికి ముందు నా ఫోన్ సంభాషణలు విన్నారని ఆయన ఆరోపించారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఎసిఐ అంతర్జాతీయ గుర్తింపు

**శంషాబాద్, జూన్ 19, ప్రభాతవార్త :** జీఎంఆర్ ఏరో నేతృత్వంలోని కన్సార్టియం - జీఎంఆర్ హైదరా బాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జిహెచ్ఐఎఎల్) శుక్రవా రం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్ఐఎ) ఎయిర్ పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఎసిఐ) వరల్డ్ నుంచి ఏసీఐ యాక్సెసిబిలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ అక్రెడిటేషన్ - లెవల్ 2ను పొంది నట్లు ప్రకటించింది. ఈ గుర్తింపు, తగ్గిన చలన సామర్థ్యం కలిగిన ప్రయాణికుల కోసం అందుబాటు సౌకర్యాల కల్పనలో ఆర్‌జీఐఏ నిబద్ధతను ప్రతిబింబిస్తోంది. ప్రతి ప్రయాణికుడికి సమగ్ర, అంతరా యం లేని, గౌరవప్రద ప్రయాణ అనుభవానికి విమానాశ్రయం నిరం తరం చేస్తున్న కృషికి ఇది ముఖ్య మైన మైలు రాయిగా నిలు స్తుంది. జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమి టెడ్ సీఈఓ కదిర్ కదిరవన్ మాట్లాడుతూ ఈ గుర్తింపు మాకు యాక్సెసిబిలిటీ అనేది కేవలం నిబంధనల అమలు మాత్రమే కాద`ని, ప్రతి ప్రయాణి కుడికి సమాన మైన అనుభవాన్ని అందించడంలో అంతర్భాగమనే మా విశ్వాసాన్ని మరింత బలపరుస్తోందన్నారు.

# ఆకాశానికి కూరగాయల ధరలు

## రెట్టింపు పెరిగిన రేట్లు

## రూ.30 నుండి రూ.60కి పెంపు

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూరగాయల ధరలు రెట్టింపు అయి ఆకాశాన్నంటుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలతో సామాన్య జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏం కొనేటట్టు, తినేటట్టు లేదన్న పరిస్థితిని సామాన్య ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తోంది. హైదరాబాద్‌తో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో సైతం కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు ధరలు పైపైకి వెళ్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతు న్నారు. గతంలో కిలో చొప్పున కొనుగోలు చేసిన కూరగాయాలను ప్రస్తుతం అర కిలో కొనడానికి కూడా నిరాసక్తి కనబరుస్తున్నారు. హైదరాబాద ్‌లోని ప్రధాన మార్కెట్లతో పాటు, రాష్ట్రంలోని పలు మార్కెట్లల్లో కిలో కూరగాయలు కొనాలంటే రూ.50 నుంచి రూ.100 చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. పచ్చిమిర్చి నుంచి పాలకూర వరకు, ఉల్లిపాయల నుండి వెల్లుల్లిపాయల వరకు ఇలా ఏ కూరగాయలు కొనాలన్నా జేబులు గుల్లా చేసుకోవాల్సిందే. మొన్నటి వరకు కిలో టమాట రూ.30 ఉండగా ప్రస్తుతం రెట్టింపు అయి అది రూ.60కి పెరిగింది. చింతపండు పాత ధర రూ.90కు అమ్మగా, ఇప్పుడు కొత్త ధర రూ.120, క్యాప్సికం ఇప్పటి వరకూ రూ.60 ఉండగా, కొత్త ధర రూ.80, బీరకాయ రూ.60 నుండి రూ.80, క్యారెట్ రూ.60 నుండి రూ.80, దొండకాయలు రూ.40 నుండి రూ.60, వెల్లుల్లి రూ.90 నుండి రూ.120, ఉల్లిగడ్డ పాత రూ.30 నుండి రూ.40, ఆలుగడ్డ రూ.30 నుండి రూ.40, చిక్కుడు రూ.80 నుండి రూ.100లు, పచ్చిమిర్చి పాత రూ.60 ఉండగా ఇప్పుడు రూ.80,



వంకాయలు ఇప్పటి వరకూ రూ.40 ఉండగా, అది ఇప్పుడు రూ.70 చొప్పున పెరిగాయి. ఇవి కాకుండా బెండకాయ రూ.40, గోరుచిక్కుడు రూ.40, మునగకాయ రూ.80, సోరకాయ ఒక్కంటికి రూ.20లు, పాలకూర రూ.40లు, బీట్‌రూట్ రూ. 50లు, తోటకూర రూ.30, చుక్క కూర రూ. 40, అల్లం రూ.100, బీన్స్ రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు. కాగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గడం, సాగు నీటి వసతి, ఇతర కారణాల వల్ల కూరగాయలను పండించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. పాలకూర, తోటకూర, కొత్తిమీర, మెంతి కూర తదితర ఆకుకూరలు బోరు మోటార్ల నుంచి నీరు అందక ఎండిపోతున్నాయని అంటున్నారు. దీంతో ఆకు కూరలు మార్కెట్ రాక ధరలు పెరిగాయని విక్రయదారులు చెబుతున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘం చొప్పదండి, జిల్లా కరీంనగర్
బహిరంగ వేలము ప్రకటన - 2వ పిలుపు తేది: 19.06.2026
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ తెలిపిన ప్రదేశములలో గల టేకు చెట్లను తేది: 24-06-2026 బుధవారము రోజున ఉ.11.00 గంటలకు చొప్పదండి పురపాలక సంఘ కార్యాలయములో బహిరంగ వేలం నిర్వహించబడును.
1) 13వ వార్డు పరిధిలోని ప్రతిభ విద్యానికేతన్ స్కూల్ ముందు గల రక్షిత మంచినీటి సరఫరా OHSR ట్యాంక్ చుట్టు గల (49) టేకు చెట్లను వేలం వేయుట
2) 8వ వార్డు పరిధిలోని కుడి చెరువు దగ్గర గల రక్షిత మంచినీటి సరఫరా బావి చుట్టు గల (32) టేకు చెట్లను వేలం వేయుట
కావున ఆసక్తి గల వారు కమిషనర్, చొప్పదండి మున్సిపాలిటీ గారి పేరున ఏదేని జాతీయ బ్యాంక్ యందు రూ.10,000/-లు D.D. చెల్లించి తమ యొక్క దరఖాస్తుతో పాటు చెల్లించిన D.D.లను జతపరచి తేది: 23-06-2026 మంగళవారము సా.5.00 ల లోపు కార్యాలయము ఆఫీసు పని వేళలలో వేలము నిబంధనలు తెలుసుకొని దరఖాస్తులు అందజేసి వేలము యందు పాల్గొనగలరు. (వేలములో పాల్గొను వారు మున్సిపల్ కార్యాలయమునకు ఎలాంటి బకాయిలు ఉండరాదు, వేలము హక్కులు పొందిన వారు వేలము పాట మొత్తము చెల్లించిన తరువాతనే టేకు చెట్లను కోయుటకు అనుమతి ఇవ్వబడును.) పూర్తి వివరములకై ఆఫీసు పని వేళలలో కార్యాలయమునందు సంప్రదించగలరు. సం/- కమిషనర్, పురపాలక సంఘం, చొప్పదండి
DIPR.No.4599-PP/CL/Advt/1/2026-27, తేది: 19.06.2026

వార్త

మనిషి అన్నవాడు ముందు ఆత్మాభిమానం కలిగి ఉండాలి. ఆత్మాభిమానం లేనివాడు అసలు మనిషిగా ఎదగలేడు.

- పాస్కల్

# సంతకాలైపోయాయి..ఇక.!


ప్రస్తుతానికైతే యుద్ధం ముగిసినట్లే. కానీ పశ్చిమాసియా మరోసారి రక్తసిక్తమయ్యే పరిస్థితులు వస్తే మూల్యం ఎవరు చెల్లించుకోవాలో నిర్దిష్ట పరిష్కారాలు దొరక్కుండా అయిందంటే అయిందనుకోవడం తాజా యుద్ధ విరమణకే చెల్లింది. చింత చచ్చినా పులుపు చావదంటారు. శరీరంలో చేవ చచ్చినా,చచ్చి చెడి రాజీ కోసం ఇరాన్ కాళ్లావేళ్లా పడి బతుకు జీవుడా!అని శాంతి ఒప్పందంతో బయటపడినా, శ్వేతసౌధాధిపతి డోనాల్డ్ ట్రంప్ 'పరిస్థితి అలాగే ఉంది' 'అతడనేక యుద్ధములనారితేరిన వాడన్న' రీతిలో 'యుద్ధము- శాంతి' అనగానే ఉవ్విళ్లూరే ఆయన తాజాగా కింద పడ్డా తానే గెలిచానంటున్నాడు. జరిగిందేదో జరిగింది. అయిపోయిందేదో అయిపోయింది. అని సరిపెట్టుకునే వాడు కాదాయన. ఇరాన్‌పై తాను మెత్తపడ్డానని అనుకునే వారు 'ఫూల్స్' అని సరిపెట్టేసుకున్నారు. దాంతో ఆయన అహం తీరినట్లుంది. ఎవరేమన్నా, ఎవరేమనుకున్నా సంతకాల తతంగం పూర్తయిపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఇరాన్ అమెరికాల మధ్య శాంతి ఒప్పందంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం నుంచి బయటపడేందుకు మార్గం సుగమమయినందుకు ఎల్లెడలా ప్రజలు సంతోషపడ్తున్నారు. కనుచూపు మేరలో పరిస్థితులు చక్కబడి నిత్యావసర వస్తువులపై పడిన అధిక రవాణా భారం తగ్గుతుందని ఆశిస్తున్నారు. అందుకు వడివడిగా ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయనే చెప్పాలి. ఇరాన్ ఓడరేవులపై నౌకాదళ దిగ్బంధాన్ని అమెరికా తొలగించింది. అమెరికాతో ఇరాన్ సంక్షిప్త స్థాయిలో తాత్కాలిక అవగాహన ఒప్పందమే కుదుర్చుకుంది. హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు రానున్న 60 రోజుల పాటు రవాణా రుసుములుండవు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై సంతకం చేసిన స్వల్ప వ్యవధిలోనే మూడు సౌదీ అరేబియా ట్యాంకర్లు, నౌకలు హార్ముజ్ జలసంధిని దాటాయన్న సమాచారం స్వాగతించదగినదే.మధ్యప్రాచ్య గల్ఫ్‌లో నిలిచిన నౌకలు గమ్యం చేరితే 85 మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురు ప్రపంచ దేశాలకు అందనుంది. ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలు ఎత్తివేతతో చమురు సరఫరా మెరుగుపడి వాటి ధరలు తగ్గుముఖం పడతాయి. యుద్ధ సమయంలో వివిధ సందర్భాల్లో, వివిధ దేశాల్లో, వివిధ ప్రధాన సంస్థలు విధించిన ఆంక్షలన్నీ ఒక్కటొక్కటిగా ఎత్తివేస్తున్నారు. కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ తమ ఆయిల్ ఫీల్డ్‌లను ఉత్పత్తికి సిద్ధం చేస్తోంది. హార్ముజ్‌పై ఇరాన్ గుత్తాధిపత్యానికి ఎలాంటి ఇబ్బంది కలుగని విధంగానే ఒప్పందంలో అంశాన్ని చేర్చుకోగలిగారు. అమెరికా, ఇరాన్ అవగాహనలోని 14 అంశాల ఒప్పందానికి ఇస్లామాబాద్ మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ బిట్వీన్ ది యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అండ్ ద ఇస్లామిక్ రిపబ్లికన్ ఆఫ్ ఇరాన్' అని పేరు పెట్టారు. ఇందులో లెబనాన్‌ను ఒప్పందంలో భాగం చేసినా ఇజ్రాయెల్ 'ఒట్టు తీసి గట్టు మీద' పెట్టింది. తాజా ఒప్పందం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు పెద్దఊరటనిచ్చే విషయం అనుకుంటున్నాం. కానీ అలా ఒప్పందం అమల్లోకి వచ్చిన అతిస్వల్ప వ్యవధిలో ఇజ్రాయెల్, లెబనాన్‌పై కాలుదువ్వుతోంది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 16 మంది మృతి చెందారు. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగిస్తోంది. లెబనాన్ అంశం కూడా తాజా ఒప్పందంలోని అంశాలే. మరి ఒప్పందం భవిత ఏమిటో ట్రంపే తేల్చాలి. అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసి తక్షణ అమల్లోకి ప్రవేశించిన అమెరికా ఇరాన్‌లు ఎవరి ధీమాతో వారు అపవేవో బీరాలు పలుకుతున్నాయి. సంధి ఒడంబడికల్లో ఎన్ని అమలవుతాయి, ఎన్ని ఉల్లంఘనలకు గురవుతాయన్నది సందిగ్ధంలో పడినప్పుడు పర్యవసానాల మాటేమిటో ఇతమిత్థంగా చర్చించినట్లు లేదు. కాగా ఇరాన్‌లో కుదిరిన ఒప్పందం ఫైనల్ కాదని, అదొక అవగాహన ఒప్పందమే. కనుక ఎప్పుడైనా ఇరాన్ ప్రవర్తన తనకు నచ్చకపోతే తూచ్ అని ఇరాన్‌పై బాంబులు తప్పవని ట్రంప్ బహిరంగంగానే హెచ్చరికలు చేశారు.ఫ్రాన్స్‌లో జరిగిన జి7సదస్సులో ట్రంప్ చేసిన వ్యాఖ్యలివి. నిజంగా సంధికుదిరిదానిని ఉభయ పక్షాలూ గౌరవించే పరిస్థితి ఉంటే ఇలాంటి వ్యాఖ్యలు రాకూడదు. వచ్చేసాయి అంతేకాదు ఉల్లంఘనలు కూడా జరిగిపోతున్నాయి. ఇలాంటి పరిణామాలు పశ్చిమాసియాను ఏ దిశగా తీసుకెళ్తాయో గమనించాల్సిందే. ఇదే తరుణంలో అమెరికన్ ఇంటెలిజెన్స్ విడుదల చేసిన నివేదికను బట్టి చూస్తే ఇరాన్ యుఎస్ స్నేహ బంధం ఎంతకాలం నిలిచి ఉంటుందో చెప్పలేం. అసలే 'అణు'మానాలతో కొనసాగుతున్న ప్రయాణానికి మరికొన్ని అనుమానాలు వైరానికి ఊపిరిపోస్తున్నట్లే ఉంది. హార్ముజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణ అణ్వాయుధం కంటే శక్తివంతమైనదని యుఎస్ ఇంటెలిజెన్స్ చెబుతోంది.అది నిజమే. అమెరికాను ఎదురించేందుకు ఏమాత్రం సరితూగని ఇరాన్ అమెరికా దాదాపు దాసోహం చేసుకోగలిగిందంటే ఇరాన్ పవర్ అదే. అందుకేనేమో ట్రంప్ కూడా యూటర్న్ తీసుకునేందుకు వీలైన వాక్యాలతో ముందస్తు హెచ్చరికలు చేసినట్లుగానే ఉంది. కాగా ఐరాస భద్రతా మండలి నిబంధనలకు లోబడి తుది ఒప్పందం కుదుర్చుకోవాలనే సూత్రప్రాయమైన నిర్దేశికతను పొందుపరుచుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ నిర్ణయమే కొసమెరుపు కాగలదు. చిల్లర పేచీల నెవరు తీరుస్తారన్న ప్రశ్నకు ట్రంప్ తానే గార్డియన్‌గా ఉంటానన్న ఒకే ఒక్క భరోసా సమాధానమిస్తుందని ఎదురు చూడాలి. లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సిందెవరో అమెరికా అధ్యక్షుల వారే తేల్చాలి.

దేశానికి గాని, సమాజానికి గాని సంఖ్యాబలం ఒక్కటే చాలదు. వారు ఎప్పుడూ అప్రమత్తులై, విద్యావంతులై ఉన్నప్పుడే ఆ జాతి బాగుపడుతుంది.



బి.ఆర్ అంబేద్కర్

మానవత్వాన్ని మించింది ఈ లోకంలో లేదు. మానవత్వం ఒక సముద్రం.అందులో రెండు చుక్కలు మలినం కలిసినంత మాత్రాన సముద్రం చెడిపోదు.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు

### ముఖ్యమంత్రి గారూ ఇదేనా మీ పాలన?

**తిరుపతి** జిల్లా వరదయ్యపాలెం మండలంలో 20 సంవత్సరాలక్రితం దళితుల అసైన్డ్ భూములక్రమించి కల్కి గోల్డెన్ టెంపుల్ కట్టాడు.కలెక్టరు నోటీసు ఇవ్వగా కల్కి కోర్టుకు వెళ్ళాడు. రెండు సంవత్సరాల క్రితం హైకోర్టు కల్కి పిటిషన్‌ను కొట్టేసింది.వెంటనే దళితులు వెళ్ళి మా భూములు మాకు అప్పగించండి అని తిరుపతి కలెక్టర్‌ను,వరదయ్యపాలెం తహసీల్‌దారుని కలవటంజరిగింది. కలెక్టర్‌చూస్తానన్నారు.తహసీల్‌దార్ మాత్రంఏదో అంటూ నాటకాలు ఆడుతున్నాడు. ముఖ్యమంత్రి గారూ మీరేమో భూములాక్రమిస్తే జైలుకు పంపుతాం అంటున్నారు. ఉత్తుత్తి ప్రగల్భాలుగా మీమాటలు మిగిలిపోతున్నాయి.మీ మాటలను అధికారులు పట్టించుకోవటం లేదు.వారిమీద చర్యలు తీసుకోండి.ఇంకా ఎన్నాళ్ళు?హైకోర్టు కల్కి కేసును హైకోర్టు కొట్టేసింది.తరువాత కేసు ఉపసంహారించుకున్నాడు.దళితులభూములు దళితులకు అప్పగించాల్సిన బాధ్యత జిల్లా అధికారులది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### మనుషుల్లో మార్పు రావాలి

**మనం,** మన ఇల్లు పచ్చగా వుంటే చాలు, మన చుట్టూ వున్న వారితో, పరిసరాలతో మనకు పని లేదు అనుకునే వాళ్ళు చాలామంది వున్నారు. వీళ్ల చదువుకోలేని అజ్ఞానులు అంటే అదీ కాదు. బాగా చదువుకున్నవాళ్ళే! మన ఇల్లు,గేటువరకే మనదని, దాని తర్వాత ప్రాంతం మనవి కాదని మన ఇంట్లో చెత్త చెదారాన్ని అక్కడ పడేస్తే, క్రిమికీటకాలు చేరి మన ప్రక్కవాళ్ళతో పాటు మనల్ని కుట్టి రోగాలను పుట్టిస్తాయని తెలుసు. అయినా వాళ్ళ పద్ధతి మార్చుకోరు. మనం తిరిగే ప్రతీ ప్రాంతం మనదే అనుకుని పరిశుభ్రంగా వుంచడానికి ప్రయత్నించరు. మన చుట్టూ వున్న పరిసరాల గురించి ఆలోచించాలంటే, ముందు మన మనసులో ఎలాంటి మలినాలు లేకుండా పరిశుభ్రంగా వుంచుకోవాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### నిధులను విడుదల చేయాలి

**తెలంగాణ** రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజ్‌లు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది.

-బి. కృష్ణయాదవ్, హైదరాబాద్

### ఆర్‌టీఐ వ్యవస్థను బలోపేతం చేయాలి

**భారత** ప్రజాస్వామ్యంలో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) 21 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఒక ముఖ్యమైన మైలురాయి. ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో ఈ చట్టం కీలకపాత్ర పోషించింది. అవినీతి వ్యవహారాలనువెలికితీయడం,ప్రజానిధుల వినియోగాన్ని పర్యవేక్షించడం, ప్రభుత్వ నిర్ణయాలపై సమాధానాలు రాబట్టడం వంటి అంశాల్లో ఆర్‌టీఐపౌరులకు శక్తివంతమైన ఆయుధంగా నిలిచింది.అయితే ప్రస్తుతం ఈచట్టం అమలులో పలు సవాళ్లు ఎదురవుతున్నాయి. దేశవ్యాప్తంగా సమాచార కమిషన్లలో 4.1లక్షలకుపైగా అప్పీలు పెండింగ్‌లో ఉండగా, ఒక్క ఏడాదిలోనే 2.4 లక్షల కొత్త కేసులు నమోదయ్యాయి. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. సమాచారం ఇవ్వడంలో ఆలస్యం లేదా నిరాకరణ ప్రజల్లో ప్రభుత్వాలపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది.ఆర్‌టీఐ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే పెండింగ్ కేసుల వేగవంతమైన పరిష్కారం,

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అక్రమ దత్తతలను అరికట్టాలి

**తెలుగు రాష్ట్రాలలో** దత్తత పేరిట సాగుతున్న శిశు విక్రయాలనుఅడ్డుకోవడం సామాజికబాధ్యత.ఇటీవలికాలంలో వెలుగు చూస్తున్న అక్రమ దత్తతలు,శిశు విక్రయ ముఠాల ఉదంతాలు ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి. సంతానంలేని దంపతుల ఆరాటాన్ని, పేదరికాన్ని ఆసరాగా చేసుకుని దళారులు వ్యాపారం చేస్తున్నారు. సాంకేతికతను వాడుకుంటూ రహస్య సంప్రదింపుల ద్వారా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. పిల్లల దత్తతకు చట్టబద్ధమైన మార్గం ఒక్కటే. కేంద్ర ప్రభుత్వ సంస్థ కారా మహిళా, శిశు సంక్షేమ శాఖల ద్వారానే ఈ ప్రక్రియ జరగాలి అక్రమ దత్తతలను అనుమతిస్తే బాలల అక్రమ రవాణా విపరీతంగా పెరిగిపోతుంది

- కె.రామారావు, హైదరాబాద్

### పెరుగుతున్న ధరలను నియంత్రించలేరా?

**పశ్చిమాసియా** ఘర్షణ కేవలం ఆప్రాంత సరిహద్దులకే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థికవ్యవస్థ గుండెకాయను తాకుతున్నాయి. ఈఘర్షణలు నేడు ప్రతి దేశపు వంటింటి బడ్జెట్‌ను, పారిశ్రామిక రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో సహజ వాయువు, చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్కసారిగా ఎగబాకాయి. భవిష్యత్తులో రాబోయే భారీ ద్రవ్యోల్బణానికి సంకేతం.

-పి. సుదర్శన్ నాయుడు, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# విస్తరిస్తున్న వికృత క్రీడ!

*దేశంలో ఈ రాక్షస క్రీడ చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉన్నది. సంఘటనలు జరిగినప్పుడు పోలీసుల హడావుడి, నాలుగైదు రోజుల పాటు నేతల పత్రికా ప్రకటనలు, ఆ తర్వాత మరిచిపోతున్నారు. ఈ రాక్షసక్రీడ ఇంత వికృత రూపం దాలుస్తున్నా నిందితులను సాక్ష్యాలతో న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షలు వేయించలేకపోతున్నారంటే ఏమనుకోవాలి. ప్రాణసమానంగా పెంచుకున్న తమ బిడ్డలు తమ కళ్లముందే చదువు, సంస్కారం ఉందనుకున్న వింత పశువుల వికృత చేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్ని ఊహించగలమా? అది ఎప్పటికైనా తీరుతుందా? పాలక పెద్దలు ఇప్పటికైనా మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకోవాలి. ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించేవారికి మాటలతో కాకుండా చర్యల ద్వారా తిరుగులేని హెచ్చరికలు అందించాలి. అప్పుడే ర్యాగింగ్ భూతాన్ని దేశం నుంచి పారద్రోలగలుగుతాం. చట్టాన్ని అమలు చేసే చిత్తశుద్ధి లేనప్పుడు, త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయలేనప్పుడు ఈ చట్టాలు, చర్చలు, అన్నీ నిష్ప్రయోజనమే.*

దామెర్ల సాయిబాబ

ఎన్ని చట్టాలు చేసినా, కఠిన చర్యలు తప్పవని పాలకులు ఎన్నిసార్లు హెచ్చరించినా ర్యాగింగ్ భూతం వదిలిపెట్టడం లేదు. ఎందరో అమాయక విద్యార్థులు బలైపోతున్నారు. తమకు జరిగిన అవమానాలు భరించలేక, బయటకు చెప్పుకోలేక వారిలో వారు కుమిలిపోతుంటే మరికొందరు ఆత్మహత్యలు చేసుకోవడానికి కూడా వెనుకాడడం లేదు. ఇంతకాలంగా ఇంతలా కొనసాగుతున్న ర్యాగింగ్ కారకులపై పాలకులు నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఇలాంటి సంఘటనలు స్పష్టమైన సాక్ష్యాధారాలతో వెలుగు చూసినప్పుడు కూడా వాటిని న్యాయస్థానం ముందుబెట్టి నిందితులకు శిక్షలు వేయించడంలో ప్రభుత్వ యంత్రాంగం ఘోరంగా విఫలమవుతున్నది. ర్యాగింగ్ భూతాన్ని పారద్రోలేందుకు తీసుకువచ్చిన చట్టం, నిబంధనలు, నియమించుకున్న కమిటీలు అన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. చట్టాలకు సామాన్యులు లోకువ అయితే సమర్థులకు చట్టాలు లోకువవుతున్నట్లు కారకులు ఏదో రకంగా బయటపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ర్యాగింగ్‌ను నిరోధించడానికి ఏర్పాటు చేసిన కమిటీల్లోని సభ్యులు,కాలేజీల యాజమాన్యాలు సంఘటనలు వెలుగు చూడకుండా చేస్తున్నారు. కాలేజీలకు చెడ్డపేరు వస్తుందనే భయంతో పెదవులు విప్పడంలేదు. అందుకే ఎన్నో దారుణ సంఘటనలు వెలుగు చూడడం లేదు. ర్యాగింగ్ అనండి, వేధింపులు అనండి, టార్చర్ అనండి వీటి కారణంగా ఎందరో విద్యార్థినీవిద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. తాజాగా తెలంగాణ రాజధాని హైదరాబాద్ నడిబొడ్డులో ఉన్న ఉస్మానియా వైద్య కళాశాల వసతి గృహంలో కొందరు సీనియర్లు ర్యాగింగ్ పేరుతో జూనియర్లపై ర్యాగింగ్ చేసిన ఉదంతం వెలుగు చూసింది. ర్యాగింగ్ చేయొద్దని కొందరు సీనియర్లు చేసిన సలహాలు పెడచెవిన పెట్టడమే కాదు వారిపై దాడి చేసిన సంఘటనతో మొత్తం బయట పడింది. ఈ విషయం వెలుగు చూడకుండా చేయాలనే ప్రయత్నాలు ఫలించలేదు. ఎట్టకేలకు పోలీసులు రంగ ప్రవేశం చేసి కేసు నమోదు చేసి డజను మంది సీనియర్లపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకొన్నారు. కాలేజీ యాజమాన్యం ఆ పన్నెండు మందిని ఆరు నెలల పాటు సస్పెండ్ చేసింది. వాస్తవంగా ఎంతో కాలంగా ఈ ర్యాగింగ్ కొనసాగుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడయింది. ఈ నెల ఎనిమిదో తేదీన పధ్నాలుగు మంది బిడిఎస్‌కు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులను చివరి సంవత్సరం విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో మానసిక ఒత్తిడికి గురి చేస్తుండగా గమనించిన ఇంటర్న్‌షిప్ చేస్తున్న కొందరు సీనియర్లు అడ్డుకున్నారు. ఈ విషయం కాలేజీ యాజమాన్యం దృష్టికి వెళ్లడంతో మరుసటి రోజు సమావేశం నిర్వహించి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయితే తమపై ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా భావించిన ర్యాగింగ్ చేసిన నిందితులు మళ్లీ ఈ నెల 11వ తేదీన మరోసారి జూనియర్లపై తమ ప్రతాపం చూపారు. దీంతో పరిస్థితి చేతులు దాటుతుండడంతో యాజమాన్యం ఈ నెల 16న సుల్తాన్ బజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని ర్యాగింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణకు

## ఒక్క మాట

గురైన పన్నెండు మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు సంబంధిత డిసిపి వెల్లడించారు. వారందరిని ఆరు నెలలపాటు సస్పెండ్ చేసినట్లు ప్రిన్సిపల్ ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా ఈ ర్యాగింగ్ భూతం విస్తరిస్తూనే ఉంది. మొన్న ఆ మధ్య గుజరాత్‌లోని పాటణ్ జిల్లాలో ఒక వైద్య కళాశాలలో కొందరు సీనియర్లు జూనియర్ విద్యార్థినిని మూడుగంటలపాటు నిలబెట్టి పైశాచిక ఆనందం పొందడంతో ఆ విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లిప్రాణం విడిచారు. తెలంగాణలోని ఖమ్మంలోని ఒకవైద్య కళాశాలలో కొత్తగా చేరిన వైద్య విద్యార్థినిని తన హెయిర్ స్టైల్ బాగాలేదంటూ సీనియర్లు ర్యాగింగ్ చేశారు. ఆ విషయం తెలుసుకున్న బాధ్యత కలిగిన ఒక ఉద్యోగి సీనియర్లను మందలించడానికి బదులు జూనియర్లపై ఆగ్రహంవ్యక్తం చేశారు. ఆ తర్వాత ఆ విద్యార్థికి గుండు కొట్టించేప్రయత్నం చేసి పవిత్ర వృత్తికే కళంకం తెచ్చారు. గతంలో ఎంతో మంది ఈర్యాగింగ్ కారణంగా తనువులు చాలించిన సందర్భాలున్నాయి. మరెందరో ఏకంగా విద్యా భ్యాసానికి స్వస్తి చెప్పిన సంఘటనలు కూడా చోటు చేసు కున్నాయి. ఈ ర్యాగింగ్ అనేది ముందుగా కేవలంమెడికల్, ఇంజినీరింగ్ వంటి ప్రొఫెషనల్ కళాశాలల్లో 19వ శతాబ్దం ఆరంభంలో మొదలైనట్లు చెప్తారు. ఇది రానురాను అన్ని కాలేజీలకు విస్తరించింది. ఎన్నోవ్యయప్రయాసలకు ఓర్చి ఇంటర్మీడియేట్ విద్యను పూర్తి చేసుకొని ఉజ్వల భవిష్యత్‌ను ఊహించుకుంటూ కాలేజీల్లోకి అడుగుపెట్టిన విద్యార్థులకు బెరుకు,భయం పోగొట్టి నలుగురితో కలిసి మెలిసి ఉండేలా చేసేందుకు చేపట్టిన పరిచయ వినోద కార్యక్రమం ఇది. ప్రారంభంలో అంతవరకే పరిమితమైనా ఆ తర్వాత శృతిమించి కొందరు విద్యార్థులకు ప్రాణాంతక వికృతకేళిగా మారిపోయింది. పాశ్చాత్య సంస్కృతి విషవలయంలో చిక్కుకొని ఆలోచనా రహితంగా చేస్తున్న ఈర్యాగింగ్‌ను లేత మనసులు తట్టుకోలేకపోతున్నాయి.దీనికి అశ్లీలసాహిత్యం,నీలిచిత్రాలు, మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు, ఇతర బలహీనతలు తోడుకావడంతో ఈ అమానుషత్వం పరాకాష్ఠకు చేరింది. దేశవ్యాప్తంగా ఇప్పటికే ఎంతోమంది మెరికల్లాంటి విద్యార్థులు బలైపోయారు. మరెందరో ర్యాగింగ్‌కు భయపడి ఏకంగా చదువులకే స్వస్తి చెప్పున్నారు. రికార్డుల పరంగా కొంతమేరకు తగ్గినట్లు కన్పిస్తున్నా చాలావరకు వెలుగు చూడడం లేదేమోనని పిస్తున్నది. ఈ ర్యాగింగ్‌ను అదుపు చేయడానికి ఏమీ చేయడం లేదని చెప్పడంలేదు. పటిష్టమైన చట్టాన్ని తీసుకువచ్చారు. జరిమానాలతోపాటు జైలు శిక్షలు కూడా విధించే చట్టాన్ని ప్రవేశపెట్టినా ఫలితం లేకుండాపోతున్నది. వీటన్నింటికి మించిర్యాగింగ్ చేసిన విద్యార్థులను ఆయా విద్యాసంస్థల నుండి సస్పెండ్ చేయడమేకాదు వారిని మరో చోట ఎక్కడా చేర్చుకోరాదని కూడా చట్టంలో చాలా స్పష్టంగా పేర్కొన్నారు. ఈచట్టం వచ్చిన తర్వాత ర్యాగింగ్ కనుమరుగవుతుందని పాలకులు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పించారు. కానీ చేసిన చట్టాలను అమలు చేసే త్రికరణశుద్ధి ప్రభుత్వానికి లోపించడం వల్లనే చట్టం వచ్చినప్పుడు కొంత భయం ఏర్పడినా ఆతర్వాత క్రమేపీ యధాస్థితికి చేరుకున్నదనే చెప్పొచ్చు. అందుకే దేశంలో ఈ రాక్షసక్రీడ చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉన్నది. సంఘటనలు జరిగినప్పుడు పోలీసుల హడావుడి,నాలుగైదు రోజులపాటు నేతల పత్రికా ప్రకటనలు, ఆతర్వాత మరిచిపోతున్నారు.ఈ రాక్షసక్రీడ ఇంత వికృతరూపం దాలుస్తున్నా నిందితులకు సాక్ష్యాలతో న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షలు వేయించలేకపోతున్నారంటే ఏమనుకోవాలి. ప్రాణ సమానంగా పెంచుకున్న తమబిడ్డలు తమ కళ్లముందే చదువు,సంస్కారం ఉందనుకున్న వింతపశువుల వికృతచేష్టలకు బలవుతుంటే ఆ గర్భశోకాన్నిఊహించగలమా?అదిఎప్పటికైనా తీరుతుందా?పాలక పెద్దలు ఇప్పటికైనా మనసుపెట్టి ఆలోచించాలి. రాజకీయాలకు అతీతంగా చర్యలుతీసుకోవాలి.ర్యాగింగ్‌కు పాల్పడేవారికి, ప్రోత్సహించేవారికి మాటలతోకాకుండా చర్యల ద్వారా తిరుగులేని హెచ్చరికలు అందించాలి. అప్పుడే ర్యాగింగ్ భూతాన్ని దేశంనుంచి పారద్రోలగలుగుతాం.చట్టాన్ని అమలు చేసే చిత్తశుద్ధిలేనప్పుడు,త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయలేనప్పుడు ఈ చట్టాలు, చర్చలు,అన్నీ నిష్ప్రయోజనమే. ●

# శరణార్థులకు కనీస మానవ హక్కులు వర్తించవా!

బి. మధుసూదన్

యుద్ధాలు, సంక్షోభాలు, హింసలు,పీడించడం, వాతావరణ ప్రతికూల మార్పులు, జాతి వివక్షలు, మత విద్వేషాలు, జాతీయత, కొన్ని సామాజిక లేదా రాజకీయ సంఘాల్లో సభ్యత్వాల కారణంగా ప్రాణ భయంతో మరో దేశానికి వెళ్లి శరణు కోరి ప్రాణాలు కాపాడుకునే ప్రత్యేక వ్యక్తులు లేదా సమూహాలను శరణార్థులుగా నిర్వచిస్తాం. నేరుగా మరో దేశంలో శరణార్థులుగా చేరే వారు, ఆశ్రమం పొందే వారు, అంతర్గతంగా స్థానభ్రంశం పొందిన వారు, ఏ దేశానికి చెందని వారు, అనేక ఏళ్ల తర్వాత తిరిగి తమ దేశానికి చేరిన వారందరూ శరణార్థుల జాబితాలోకి వస్తారు. శరణార్థులు, వారి పిల్లలు పడుతున్న అమానవీయ వేదనలను గుర్తించి ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏటా 20 జూన్ రోజున ప్రపంచ శరణార్థి దినోత్సవాన్ని 2001 నుంచి పాటించడం జరుగుతోంది. మరో దేశం నుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వచ్చిన శరణార్థులు కూడా సాధారణ మానవులే అని, వారికి కూడా కనీస మానవ హక్కులు వర్తిస్తాయని, వారిలో ధైర్యాన్ని నింపడం, వారి పిల్లలకు విద్య వసతులు విస్తరించాలని, ఆకలి చావుల కోరల్లో చిక్కకుండా చూసుకోవాలని ప్రపంచ దేశాలకు అవగాహన పరచడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. 2026 ప్రపంచ శరణార్థి దినోత్సవం ఇతివృత్తంగా 'అందరు సురక్షితంగా ఉండే వరకు శరణార్థులకు సంఘీభావం ప్రకటిద్దాం' అనే అంశాన్ని నిర్ణయించారు. 2026 శరణార్థి వారం ఇతివృత్తంగా 'సూపర్ పవర్‌గా పౌర సమాజం' అనే అంశాన్ని తీసుకున్నారు. శరణార్థులను కూడా సాధారణ పౌరులుగా చూడాలని, శత్రువులుగా భావించవద్దని ఐరాస సూచిస్తున్నది. శరణార్థుల పట్ల సహానుభూతి చూపడం, కనీసమానవ హక్కులను కల్పించడం, వారికి సంఘీభావంగా ప్రచారాలు



నిర్వహించడం, వారి జీవిత కథలను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వారి పట్ల రాజకీయ ఏకీకరణ జరగడం, వారి అభ్యున్నతికి నిధులు కేటాయించడం, వారి మనోభావాలను అర్థం చేసుకోవడం లాంటివి నిత్యం కొనసాగాలి. భారత్‌లోకి శ్రీలంక, మయన్మార్, అఫ్ఘానిస్థాన్, టిబెట్, బంగ్లాదేశ్ లాంటి ఇరుగు పొరుగు దేశాల నుంచి వేల మంది శరణార్థులు భారత భూభాగంలోకి శరణార్థులుగా చేరడం కొనసాగుతున్నది. శ్రీలంకన్ తమిళులు, రోహింగ్యాలు, టిబెటన్లు, చక్మాహజోంగ్‌లు, జూయిష్ వర్గాలు అధిక సంఖ్యలో భారత్‌కు రావడం, శరణార్థులుగా జీవితాలను కొనసాగించుకోవడం జరుగుతూ కొన్నిసార్లు మన దేశంలో శాంతి భద్రతల సమస్యలకు కూడా కారణం అవుతున్నారని కూడా అవుతున్నారు. 2022 వివరాల ప్రకారం, భారత్‌లో 46,000 మంది, అందులో 22,509 మంది రోహింగ్యాలు కూడా శరణార్థులు నమోదు అయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. భారత్‌లో చేరిన శరణార్థులు అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో స్థిరపడి అసంఘటిత పనుల్లో నిమగ్నం అవుతున్నారు. శరణార్థి కుటుంబాలకు చెందిన పిల్లలు 7 శాతం మాత్రమే విద్య కొనసాగిస్తున్నారని, 87 శాతం శరణార్థులు అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లోనే జీవిస్తున్నారని తెలుసుకోవాలి. ప్రపంచ శరణార్థి దినోత్సవ వేదికగా నిజమైన శరణార్థులను గుర్తించి వారికి కనీస వసతులను కల్పించడం, దురుద్దేశంతో భారత్‌లోకి చేరిన శరణార్థులను ఏరిపారేయడం నిరంతరం జరగాలి. నిస్సహాయ స్థితుల్లో శరణార్థులుగా చేరిన వారి కుటుంబాలకు కనీస అవసరాలు తీర్చడం, సహానుభూతితో వారికి గొడుగు పట్టడం, వారి పిల్లలకు చదువుకునే అవకాశాలు కల్పించడం, మానవీయ కోణంలో అక్కున చేర్చుకోవడం, వారికి వైద్య ఆరోగ్య వసతులు కల్పించం, వారిని మానవులుగా గౌరవించడం, సమానత్వ భావనలను ఆచరించడం, కనీస సహకారాలను అందించడం కొనసాగాలి. ఊహించని సందర్భాల్లో పరాయి దేశంలోకి చేరిన శరణార్థులకు మానవ హక్కుల గొడుగు పడదాం, వారి శ్రేయస్సుకు పాటు పడదాం. ●

# ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత నేతిబీర చందమేనా?



పాపని నాగరాజు

అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఎన్నికను చెల్లదని 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జగ్మోహన్ లాల్ సిన్హా ప్రకటించారు.మన దేశ ప్రజాస్వామ్య చరిత్రలో అది ఒక అసాధారణ ఘట్టం. దేశ అత్యున్నత రాజకీయ నాయకురాలి అధికారాన్ని ఒక న్యాయమూర్తి తీర్పు ప్రశ్నించింది. అనంతర రాజకీయ పరిణామాలు ఎమర్జెన్సీకి దారితీశాయి. ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచినా, అలహాబాద్ హైకోర్టు తీర్పుమాత్రం ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతకు చారిత్రక నిదర్శనంగా మిగిలిపోయింది. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు మాత్రమే సరిపోవు. అధికారాన్ని ప్రశ్నించగల, నియంత్రించగల, రాజ్యాంగ పరిమితుల్లో ఉంచగల సంస్థలు కూడా అంతే అవసరం. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, దర్యాప్తు సంస్థలు, సమాచార వ్యవస్థలు, ఇవన్నీప్రభుత్వానికి అనుబంధ విభాగాలు కాదు. ప్రజాస్వామ్య సమతుల్యతను కాపాడే రాజ్యాంగబద్ధ వ్యవస్థలు. అయితే గత కొన్నేళ్లుగా ఈ సంస్థల స్వతంత్రతపై దేశవ్యాప్తంగా చర్చజరుగుతోంది. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ సంస్థలు, మాజీ ఎన్నికల కమిషనర్లు ఆందోళనలు వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణ, ఎన్నికల నిబంధనల అమలు, అధికార పక్షం ప్రతిపక్షాల పట్ల వ్యవహరించే తీరుపై ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐల విషయంలో కూడా ఇలాంటి విమర్శలే వినిపిస్తున్నాయి. అవినీతి నిరోధక చర్యలు అవసరమే అయినప్పటికీ, ఈ సంస్థల చర్యలు ప్రతిపక్ష నేతలపైనే ఎక్కువగా కేంద్రీకృతమవుతున్నాయనే అభిప్రాయం దేశ రాజకీయ చర్చలో పదేపదే వ్యక్తమవుతోంది. అధికార పక్షానికి చెందిన కొందరు నేతలపై విచారణల వేగం మారడం వంటి పరిణామాలు ఈ విమర్శలకు మరింత బలం చేకూర్చాయి. అన్నింటికంటే ముఖ్యమైనది న్యాయవ్యవస్థ. ఎందుకంటే మిగతా అన్ని వ్యవస్థలు విఫల మైనా ప్రజాస్వామ్యానికి చివరి ఆశ్రయం న్యాయస్థానాలే. అయితే ఇటీవలి కాలంలో న్యాయవ్యవస్థ స్వతంత్రతపై కూడా ప్రశ్నలు లేవనెత్తబడుతున్నాయి. న్యాయమూర్తుల నియామకాల వ్యవహారం, కీలక రాజకీయ కేసుల విచారణ సమయం, ఎన్నికల బాండ్ల వ్యవహారం, ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన విచారణ, పౌరహక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛలకు సంబంధించిన కొన్ని కేసుల పరిణామాలు దేశంలో విస్తృత చర్చకు దారితీశాయి.



యూఏపీఏ కింద అరెస్టయిన కార్యకర్తలు, భీమా కోరేగావ్ కేసు నిందితులు, రాజకీయ అసమ్మతిని వ్యక్తం చేసిన వ్యక్తుల దీర్ఘకాల నిర్బంధం వంటి అంశాలపై పౌరహక్కుల సంఘాలు వ్యక్తం చేసిన ఆందోళనలు కూడా ఈ చర్చలో భాగమయ్యాయి. ఎమర్జెన్సీ అనంతరం మన దేశ ప్రజాస్వామ్యం కొన్ని కీలక పాఠాలు నేర్చుకుంది. అధికారాన్ని ఒకే వ్యక్తి లేదా ఒకే కేంద్రంలో కేంద్రీకరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర మని దేశం గుర్తించింది. అందుకే 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఎమర్జెన్సీ అధికారాలపై కొన్ని పరిమితులు విధించబడ్డాయి. ప్రాథమిక హక్కులకు అదనపు రక్షణలు కల్పించబడ్డాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికార కేంద్రీకరణను నియంత్రించే ప్రయత్నాలు జరిగాయి. అయితే చరిత్రలో తరచుగా జరిగే విధంగానే, ఒక దశలో అధికార దుర్వినియోగాన్ని నిరోధించేందుకు రూపొందించిన వ్యవస్థలనే తరువాతి పాలక వర్గాలు తమ అవసరాలకు అనుగుణంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తుంటాయి. చట్టాలు, సంస్థలు, రాజ్యాంగ పరిమితులు యథాతథంగా ఉన్నప్పటికీ, వాటి అమలు పద్ధతుల ద్వారా అధికార కేంద్రీకరణ మళ్లీ పెరగవచ్చు. అధికార కేంద్రీకరణ పెరిగే కొద్దీ సామాజిక వైవిధ్యానికి, ప్రాంతీయ స్వరాలకు, అట్టడుగు వర్గాల రాజకీయ ప్రాతినిధ్యానికి ఎదురయ్యే సవాళ్లు కూడా పెరుగుతాయి. ఈ పరిస్థితిని 1975 ఎమర్జెన్సీతో యథాతథంగా పోల్చడం సరైందికాదు కానీ అప్రకటితమైనది. అప్పట్లో ఎమర్జెన్సీ అధికారికంగా ప్రకటించబడింది. పత్రికలపై సెన్సార్ విధించబడింది. ప్రతిపక్ష నాయకులు జైలుకు పంపబడ్డారు. రాజ్యాంగ హక్కులు నిలిపివేయబడ్డాయి. ప్రజాస్వామ్యంపై దాడి ప్రత్యక్షంగా కనిపించింది నేడు పరిస్థితి భిన్నంగా ఉంది. ఎన్నికలు జరుగుతున్నాయి. పార్లమెంట్ పనిచేస్తోంది. కోర్టులు ఉన్నాయి. మీడియా ఉంది. ఎన్నికల సంఘం ఉంది. కానీ ఈసంస్థలు రూపంలో మాత్రమే స్వతంత్రంగా ఉన్నాయా? లేక వాస్తవంగా కూడా అధికారాన్ని ప్రశ్నించే స్థితిలో ఉన్నాయా? అనే ప్రశ్న దేశ రాజకీయ చర్చలో ప్రధాన అంశంగా మారింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారాన్ని పరిమితం చేసే శక్తులు బలపడుతున్నాయా, బలహీనపడుతున్నాయా అన్నదే కీలకం. చరిత్ర చెబుతున్న పాఠం ఏమిటంటే, ప్రజాస్వామ్య సంస్థలు ఒక్కసారిగా కూలిపోవు. ముందుగా వాటి స్వతంత్రత క్షీణిస్తుంది. తరువాత వాటి ప్రతిష్ఠ దెబ్బతింటుంది. చివరికి అవి ప్రజల కన్నా అధికారానికి ఎక్కువ జవాబుదారీగా మారే ప్రమాదం ఏర్పడుతుంది. 1975లో ఒక హైకోర్టు న్యాయమూర్తి తీర్పు దేశ ప్రధానమంత్రిని సవాలు చేయగలిగింది. నేడు ఎన్నికల సంఘం, దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు అధికారాన్ని అదే స్థాయిలో ప్రశ్నించగలవా? ఇదే భారత ప్రజాస్వామ్యం ముందున్న కీలక ప్రశ్న. ఎందుకంటే ప్రజాస్వామ్యానికి అసలు రక్షణ ఎన్నికల్లో కాదు అధికారాన్ని జవాబుదారీగా ఉంచగల స్వతంత్ర సంస్థల్లో ఉంది. ●

# అమెరికా, ఇరాన్ చర్చలకు బ్రేక్



## లెబనాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు
## యుఎస్ ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ పర్యటన రద్దు
## తుది ఒప్పందం కోసం 60 రోజుల ప్రక్రియ ఆరంభం
## చర్చల కొత్త తేదీ త్వరలో ప్రకటించే అవకాశం

**వాషింగ్టన్/దుబాయ్/జూరిచ్, జూన్ 19:** లెబనాన్‌లో ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో, శుక్రవారం స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన అమెరికా- ఇరాన్ చర్చలు రద్దయ్యాయి. ఇదిలా ఉండగా, స్విస్ పర్వత ప్రాంతంలోని బ్యూర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో ప్రారంభం కానున్న సాంకేతిక చర్చల సన్నాహాలు చాలా వరకు పూర్తయ్యాయని, అయితే తాను హాజరయ్యే ప్రణాళికలను విరమించుకున్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. ఏర్పాట్లకు సంబంధించిన సమస్యల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. శ్వేత సౌధం ప్రతినిధి మాట్లాడుతూ, 'ఉపాధ్యక్షుడు ఇప్పటికే చెప్పినట్లుగా సాంకేతిక చర్చల ప్రణాళికలు ఇంకా తుది రూపం దాల్చలేదు. అది పూర్తి కాగానే వెంటనే అమెరికా ప్రతినిధి బృందం బయలుదేరేందుకు సిద్ధంగా ఉంది. అయితే ఇలాంటి చర్చల ఏర్పాట్లు ఎప్పుడూ సంక్లిష్టంగానే ఉంటాయి. ప్రస్తుతం ఉపాధ్యక్షుడు ఈ రాత్రి స్విట్జర్లాండ్‌కు వెళ్లడం లేదు' అని తెలిపారు. అంతకు ముందు, టెహ్రాన్ ఆలోచనా విధానం తెలిసిన ఒక మూలం, ఇరాన్ ప్రధాన సంధానకర్త మొహమ్మద్ బాకర్ ఖాలిబాఫ్ హాజరయ్యే ప్రణాళికలో లేరని చెప్పింది. చర్చలు వాయిదా పడ్డాయని, చర్చలకు సహకరించేందుకు స్విట్జర్లాండ్ సిద్ధంగా ఉందని, సంబంధిత సన్నాహక పనులు కొనసాగుతున్నాయని స్విస్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో, మధ్యంతర ఒప్పందాన్ని మరింత శాశ్వతమైన మధ్యప్రాచ్య శాంతి ఒప్పందంగా మార్చేందుకు జరగాల్సిన చర్చల సమయంపై కొత్త అనిశ్చితి నెలకొంది. స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన సమావేశం వాయిదా పడటంపై ఇరాన్ నాయకులు వెంటనే స్పందించలేదు. అయితే, సమగ్ర కాల్పుల విరమణ అమల్లోకి వస్తేనే తదుపరి చర్చలు సాధ్యమవుతాయని ఇరాన్ చెప్పినట్లు హిజ్బుల్లా శాసనసభ్యుడు హసన్ ఫధ్లల్లా పేర్కొన్నారు. లెబనాన్‌లో వైమానిక దాడుల్లో 18 మంది, హిజ్బుల్లా మిలిటెంట్ల చేతిలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మరణించడంతో అక్కడ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఈ పరిణామం చర్చలపై తీవ్ర ప్రభావం చూపవచ్చు, ఎందుకంటే విస్తృతమైన అమెరికా-ఇరాన్ ఒప్పందానికి అక్కడ ఘర్షణలను ముగించడం ఒక షరతు. సమగ్ర కాల్పుల విరమణ లేకుండా అమెరికాతో చర్చలు కొనసాగలేవని, ఇజ్రాయెల్ తన దాడులను నిలిపివేసేలా చూడాల్సిన బాధ్యత వాషింగ్టన్‌దేనని ఇరాన్ తమ బృందానికి చెప్పిందని హిజ్బుల్లా సీనియర్ చట్టసభ్యుడు ఒకరు తెలిపారు.

అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన 14 అంశాల అవగాహన ఒప్పందం (ఎంఓయు) అమలుకు సంబంధించిన సాంకేతిక అంశాలను ఖరారు చేయడమే లక్ష్యంగా శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఈ చర్చలు జరగాల్సి ఉంది. అయితే ప్రయాణంపై వాన్స్ సందేహాలు వ్యక్తం చేయడంతో సమావేశం తేదీ ఇంకా ఖరారు కాలేదని ఇరాన్ ప్రతినిధులు తెలిపారు.

**తుది ఒప్పందం కోసం నిర్దేశించిన 60రోజుల ప్రక్రియ ప్రారంభం:** అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ గురువారం వైట్ హౌస్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంలోని తొలిదశ అమలుకు అమెరికా పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. అవగాహన ఒప్పందంలో పేర్కొన్న 60రోజుల గడువు గురువారం నుంచే ప్రారంభమైందని చెప్పారు. ఈ కాలంలో ఇరుపక్షాలు అణుకార్యక్రమం, ఆంక్షల సడలింపు, భద్రతాఏర్పాట్లు తదితర అంశాలపై సాంకేతిక స్థాయిలో చర్చలు జరపనున్నట్లు తెలిపారు.

**ట్రంప్ కీలక వ్యాఖ్యలు:** ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. శాంతి స్థాపనకు అమెరికా పూర్తిగా కట్టుబడి ఉందని, జరుగుతున్న చర్చలు విజయవంతం కావాలంటే పశ్చిమాసియాలోని అన్ని పక్షాలు తమ నిబద్ధతను కొనసాగించాలని కోరారు. లెబనాన్, హిజ్బుల్లా, ఇజ్రాయెల్ సహా అన్ని రంగాల్లో సంపూర్ణ కాల్పుల విరమణ అమలవుతుందని ఆశాభావం వ్యక్తం చేసిన ట్రంప్, ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు.

**ఉల్లంఘిస్తే తీవ్రంగా స్పందిస్తాం: ఇరాన్**

ఈ నేపథ్యంలో అమెరికాకు ఇరాన్ గట్టి హెచ్చరిక చేసింది. డీల్‌కు సంబంధించిన చర్చల నేపథ్యంలో అమెరికా దాని భాగస్వాములు దురుద్దేశంతో వ్యవహరించినా ఒప్పందాన్ని ఉల్లంఘించినా, మితిమీరిన డిమాండ్లు చేసినా తమ స్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. యుద్ధంలో ఇప్పటికే గట్టి దెబ్బ తిన్నారు. మళ్లీ అదే దారిలో నడిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందన్నారు.





# లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి: 18 మంది మృతి

## అటు హిజ్బుల్లా చేతిలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు హతం

**టెల్‌అవీవ్/టెహ్రాన్, జూన్ 19:** ఇజ్రాయెల్ గురువారంరాత్రి దక్షిణ లెబనాన్‌పై జరిపిన వరుస వైమానిక దాడుల్లో 18 మంది మరణించారు. అదే సమయంలో హిజ్బుల్లా చేతిలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు కూడా మరణించారు.


ఇరాన్ మద్దతు ఉన్న సాయుధ సంస్థ హిజ్బుల్లాకు సంబంధించిన 80 లక్ష్యాలపై దాడి చేసి, దానిలోని "డజన్ల కొద్దీ" సభ్యులను హతమార్చినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడిఎఫ్) తెలిపాయి. మధ్యప్రాచ్యంలో సంఘర్షణను అంతం చేసే లక్ష్యంతో, లెబనాన్‌లో శాశ్వత శత్రుత్వ విరమణతో సహా, అమెరికా- ఇరాన్ ఒక ఒప్పందంపై సంతకం చేసిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఒప్పందం ప్రకటించినప్పటి నుండి ఇజ్రాయెల్, హిజ్బుల్లా ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నాయి. దక్షిణ లెబనాన్‌లోని నబాటియే జిల్లాలో గురువారం రాత్రి జరిగిన బాంబు దాడులు యుద్ధంలోనే అత్యంత తీవ్రమైనవని లెబనాన్ ప్రభుత్వ వార్తా సంస్థ అభివర్ణించింది. ఈ దాడుల్లో కనీసం 18 మంది మరణించగా, 33 మంది గాయపడ్డారు. అనేక భవనాలు దెబ్బతిన్నాయి. దక్షిణ లెబనాన్‌లో ఒక ఇజ్రాయెల్ బృందంపై తాము మెరుపుదాడి చేశామని, గైడెడ్ క్షిపణులతో మూడు ట్యాంకులను ధ్వంసం చేశామని, అలాగే సైనికులను రాకెట్, ఫిరంగి కాల్పులతో లక్ష్యంగా చేసుకున్నామని హిజ్బుల్లా తెలిపింది. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నలుగురు సైనికుల మృతికి సంతాపం తెలిపారు. "హిజ్బుల్లాపై పూర్తి శక్తితో దాడి చేయాలని" తాను ఇజ్రాయెల్ రక్షణ దళాలను ఆదేశించినట్లు శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. "నా ఆదేశం స్పష్టం: మా సైనికులపై గానీ, మా భూభాగంపై గానీ దాడులను ఇజ్రాయెల్ సహించదు. ఈ దాడులకు హిజ్బుల్లా నుండి చాలా భారీ మూల్యం వసూలు చేస్తుంది" అని ఆయన అన్నారు. "ఇజ్రాయెల్ దాడుల విస్తరణ ఒక ప్రమాదకరమైన, ఖండించదగిన ఉద్రిక్తతను పెంచడమే" అని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్‌ఔన్ అన్నారు. "వీలైనంత త్వరగా సమగ్ర కాల్పుల విరమణను సాధించే ప్రయత్నాలను ఇది అడ్డుకోలేదు" అని పేర్కొన్నారు.

# అర్ధరాత్రి చత్తీస్‌గఢ్ సిఎం అత్యవసర కేబినెట్ సమావేశం

## కేబినెట్ శాఖల్లో మార్పులు,చేర్పుల కోసమేనన్న ప్రచారం

**రాయ్‌పూర్,జూన్ 19:** ముఖ్యమంత్రి ఆకస్మిక పిలుపుతో పలువురు మంత్రులు ఆయన అధికార నివాసానికి చేరుకున్నారు. అర్ధరాత్రి వరకు కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. దీంతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగనున్నదా మంత్రుల శాఖలు మారబోతున్నాయా అన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి, గురువారం సాయంత్రం ఆకస్మిక ఆదేశాలు జారీ చేశారు. మంత్రులందరిని తన అధికారిక నివాసానికి పిలిపించారు. దీంతో పలువురు మంత్రులు ముందుగా నిర్ణయించుకున్న తమ కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. హుటాహుటిన రాయ్‌పూర్‌కు తిరిగి వచ్చారు. గురువారం రాత్రి 10 గంటల సమయంలో సీఎం విష్ణుదేవ్ సాయి అధికార నివాసంలో కేబినెట్ సమావేశం ప్రారంభమైంది. శుక్రవారం తెల్లవారు జామున 1:40 గంటల వరకు ఇది కొనసాగింది. ఈ అసాధారణ మంత్రివర్గ సమావేశంలో ఉప ముఖ్యమంత్రులు, సీనియర్ మంత్రులతో పాటు బీజేపీ సంస్థాగత అగ్ర నాయకులు కూడా హాజరయ్యారు. దీంతో రాజకీయ వదంతులు జోరందుకున్నాయి. బీజేపీ పాలిత ఛత్తీస్‌గఢ్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగనున్నదా శాఖలు మారబోతున్నాయా పదవీకాలం మధ్యలోనే ప్రభుత్వ పనితీరుపై బీజేపీ నాయకత్వం అసంతృప్తిగా ఉన్నదా అన్న ఊహాగానాలు వెల్లువెత్తాయి. ఈ అత్యవసర మంత్రివర్గ సమావేశం అనంతరం ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ మీడియాతో మాట్లాడారు. ఈ ఊహాగానాలకు తెరదించేందుకు ఆయన ప్రయత్నించారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై అసలు చర్చ జరుగలేదని తెలిపారు. మరోవైపు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరసంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పనితీరును సమీక్షించుకున్నామని, భవిష్యత్ పాలనకు సంబంధించిన ప్రాధాన్యతలపై చర్చించినట్లు బీజేపీవర్గాలు తెలిపాయి. ప్రభుత్వం ,బీజేపీ మధ్య సమన్వయ బలోపేతంతో పాటు ప్రధాని మోడీ అధికారంలోకివచ్చి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఈ సమావేశంలో సమీక్షించినట్లు వెల్లడించాయి.

# అమెరికా కోసం ఇరాన్ 'కోవర్ట్ సెల్స్'



**టెహ్రాన్, జూన్ 19:** అమెరికా-ఇరాన్ యుద్ధానికి సంబంధించి ఓ సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఇటీవల ఉద్రిక్తతల సమయంలో గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడుల కోసం ఇరాన్ పక్కా ప్రణాళికతో కోవర్ట్ సెల్స్‌ను ఉపయోగించుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఉద్రిక్తతల వేళ ఇరాక్‌లో ఈ కోవర్టు సెల్స్‌ను ఐఆర్‌జిసి ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఒక్కో యూనిట్‌లో దాదాపు 10 మంది ఇరాకీ ఫైటర్లను నియమించుకుందట. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడమే వీరి పని. ఈ సెల్స్‌ను ఉపయోగించే ఏప్రిల్ 20 నుంచి మే 15 మధ్య కువైట్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని యుఎస్ బేస్‌లపై దాడులు చేసినట్లు సదరు వర్గాలు వెల్లడించాయి. ఈ కోవర్ట్ యూనిట్ సభ్యులు బస్రా, సమావా నగరాల సమీపంలోని ఎడారి ప్రాంతాల నుంచి కనీసం ఏడుసార్లు డ్రోన్ దాడులు జరిపినట్లు పేర్కొన్నాయి. సాధారణంగా ఇరాక్‌లోని మిలీషియా గ్రూప్‌లతో టెహ్రాన్‌కు సత్సంబంధాలున్నాయి. ఇరాక్‌తోపాటు గాజా, లెబనాన్, యెమెన్ వంటి దేశాల్లో ఈ గ్రూప్ విస్తరించింది. గల్ఫ్‌దేశాల్లో ఐఆర్‌జిసి ఆపరేషన్లకు ఈ ముఠాలు కీలకంగా వ్యవహరిస్తాయి. అయితే, అమెరికా స్థావరాలపై దాడులకు మాత్రం ఈ మిలీషియా నెట్‌వర్క్‌ను ఇరాన్ ఉపయోగించుకోకుండా కోవర్ట్ సెల్స్‌ను ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇరాక్‌లోని ఇస్లామిక్ రెసిస్టెన్స్ గ్రూప్ సభ్యులను టెహ్రాన్ కోవర్టులుగా నియమించున్నట్లు సదరు కథనం వెల్లడించింది. ఈయూనిట్లలో ఇద్దరు ఇరాకీ మిలిటరీ అధికారులు, భద్రదతా సిబ్బంది, ఐదుగురు మిలీషియా కమాండర్లు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

# గెలుపు నాది.. ఓటమి వాన్స్‌ది: ట్రంప్ స్టైల్ క్లెయిమ్



**వాషింగ్టన్, జూన్ 19:** ఇరాన్‌తో ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఒప్పందం విఫలమైతే ఏం చేస్తారని మీడియా అడిగిన ప్రశ్నకు 'ఒప్పందం సఫలమైతే ఆ ఘనత నా ఖాతాలో వేసుకుంటా, విఫలమైతే ఆ నింద జెడి వాన్స్‌పై వేస్తా'నంటూ నవ్వుతూ బదులిచ్చారు. కాబట్టి ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఉపాధ్యక్షుడికి సూచించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందంలో టెహ్రాన్ ఎలాంటి షరతులు విధించకుండానే లొంగిపోయిందని పేర్కొన్నారు. హార్ముజ్ మూసివేతతో ప్రపంచ వాణిజ్య మార్గాలకు అంతరాయం ఏర్పడడంతో ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం బారి నుంచి కాపాడేందుకు తానే చర్చలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈ ఘర్షణ మరింత విస్తృత ఆర్థిక విపత్తుగా మారకుండా నివారించడానికే ఒప్పందం కుదుర్చుకున్నట్లు ట్రంప్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. తన శక్తికి, అధికారానికి పరిమితులు లేవని వ్యాఖ్యానించారు. మరోవైపు అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఇజ్రాయెల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఇజ్రాయెల్‌పై సాను భూతి ఉన్న ఏకైక దేశాధినేత ట్రంప్ మాత్రమేనని పేర్కొన్నారు. అమెరికా డబ్బుతోనే ఇజ్రాయెల్ అభివృద్ధి చెందుతోందన్నారు. తమ అతిపెద్ద సమస్య అమెరికా అధ్యక్షుడే అని ఇజ్రాయెల్‌లో ఎవరైనా అనుకుంటే వారు ఇప్పటికైనా మేల్కొని తమ దేశం ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితిని గ్రహించాలని సూచించారు. ఇరాన్-అమెరికా చేసుకున్న ఒప్పందంలోని నిబంధనలను పాటించాల్సిన అవసరం లేదని ఇజ్రాయెల్ క్యాబినెట్‌లోని జాతీయ భద్రతా మంత్రి ఇటామర్ బెన్-గ్విర్ పేర్కొన్న నేపథ్యంలో జెడి వాన్స్ ఈ వ్యాఖ్యలు చేశారు.



భార్యపై క్రూరమైన దాడి

# బలవంతంగా మూత్రం తాగించిన భర్త

**రాయ్‌పూర్,జూన్ 19:** విడిగా నివసిస్తున్న భార్యకు పలువురితో సంబంధం ఉన్నట్లు భర్త అనుమానించాడు. ఆమె ఇంటికి చేరుకుని పిల్లల ముందే దారుణంగా హింసించాడు. కాళ్లు, చేతులు కట్టేసి కొట్టాడు. జుట్టు కత్తిరించాడు. ఆమెతో బలవంతంగా మూత్రం తాగించాడు. ఛత్తీస్‌గఢ్‌లోని కోరియా జిల్లాలో తార, జితేంద్ర ఘసియా 15ఏళ్ల కిందట ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. వైవాహిక విభేదాలు, భర్త వేధింపుల కారణంగా తార విడిగా జీవిస్తున్నది. ఇళ్లల్లో పనులు చేస్తూ పిల్లలను పోషిస్తున్నది. కష్టకాలంలో సహాయం చేసిన ఒక వ్యక్తి ఇంట్లో ఆమె నివసిస్తున్నది. ఈనెల 14న భార్య తార నివసిస్తున్న ఇంటికి భర్త జితేంద్ర చేరుకున్నాడు. మద్యం సేవించి వచ్చిన అతడు ఆమెను ఇంటి నుంచి బయటకు పిలిచి దూషించాడు. ఇతర వ్యక్తులతో సంబధాలున్నాయని ఆరోపించాడు. భార్య కాళ్లు, చేతులు కట్టేసి కొట్టాడు. పిల్లల ముందే ఆమెను హింసించాడు. జుట్టు కత్తిరించాడు. ముఖానికి నల్లరంగు, ఇంజిన్ ఆయిల్ పూశాడు. తన పిల్లలతో కూడా భార్య చెంపలపై కొట్టించాడు. పిల్లల్లో ఒకరితో మూత్రం తాగించాడు. అలాగే తన మూత్రాన్ని కూడా భార్యతో తాగించాడు. ఆమెను సజీవంగా తగులబెడతానని బెదిరించాడు. మరోవైపు భర్త దాడిలో తీవ్రంగా గాయపడిన తార పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం కావాలని, భర్తకు శిక్ష పడాలని డిమాండ్ చేసింది. దీంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. జితేంద్రను అరెస్ట్ చేశారు. అతడ్ని కోర్టులో హాజరుపర్చిన తర్వాత రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. జితేంద్ర తన భార్యను దారుణంగా కొట్టి హింసించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## అయోధ్య విరాళాల్లో అవకతవకలు రుజువైతే

# ఎవరినీ వదిలిపెట్టం: యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్



**అయోధ్య,జూన్ 19:** ఉత్తర ప్రదేశ్, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాలకు సంబంధించి అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. నిందితులు ఎలాంటివారైనా, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం అయోధ్యలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రామ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రజలు ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయన కోరారు. ఈ అంశంపై సిట్ దర్యాప్తు జరుపుతోందని, దీనికి సంబంధించి ఎవరివద్దనైనా ఆధారాలుంటే సిట్‌కు సమర్పించాలని ఆయన సూచించారు. ఆలయ ట్రస్ట్ వినతి మేరకు ఈ అంశంపై దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేశామని, ఈ అంశంలోని విషయాల్ని సిట్ వెలుగులోకి తెస్తుందని భావిస్తున్నామని యోగి అన్నారు. భక్తులు కూడా ఆలయంపై జరుగుతున్న అనేక దుష్ప్రచారాలను నమ్మకుండా సహనంతో ఉండాలని, ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నాలకు దూరంగా ఉంటూ, రాముడికి సంబంధించి గౌరవం, సహనం కలిగి ఉండాలని భక్తులను కోరారు. రామాలయ ఉద్యమాన్ని కాంగ్రెస్, ఎస్పీలు అడ్డుకుంటున్నాయని, గత ప్రభుత్వాలు రామ భక్తులకు, కర సేవకులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకున్నారని యోగి గుర్తు చేశారు. గతంలో అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఇక్కడి ఆలయంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు నటిస్తోందని, ఇది ఆ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం అన్నారు. రామాలయ ఉద్యమాన్ని కూడా కోర్టులో కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందన్నారు. రామభక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయంటున్న సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) గతంలో కరసేవకులపై కాల్పులు జరపాలంటూ ఆదేశించిందని, జై శ్రీరామ్ అన్నవారిపై దళాల్ని ప్రయోగించిందంటూ యోగి విమర్శించారు. అయోధ్యలోని రామ మందిరానికి వచ్చిన విరాళాల విషయంలో అవకతవకలు, అక్రమాలు జరిగాయనే విషయం తాజాగా వెల్లడైంది. భక్తులు సమర్పించిన కానుకలు దేవాలయానికి చెందకుండా కొందరు సిబ్బంది కాజేశారని తేలింది. దీనిపై ప్రస్తుతం సిట్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో కొన్ని ప్రాథమిక ఆధారాలు కూడా లభించాయి.


# కర్ణాటక ఎమ్మెల్సీ మొత్తం స్థానాలు కాంగ్రెస్‌కే

## పట్టు నిరూపించుకున్న సిఎం డికెశివకుమార్



**బెంగళూరు,జూన్ 19:** కర్ణాటక రాజకీయాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ మరోసారి తన పట్టును నిరూపించుకుంది. ఈనెల 18న జరిగిన శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికల్లో ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ కూటమికి కోలుకోలేని షాక్ ఇస్తూ కాంగ్రెస్ పార్టీ ఐదు స్థానాలను కైవసం చేసుకుంది. 30వ తేదీతో ఖాళీ అవుతున్న 7 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో విపక్ష ఎన్డీఏ కూటమికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు భారీగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయడం సంచలనం సృష్టిస్తోంది. ఈ విజయంతో 75 స్థానాలున్న కర్ణాటక శాసనమండలిలో (ఎగువ సభ) కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీని సాధించి, తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. ఈ ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు తిప్పన్నప్ప కంకన్నూర్, పీవీ మోహన్, బీకే హరిప్రసాద్, శివన్న బీఎస్, వినయ్ కార్తీక్ ప్రకాశ్ అందరూ మొదటి రౌండ్‌లోనే ఘన విజయం సాధించారు. బీజేపీ తరఫున లింగరాజ్ పాటిల్, రఘు ఆర్ విజయం సాధించగా, జేడీఎస్ అభ్యర్థి గోవిందరాజు తీవ్ర పోటీ నడుమ ఓటమి పాలయ్యారు. అసెంబ్లీలో 135 మంది ఎమ్మెల్యేల బలం ఉన్న కాంగ్రెస్ పార్టీ, స్వతంత్రుల మద్దతుతో కలిపి సులభంగానే తన అభ్యర్థులను గెలిపించుకుంటుందని భావించారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థులకు ఏకంగా 151 ఓట్లు వచ్చాయి. బీజేపీకి చెందిన ముగ్గురు నుంచి ఏడుగురు, అలాగే జేడీఎస్‌కు చెందిన నలుగురు నుంచి ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు ఓటు వేసినట్లు తెలుస్తోంది. దీనివల్ల ఎన్డీఏ కూటమి ఆశించిన దానికంటే 12 ఓట్లు తక్కువగా నమోదయ్యాయి. ఈ ఘన విజయం నూతన ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య నాయకత్వానికి దక్కిన పెద్ద విజయంగా కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. ఫలితాల అనంతరం డీకే శివకుమార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ప్రజాదరణ చూసి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమ మనస్సాక్షి ఓటును కాంగ్రెస్‌కు వేశారని వ్యాఖ్యానించారు. ఇప్పటికే బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన ఎస్టీ సోమశేఖర్, శివరామ్ హెబ్బార్ వంటి నాయకులు తమకు మద్దతు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. తమ కూటమిలో జరిగిన ఈ వెన్నుపోటుపై బీజేపీ, జేడీఎస్ అగ్రనాయకత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతర్గతంగా దర్యాప్తు జరిపి, క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# చేతబడి చేస్తోందని పనిమనిషిని చంపేసిన డాక్టర్..



**న్యూఢిల్లీ,జూన్ 19:** దేశరాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. చేతబడి చేస్తుందనే అనుమానంతో ఒక డాక్టర్ తన ఇంట్లో పనిచేసే మహిళను దారుణంగా హత్య చేశాడు. హంతకుడైన డాక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఢిల్లీలో డా.మనీష్ గుప్తా డెర్మటాలజిస్ట్‌గా పని చేస్తున్నాడు. అతడి భార్య టీనా గుప్తా కూడా డాక్టరే. వారి ఇంట్లో మీనా అనే మహిళ చాలాకాలంగా పని చేస్తుండేది. ఇటీవల ఆ ఇంట్లో కొన్ని మనస్పర్ధలు తలెత్తాయి. మనీష్ గుప్తా మాటల్ని అతడి భార్య, కుటుంబ సభ్యులు పట్టించుకోవడం మానేశారు. కుటుంబ సభ్యులు తనను లెక్కచేయకుండా ఉండేందుకు, వారి ప్రవర్తన మారేందుకు పనిమనిషి మీనానే కారణం అని అతడు భావించాడు. ఇదే సమయంలో మీనాను పనిలోంచి తీసేయాలని కొంతకాలంగా భార్య, కుటుంబసభ్యులకు చెబుతూ వచ్చాడు. కానీ, వారు మనీష్ గుప్తా మాటల్ని పట్టించుకోలేదు. ఆమెనే పని మనిషిగా కొనసాగించారు. దీనంతటికీ పని మనిషి మీనానే కారణం అని భావించాడు. కుటుంబ సభ్యులు తన మాట వినకుండా ఆమె చేతబడి చేస్తోందని, ఇంట్లోకి ఆమె నెగెటివ్ ఎనర్జీని తెస్తుందని మనీష్ భావించాడు. దీంతో అతడు మీనాపై కోపం తెచ్చుకున్నాడు. మనీష్ గుప్తా భార్య టీనా గుప్తా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అదే సమయంలో పని మనిషి మీనా ఇంటికివచ్చింది. ఇంట్లో బట్టలు ఉతికి, ఆరేసేందుకు మేడపైకి వెళ్లింది. అప్పుడు ఇంట్లో మనీష్ ఒక్కడే ఉన్నాడు. అప్పటికే మీనాపై ఆగ్రహంతో ఉన్న మనీష్ మేడపై బట్టలు ఆరేస్తున్న మీనా వద్దకువెళ్లి బ్యాట్‌తో ఆమె తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడి కిందపడి గిలగిలా కొట్టుకోసాగింది. అయినా, ఆగకుండా ఆమెను పలుమార్లు కత్తితో పొడిచాడు. అటు తలకు గాయమై రక్తం కారడం,ఇటు అతడు కత్తితో పొడవడంతో మీనా రక్తపుమడుగులో పడిపోయింది. కొంతసేపటికి ఆమె మరణించింది. పోలీసులు వచ్చి అరెస్టు చేసేవరకు ఆమె మృతదేహం వద్దేఉండిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మనీష్ గుప్తాను అరెస్టు చేశారు.మీనా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# సంక్షిప్త వార్తలు

## రాహుల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,జూన్ 19:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దేవుడు ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షించారు. శుక్రవారం రాహుల్ గాంధీ 56వ పుట్టినరోజు జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా ఎక్స్‌లో ప్రత్యేక సందేశం పోస్టు చేశారు. లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు. ఆయన మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షుతో ఉండాలని ప్రార్థిస్తున్నాను అని మోదీ పేర్కొన్నారు. రాజకీయంగా తీవ్ర విభేదాలు ఉన్నప్పటికీ రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేయడం విశేషం. 1970 జూన్ 19న జన్మించిన రాహుల్ ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభ సభ్యుడిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2004లో అమేథీ నుంచి తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

## పాక్‌పై అఫ్ఘాన్ దాడి: పలు ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం



**కాబూల్, జూన్ 19:** పొరుగు దేశమైన పాకిస్థాన్‌లోని ఐసిస్ లక్ష్యాలపై తాము వైమానిక దాడులు జరిపినట్లు తాలిబన్ రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్సులలోని పలు స్థావరాలపై దాడులు జరిపినట్లు పేర్కొంది. బలూచిస్తాన్ ప్రావిన్సులోని ఖిలా అబ్దుల్లా జిల్లాలోని గులిస్తాన్ ప్రాంతంలో, చాగై జిల్లాలోని షకరాబ్ ప్రాంతంలో ఉన్న ఐసిస్‌ఖొరాసన్ (ఐసిస్‌కె) స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపినట్లు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆఫ్ఘనిస్తాన్ లోపల దాడులకు ప్రణాళికలు రచించడానికి ఈ స్థావరాలను ఉపయోగిస్తున్నారని మంత్రిత్వ శాఖ ఆరోపించింది. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాప్రావిన్సులోని ఒరక్జాయ్ జిల్లాలోని కంబర్ ఖేల్ ప్రాంతంలో కూడా అదనపు లక్ష్యాలపై దాడులు జరిపినట్లు, అవి ఐసిస్‌కెకు చెందినవని పేర్కొంది.

## మేకేదాటు ప్రాజెక్టుకు తమిళనాడు వ్యతిరేకం



**చెన్నై,జూన్ 19:** కావేరీ నదీ జలాల పంపిణీ విషయంలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా సాగుతున్న వివాదం మేకెదాటు డ్యామ్ ప్రతిపాదనతో మరోసారి తీవ్రరూపం దాల్చింది. కర్ణాటక ప్రభుత్వం కావేరీ నదిపై మేకెదాటు వద్ద కొత్త డ్యామ్ నిర్మాణానికి జరుపుతున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ శుక్రవారం తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ ఒక కీలక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి అధికార పక్షంతో పాటు కాంగ్రెస్, వీసీకే, ఇతర రాజకీయ పక్షాలు పూర్తి మద్దతు ప్రకటించడంతో అసెంబ్లీ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది. అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టినసందర్భంగా విజయ్ మాట్లాడుతూ కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మేకెదాటు ప్రాజెక్ట్ చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ కావేరినదీ జలాల వివా దాల ట్రైబ్యునల్ ఇచ్చిన తుదిఅవార్డుతో పాటు, ఈ విషయమై గతంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా ఉల్లంఘిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

## చీలికదిశగా శరద్‌పవార్ ఎన్సీపీ..

**ముంబై,జూన్ 19:** మహారాష్ట్రలో శివసేన (యూబీటీ) చుట్టూ రాజకీయ దుమా రం రేగుతుండగా తాజాగా శరద్ పవార్ ఎన్‌సీపీఎస్పీ సైతం ఆ దిశగానే వెళ్తున్నట్టు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. శరద్ పవార్ వర్గానికి చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు తమతో సంప్రదింపులు సాగిస్తున్నట్టు అజిత్ పవార్ నేషనలిస్ట్ పార్టీ బాంబు పేల్చింది. దీంతో ప్రస్తుతం శివసేన ఎదుర్కొంటున్న పరిస్థితినే ఎన్‌సీపీ ఎస్పీ ఎదుర్కొనే అవకాశం ఉందంటూ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శరద్ పవార్ పార్టీకి చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ పార్టీతో సంప్రదింపులు జరుపుతున్నట్టు ఎన్‌సీపీ సీనియర్ నేత, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా ధర్మారావు ఆత్రం వెల్లడించారు.

# క్షయరహిత తెలంగాణ లక్ష్యంగా కృషి

## 2,492 గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్మూలనకు హెల్త్ స్క్రీనింగ్

### కేంద్రమంత్రి విడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** క్షయ రహిత రాష్ట్ర మే లక్ష్యంగా కృషిచేస్తున్నట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రంలోని 2492 గ్రామాలలో క్షయ వ్యాధి నిర్మూలనకు హెల్త్ స్క్రీనింగ్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్షయ వ్యాధి బాధితులకు ప్రభుత్వం అండగా ఉందని, నవజాత శిశు మరణాలనుతగ్గించటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు తెలిపారు. దేశంలో క్షయ, మాతశిశు సంరక్షణ, నివారణ కార్య క్రమాలపై అన్ని రాష్ట్రాల వైద్య, ఆరోగ్య శాఖ మంత్రులతో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా శుక్రవారం విడియో కాన్ఫరెన్స్‌ను నిర్వ హించారు. విడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయం సమావేశమందిరం నుండి పాల్గొన్నా



రు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను తెలంగాణ రాష్ట్రం లో 2,492 గ్రామాల్లో హెల్త్ స్క్రీనింగ్ లను నిర్వ హిస్తున్నామని మంత్రి రాజనర్సింహ వెల్లడించారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలలో వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్సతోపాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రతి నెల వెయ్యి రూపాయలు నిక్షయ పోషణ యోజన పథకం కింద అందించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. రాష్ట్రంలో పౌష్టికాహారం కోసం ఫుడ్‌బాస్కెట్‌లను బాధితులకు అందిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి రహిత తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దు తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలలో భాగంగా మాతృమరణాలను, నవజాత శిశు మరణా లను తగ్గించాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టామన్నారు. ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలకు హెల్త్ స్క్రీనింగ్ నిర్వహిస్తు న్నామని కేంద్ర మంత్రి నడ్డాకి మంత్రి దామోదర్ రాజనర్సింహ వివరించారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలలో భాగంగా హైరిస్క్ ప్రెగ్నె న్సీలను ముందే గుర్తించి గర్భిణీ స్త్రీలకు బర్త్ ప్లానింగ్ కోసం కావాల్సిన సదుపాయాలను అన్ని ప్రభుత్వ ఆసు పత్రులలో అందుబాటులో ఉంచామని మంత్రి దామో దర రాజనర్సింహ వెల్లడించారు. రాష్ట్రంలో యాంటీ నాటల్ చెకప్(ఏఎన్‌పీ)లను విధిగా 4సార్లు నిర్వ హిస్తు న్నామన్నారు. జన్యుపరమైన రుగ్మతలు (సికిల్ సెల్, తలసేమియా) ముందుగానే గుర్తించటానికి హెల్త్ చెకప్ చేస్తున్నామని మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో తెలి య జేశారు. ప్రెగ్నెన్సీ సమయంలో వచ్చే హైపర్ టెన్షన్, డయాబెటిస్, థైరాయిడ్ లాంటి వాటిని గుర్తించటానికి హెల్త్ స్క్రీనింగ్, హెల్త్‌చెకప్, ట్రీట్మెంట్ చేస్తున్నా మ న్నారు. నవజాత శిశు మరణాలను తగ్గించాలనే లక్ష్యంగా కృషి చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, టిబి కంట్రోల్ జేడీ రాజేశం పాల్గొన్నారు.

# నీట్ రీఎగ్జామ్ అభ్యర్థులకు ఆర్టీసీ ఉచిత బస్సుప్రయాణం

### తగినన్ని బస్సుల ఏర్పాటు: సంస్థ ఎండి నాగిరెడ్డి

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** ఈనెల 21న జరగనున్న నీట్ రీఎగ్జామ్ అభ్యర్థులకు టీజీఎస్ ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయంకల్పించింది. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి తగినన్ని బస్సుల ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ వీసీ అండ్ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఈ నెల 21వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించబోయే నీట్ రీఎగ్జామ్‌కు హాజరయ్యే అభ్యర్థులకు టీజీఎస్‌ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సంస్థ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను చూపించి, తమ ఇళ్ల నుండి పరీక్షా కేంద్రాల వరకు, తిరిగి ఇంటికి చేరుకోవడానికి ఉచితంగా రాకపోకలు సాగించవచ్చని ఆయన తెలిపారు. ఈ ప్రత్యేక ఉచిత ప్రయాణ సదుపాయం సంస్థకు చెందిన ఏసీ సర్వీసులు మినహాయించి అన్ని బస్సులలో అందుబాటులో ఉంటుందని ఆయన వివరించారు. పరీక్షకు దాదాపు 73 వేల మంది అభ్యర్థులు హాజరవుతున్న నేపథ్యంలో, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాల మార్గాలలో తగినన్ని బస్సులను నడిపేందుకు ముందస్తుగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 21వ తేది మొదటి సర్వీసు నుంచి అర్ధరాత్రి (12గంటలు) వరకు ఈ సదుపాయాన్ని అభ్యర్థులు వినియోగించుకోవచ్చని, ఏదైనా ఆటంకాలు ఎదురైనట్లయితే, టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నెంబర్లు 040-2345 0033, 6815 3333లలో సంప్రదించాలన్నారు. లాంటి ఒత్తిడి లేకుండా పరీక్షకు సకాలంలో చేరుకోవడానికి అభ్యర్థులు ప్లాన్ చేసుకోవాలని సూచిస్తూ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులందరికీ సంస్థ ఎండీ నాగిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు ఆర్‌జిపిఆర్ సంఘటన్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాజ్య సభ నామినేష న్‌ను తిరస్కరించిన ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో సత్యా గ్రహ నిర్వహిస్తున్నారు. ఈ దీక్ష కు ముఖ్య అతిథులుగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆల్ ఇండి యా చైర్మన్ సునీల్‌పన్వర్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ హాజరవు తున్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించే ఈ సత్యాగ్రహ దీక్షలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ తెలంగాణ చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ కోరారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో ఫీజులు వసూలు చేయొద్దు: సిఎంకు ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 19, ప్రభాతవార్త :** ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయకూడదని, 18 యేళ్లుగా అమల వుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్నే కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ విధానంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు గందరగోళానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇటీవల తెచ్చిన జీవో నంబర్ 89 వల్ల తీవ్ర అయోమయం నెలకొందని, దీనివల్ల కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజులు కట్టకపోతే రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద అరెస్టు చేస్తామని భయపెట్టడం వల్ల విద్యార్థులు చదువుపై ఆసక్తి కోల్పోతున్నారని పేర్కొన్నారు. సమస్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# మొదటిరోజు ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు 42,045 మంది దరఖాస్తు

### 22 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం ప్రారంభమైన ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కి మొదటి రోజు 42,405 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 28 వరకు స్లాట్‌బుక్ చేసుకోవడానికి అవకాశం ఉన్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ కోసం ఫీజు చెల్లించి స్లాట్ బుక్‌చేసుకోవాలి. ఈ నెల 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. ఈ నెల 25 నుంచి జులై 1 వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. జులై 4న మాక్ సీట్ అలకేషన్‌ను చేస్తారు. జులై 5 నుంచి 7 వరకు మాక్ సీట్ అలకేషన్‌లో మోడిఫికేషన్‌కు అవకాశం కల్పించారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

### మరో ముగ్గురికి గాయాలు







**పెద్దవూర, జూన్ 19, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామన్నగూడెం ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండుకార్లు ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం కొంకవారి పాలేనికి చెందిన కాకర్ల తోమాసయ్య(59), చిన్న కుమారుడు కాకర్ల ప్రకాష్ రావు (35), హైదరాబాద్ నుండి గురువారంసాయంత్రం హయత్‌నగర్‌కు చెందిన ఎరకల ప్రవీణ్ కారును కిరాయికి మాట్లాడుకుని హైదరాబాద్ నుండి నాగార్జునసాగర్‌లోని సాగర్‌మాత గుడికి బయలుదేరారు. పెద్దవూర మీదుగా నాగార్జునసాగర్‌వైపు వెళ్తూ రాత్రి 10.00 గంటలకు పెద్దవూర మండలం లోని రామన్నగూడెం తండా శివారులోకి వచ్చేసరికి, అదే సమయంలో నాగార్జునసాగర్ నుండి పెద్దవూర వెళ్తున్న మారుతి సుజుకి కారును డ్రైవర్ గొర్రె రామకృష్ణ అతివేగంగా అజాగ్రత్తగా, రాంగ్ రూట్లో నడుపుకుంటూ వెళ్లి తోమాసయ్య, ప్రకాష్‌రావు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా ఢీకొట్టాడు. దాంతో తోమాసయ్య, ప్రకాష్‌రావు ఘటనాస్థలంలోనే చనిపోయారని పోలీసులు తెలిపారు. వీరితోపాటు హనుమకొండకు చెందన రావుల సాయి కుమార్‌కూడా తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే చనిపోయారని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి వస్తున్న కారులోని డ్రైవర్ ప్రవీణ్ కు, మరో ప్రయాణికుడు కొర్రసాయికి, మరొకరికి గాయాలయ్యాయి. మృతదేహాలను, గాయపడిన వారిని నాగార్జునసాగర్ ఆస్పత్రికి తరలించి శీను నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# ఉన్నత విద్యలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి

### కొత్త కోర్సులను అన్ని వర్సిటీల్లో అమలు చేయాలి: గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** ఉన్నత విద్యలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిల వాలని, తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రవేశ పెట్టిన భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన కోర్సులను 2026-27 విద్యా సంవత్సరం నుంచి అన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అమలు చేయాలని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టీజీసీహెచ్‌ఈ) ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించి, ఆయనతో సమావేశమై, ఉన్నత విద్యా మండలి ప్రతిపాదించిన వినూత్న విద్యా కార్యక్రమాలను ప్రవేశపెట్టడం, అమలు అంశాలపై సవివరంగా సమీక్ష నిర్వహించారు.

2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాలను రాష్ట్రంలోని అన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అమలు చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని గవర్నర్ టీజీసీహెచ్‌ఈని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి ఏరోస్పేస్, డిఫెన్స్, మారిటైమ్, ఫిన్‌టెక్, క్లైమేట్ గవర్నెన్స్, లైఫ్ సైన్సెస్, ఫుడ్ టెక్నాలజీ తదితర అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన రంగాలలో టీజీసీహెచ్‌ఈ ప్రవేశపెట్టిన నూతన కోర్సుల గురించి గవర్నర్‌కు వివరించారు. జాతీయ విద్యా విధానం-2020తో పాటు అంతర్జాతీయ ఉత్తమ ప్రమాణాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. జాతీయ ప్రాధాన్యతలు, పరిశ్రమల అవసరాలు, భవిష్యత్ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ఈ కోర్సులను రూపొందించినట్లు తెలిపారు. ఉపాధి ఆధారిత, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన కోర్సులను ప్రవేశపెట్టడం పట్ల ఛాన్సలర్ ఎస్‌పి శుక్లా హర్షం వ్యక్తం చేశారు. వేగంగా మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలతో కూడిన మానవ వనరులను తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. ఉన్నత విద్యలో వినూత్నతకు ప్రాధాన్యతనిస్తున్న తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలని గవర్నర్ ఆకాంక్షించారు. 2026-27 విద్యా సంవత్సరంనుంచే ఈ కోర్సులను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు ఇతర భాగస్వామ్య సంస్థలతో మరింత సమన్వయం పెంపొందించి ఈ కార్యక్రమాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.

# ఫాస్ట్‌ఫుడ్ గోదాంపై హెచ్-ఫాస్ట్ బృందం దాడి

### కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం

**హైదరాబాద్ (చార్మినార్), జూన్ 19, ప్రభాతవార్త :** ఆహార కల్తీ, సురక్షిత ఆహార పద్ధతులపై నిరంతర నిఘాలో భాగంగా హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వేలైన్స్ టీమ్, ఫుడ్‌సేఫ్టీ ఎఫ్ఎస్ఒతో కలిసి చార్మినార్ సమీపంలోని హుస్సేనీఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ ఫాస్ట్‌ఫుడ్ గోదాంపై ఆకస్మిక దాడి నిర్వహించింది. చార్మినార్ సమీపంలోని పంచమొహల్లా న్యూలాడ్ బజార్‌లో ఉన్న మెసర్స్ అల్‌అక్బర్ ఫాస్ట్ ఫుడ్ అండ్ గోడౌన్ ప్రాంగణాన్ని తనిఖీ చేసింది.



ఫాస్ట్‌ఫుడ్ తయారీ ప్రాంతంలో అపరిశుభ్రమైన వాతావరణం

ఈ తనిఖీల్లో ప్రజల ఆరోగ్యానికి తీవ్రముప్పు కలిగించేలా అత్యంత అపరిశుభ్రమైన, ప్రమాదకరమైన ఆహారాన్ని తయారుచేయటం, నిల్వ చేయటాన్ని హెచ్-ఫాస్ట్ బృందం గుర్తించింది. 110 కిలోల తయారు చేసిన ఫ్రైడ్‌చికెన్, 6 టిన్నుల వంటనూనె, కృత్రిమ ఆహార రసాయన రంగులను స్వాధీనం చేసుకున్నారు. ఫుడ్‌సేఫ్టీ యాక్ట్ అండ్ స్టాండర్డ్స్ యాక్టు ప్రకారం 2006 ప్రకారం హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని హుస్సేనీఆలం పోలీసులకు అప్పగించారు.

# క్రీడామౌలిక సదుపాయాల అభివృద్ధికి సిఎం రేవంత్, గవర్నర్ శివప్రతాప్‌శుక్లా శ్రీకారం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 19:** ఎల్‌బి స్టేడియం ప్రాంగణంలోనే శుక్రవారం సాయంత్రం గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో కలిసి రూ.50.73 కోట్లతో రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రూ.36.65 కోట్లతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మినీ స్టేడియంల నిర్మాణం, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి సిఎం శంకుస్థాపన చేశారు. రూ.14.08 కోట్లతో గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియం లలో బాల బాలికల క్రీడా శిక్షణకు వివిధ అకాడమీలను సిఎం ప్రారం భించారు. శంకు స్థాపనల వివరాలు: రూ. 10 కోట్లతో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గ్ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం రూ.10 కోట్లతో సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డా.,బీఆర్ అంబేద్కర్ స్టేడియం ఆధునీకరణ రూ.4 కోట్లతో నారాయణపేట్ జిల్లా నర్వ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణంరూ.4 కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణంలో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్ట్స్ నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి.రూ.3.50 కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం రూ.2.65 కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణంరూ.2.50 కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్ కబడ్డీ కోర్ట్స్ నిర్మాణం. ప్రారంభోత్సవాల వివరాలు:రూ.5.70 కోట్లతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన నీ.నీతి తి.నీనీ తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన నీ.నీతి తి.నీనీ తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమీ ప్రారంభం రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమీ ప్రారంభం చేశారు.

# పాలిసెట్ తుది విడతలో 25,111 సీట్ల కేటాయింపు

### సీటు పొందిన విద్యార్థులు 23లోగా కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు చేశారు. తుది విడతలో రాష్ట్రంలో ఉన్న సీట్లలో 25,111 సీట్లను కేటాయించినట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్‌లో 81,307 మంది అర్హత సాధించగా.. వారిలో ఫైనల్ ఫేజ్‌లో 15,515 మంది సీట్ల కోసం వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. మొత్తం 2,96,336 ఆప్షన్లను విద్యార్థులిచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 25,111 మంది సీట్ల కేటాయింపు చేశారు. 112 ప్రభుత్వ, పాలిటెక్నిక్ కాలేజీల్లో 33,535 సీట్లు 2026-27 విద్యా సంవత్సరానికి అందుబాటులో ఉన్నాయి. 59 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 18,538 సీట్లు ఉండగా వాటిలో 17,001 సీట్లను కేటాయించారు. మరో 1537 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్త సీట్లలో 92 శాతం సీట్లను తుది విడతలో కేటాయించారు. 53 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో 14,997 సీట్లు ఉండగా వాటిలో 8110 సీట్లను కేటాయించారు. మరో 6887 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం సీట్లలో 54 శాతం సీట్లు తుది విడతలో కేటాయించారు. మొత్తం సీట్లలో 75 శాతం సీట్లను కేటాయించారు. 2132 ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లను కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు వెంటనే ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, 23 తేదిల్లో ఆయా కాలేజీల్లో నేరుగా చేరాలని సూచించారు.

# నైతికతలేని బిజెపి సింగరేణిపై చిల్లర రాజకీయాలు మానుకోవాలి

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** సింగరేణి పైన చిల్లర రాజకీయాలు మానుకోవాలనీ,సింగరేణిపైన మాట్లాడే నైతిక అర్హత బిజెపికి లేదనీ ప్రభుత్వ విప్‌అద్దంకి దయాకర్ అన్నారు. శుక్రవారం సిఎల్‌పిలో ఆయన మాట్లాడుతూ బొగ్గు బ్లాక్ లను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న బిజెపి సింగరేణికి ఎలా వెళ్ళుతుందనీ, సింగరేణిలో పర్యటించే హక్కు బిజెపి కి లేదనీ అన్నారు. కార్మికుల పొట్టను కొట్టే పాలసీలు చేసి మళ్లీ అక్కడకు పోయేందుకు యత్నిస్తున్న బిజెపి ఎంత దౌర్భాగ్య స్థితిలో ఉందో దీని వల్ల అర్థమోతోందనీ అన్నారు. సింగరేణి పైన బిజెపి బిఆర్ఎస్ కలిసి కుట్రలు చేస్తున్నాయనీ ఆరోపించారు. రాజకీయ రహస్య మిత్రులు ఇద్దరు సింగరేణి చుట్టు రాజకీయాలు చేస్తున్నారనీ అన్నారు. బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేస్తున్న విధానంపైన బిజెపి సమాధానం చెప్పాలనీ కోరారు.. సింగరేణి ని ప్రైవేటీకరణ కు బిజెపి ప్రభుత్వ ప్రయత్నాలపైన కిషన్ రెడ్డి కార్మికులకు ఏం చెబుతారని అడిగారు. బొగ్గు గనుల ను ప్రైవేటీకరణ చేస్తున్న బిజెపికి బొగ్గుల నిల్వలపైన మాట్లాడే అర్హత ఎలా ఉంటుందనీ అన్నారు.సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. సింగరేణిని ఆదుకుంటున్నది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. సింగరేణి కార్మికులకు బోనస్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు.సింగరేణి భక్షకులను కార్మికులు నమ్మరనీమీలాంటి వాళ్లను కార్మికులు నమ్ముతారనుకోవడం పిచ్చి భ్రమ అని ఆయన అన్నారు. అందుకే చిల్లర రాజకీయాలు మానోకోండని సలహా ఇచ్చారు.

# 'సర్' ప్రక్రియ జీవించే హక్కును కాలరాస్తోంది

### రాష్ట్ర సదస్సులో రాజకీయ పార్టీల నేతలు

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రజలు జీవించే హక్కును హరించేదిగా ఉందని సీపీఐ నిర్వహించిన రాష్ట్ర సదస్సులో రాజకీయ పార్టీల నేతలు అభిప్రాయపడ్డారు. ఎస్ఐఆర్‌కి వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్ జరి గింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన రౌండ్‌సమావేశంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్‌గౌడ్, ఎంపి మల్లు రవి, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు అబ్బాస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు చలపతి, సిపిఐ(ఎంఎల్) మాస్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హన్మేష్, ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి మురహరి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ పాల్గొన్నారు. గ్రామసభ లేదా వార్డు కమిటీలలో ముసాయిదా ఓటర్ల జాబితాను వెల్లడించడం, ఓటు హక్కు నిర్ధారణకు గ్రామ సభలు, వార్డు కమిటీలను అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం, ప్రజల వద్ద అందుబాటులో ఉన్నధృవీకరణ పత్రాలను ఆమోదించడం, అలాగే ఓటు హక్కును, పౌరసత్వానికి ముడి పెట్టరాదని తీర్మానాలను రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) అనే ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన పద్ధతి అని, కానీ ప్రస్తుతం ఓట్లు తొలగించే కార్యక్రమంగా మారిందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గాన్ని కమ్యూనిస్టులు, కాంగ్రెస్, లౌకికవాద శక్తులన్నీ కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ఒక బ్రహ్మాస్త్రమని, ఆలాంటి ప్రతి ఒక్కరి ఓటును భద్రపరిచి జతచేయడమే ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశం కావాల్సి ఉండగా, లౌకికవాద పార్టీలకు ఓటు వేస్తారనే అనుమానం ఉన్న ప్రతి ఒక్కరి ఓటు తొలగించే ప్రక్రియగామారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 2002లో లింగ్డో నేతృత్వంలో హైదరాబాద్ ఎస్ఐఆర్ జరిగినప్పటికీ, నాటికి నేటికీ చాలా తేడా ఉందన్నారు. ఓట్ల తొలగింపు వల్ల ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతు న్నారని, కూలీ పనులు చేసుకునే వారు ఓటు హక్కు కోసం కార్యాలయాల చుట్టూ తిరగడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్‌ఏ) వ్యవస్థ చాలా ప్రాధాన్యమైందని, ఓటర్ల జాబితాను కాపాడుకోవడంలో వీరి పాత్ర కీలకమని తెలిపారు. కాంగ్రెస్ తరుపున తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో ఇప్పటికే 108 నియోజకవర్గాల్లో బిఎల్‌ఏ శిక్షణ పూర్తి చేశామని వెల్లడించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు అనేది ప్రాణ వాయువు లాంటిదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడేందుకు ఎంత వరకైనా ఉద్యమాలకు సిద్ధమని ప్రకటించారు. రాష్ట్రంలో దాదాపు 80 లక్షల మంది ఓటర్ల వివరాలు నిర్ధారణ కాలేదంటూ పత్రికల్లో వస్తున్న వార్తలు తీవ్రంగా కలవరపెడుతున్నాయన్నారు. ఓటు హక్కు నిరూపణకుగాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ధ్రువీకరణ పత్రాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటర్ల హక్కులను కాపాడేందుకు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం అందజేయడంతో పాటు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించేలా ఒత్తిడి తెచ్చేందుకు పెద్ద ఎత్తున నిరసనలు, ఉద్యమాలకు సంసిద్ధం అవుదామని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలను అడ్డుకోవడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారానే అడ్డుకట్ట వేయగలుగుతామని, ఇందుకు అన్ని పార్టీలు కలిసి రాజకీయంగా చేపట్టాల్సిన వ్యూహాలకు పదును పెట్టాలని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి అన్నారు. ఈనెల 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్




మాట్లాడుతూ ఓటు హక్కు కోల్పోవడం అంటే కేవలం ఓటు వేసే అవకాశం పోవడం మాత్రమే కాదని, ఇది భవిష్యత్తులో పౌరసత్వాన్ని కూడా కోల్పోయే ప్రమాదానికి దారితీయవచ్చని హెచ్చరించారు. ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు ప్రతి పేద వర్గానికి పెద్ద సమస్యగా మారనుందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో భాగంగా ఓటర్ల జాబితా నుండి పేర్ల తొలగింపు ప్రక్రియకు సమాజంలో ప్రశ్నించే గొంతులను, మేధావులను అర్బన్ నక్సల్స్‌గా ముద్ర వేయడం వెనుక ఒక నిర్దిష్టమైన రాజకీయ భావజాలం దాగి ఉందని ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ వంటి మైనారిటీలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఓట్ల తొలగింపు ప్రక్రియపై అధికార పక్షాలు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయని, దీనిని తిప్పికొట్టడానికి వామపక్షాలు, ఇతర ప్రజాస్వామ్య శక్తులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు.



## 25 నుంచి 'సర్' ఇంటింటి సర్వే

### అధికారులతో వీసి నిర్వహించిన సిఇఒ సుదర్శన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 19:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. సుమారు 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) 2026 కార్యక్రమాన్ని జూన్ 25 నుంచి చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), ఏజెంట్లతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు స్వచ్ఛంద కార్యకర్తలతో సమన్వయం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో కనీసం వారానికి ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. గణన ఫారం నింపడం, పంపిణీ, సేకరణ, డేటా అప్‌లోడ్ ప్రక్రియలపై బీఎల్ఓలకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలి. తరచూ అడిగే ప్రశ్నలు, కరపత్రాలు, స్థానిక అవగాహన కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి. పారదర్శకతను నిర్ధారించేందుకు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలి. ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు, గ్రామ పంచాయతీలు, ఇతర భాగస్వామ్య వర్గాలను భాగస్వామ్యం చేయాలి.పైన సూచించిన మార్గదర్శకాలను పక్కాగా అమలు చేస్తూ కచ్చితమైన ఓటర్ జాబితా రూపకల్పనకు సంబంధిత అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, వాటిని ధృవీకరిస్తారు. నకిలీ, మరణించిన లేదా శాశ్వతంగా మారిన ఓటర్లను జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 35,000 మందికి పైగా బీఎల్ఓలు, దాదాపు 26,000 మంది బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించనున్నారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా ప్రామాణికంగా తీసుకుని తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 3.39 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఈ సర్వేలో సమగ్రంగా పరిశీలించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## మొక్కజొన్న బకాయిల కోసం ఎదురుచూపులు

### రైతులకు రూ.2 వేల కోట్ల బకాయిలు

### చోద్యం చూస్తోన్న మార్కెటింగ్ ఫెడరేషన్

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మొక్కజొన్న రైతులకు కష్టాలు మాత్రం తప్పడం లేదు. ఒక పక్క మద్దతు ధర లేకపోగా, మరోపక్క కొనుగోలు చేసిన మక్కలకు తెలంగాణ మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) సొమ్ములు చెల్లించకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఖరీఫ్ సీజను ప్రారంభం కావడంతో పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్న రైతులకు ఇంకా సుమారు రూ.2వేల కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. ఇక యాసంగిలో మద్దతు ధర రూ.2,400 ప్రకటించినా వ్యాపారులు మాత్రం రూ.1,600కు మించి చెల్లించలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరిపింది. అయితే అరకొరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు, నిబంధనలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోజుల తరబడి కేంద్రాల వద్దనే పడిగాపులు కాయగా, కాంటాలు వేశాక కూడా మిల్లులకు తరలింపులో జరిగిన జాప్యంతో కేంద్రాల వద్దే వేచి ఉండాల్సి వచ్చింది. కొనుగోళ్లలో ఇక్కట్లు ఎదురుకావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రైతులు ఆందోళనలు సైతం చేశారు. ఈ పరిస్థితుల్లో చివరకు రాష్ట్రంలోని రైతుల నుంచి దాదాపు 16 లక్షల టన్నుల వరకూ మొక్కజొన్నను క్వింటాకు రూ.2,400 చొప్పున మార్క్‌ఫెడ్ మద్దతు ధరకు కొనుగోలు చేసింది. దీని నిమిత్తం విక్రయించిన రైతులకు మార్క్‌ఫెడ్ రూ.3,900 కోట్ల వరకు చెల్లించాల్సి ఉండగా, ఇంతవరకు రూ.1,800 కోట్లు మాత్రమే చెల్లించినట్లు వెల్లడైంది. ఇంకా రూ.2,100 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్టుగా తెలుస్తోంది. రుణం ఇంకా రాలేదని, చెల్లింపులకు సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. వాస్తవానికి మొక్కజొన్న కొనుగోలు కోసం జాతీయ సహకారాభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి మార్క్‌ఫెడ్ రూ.4వేల కోట్ల రుణం తీసుకుంది.

## ప్రేయసి కుటుంబంపై కత్తితో దాడి చేసిన యువకుడు

### యువతి కుటుంబసభ్యులకు గాయాలు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూన్ 19, ప్రభాతవార్త:** ఓ ప్రేమోన్మాది రాయదుర్గంలో రెచ్చిపోయాడు. తన వెంట పడవద్దని హెచ్చరించినందుకు యువతి ఇంటి మీదకు వచ్చి కత్తితో కుటుంబ సభ్యుల మీద దాడికి పాల్పడ్డాడు. ఈ ప్రేమోన్మాది దాడిలో యువతి కుటుంబ సభ్యులు గాయాలపాలయ్యారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈసంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... రాయదుర్గం ఎండ్ల బస్తీలో నివాసం ఉండే ఎండ్ల కార్తీక(20) కళాశాలలో చదువుకుంటుంది. కాగా ఇదే ప్రాంతానికి చెందిన కంచమీది గోవర్ధన్(22) గత కొన్ని రోజులుగా కార్తీకను ప్రేమిస్తున్నానని వేదించసాగాడు. ఈ క్రమంలో కార్తీక ఇతని ప్రేమకు ఒప్పుకోలేదు. ఈ విషయమై కక్ష పెంచుకున్న గోవర్ధన్ శుక్రవారం సాయంత్రం సమయంలో ఒక్కసారిగా పక్క ఇంటి గోడ దూకి కార్తీక ఇంట్లోకి వచ్చాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో కార్తీక కుటుంబ సభ్యుల మీద దాడికి పాల్పడ్డాడు. ఇతన్ని అడ్డుకునేందుకకు ప్రయత్నించిన కార్తీక సోదరి ఏండ్ల పూజిత మీద కత్తితో దాడి చేయగా, పూజిత చేతికి తీవ్ర గాయమైంది. అనంతరం ఇంట్లోకి వెళ్లిన గోవర్ధన్... కార్తీక మీద దాడి చేసేందుకు ప్రయత్నించగా, ఆమె తల్లితండ్రులు అడ్డుకున్నారు.దీంతో గోవర్ధన్ వారి మీద సైతం కత్తితో దాడి చేశాడు. గోవర్ధన్ బారి నుంచి తప్పించుకున్న కార్తీక కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు అక్కడికి చేరుకొని గోవర్ధన్‌ను పట్టుకున్నారు. అనంతరం రాయదుర్గం పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. కాగా నిందితుడి దాడిలో గాయపడిన కార్తీక సోదరి పూజిత చేతికి తీవ్ర గాయం కాగా, ఆమె తల్లిదండ్రులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వీరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



నిందితుడు గోవర్ధన్

# పిఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనతో 70 లక్షల ఉద్యోగాలు

### రూ.2,400 కోట్ల ప్రోత్సాహకాలు విడుదల చేసిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 19:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ద్వారా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 70 లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించామని ప్రధాని నరేంద్రమోడీ తెలిపారు. ఈ సందర్భంగా తొలి ఉద్యోగం పొందిన 15 లక్షల మంది ఉద్యోగులు మరియు వారి యజమానులకు రూ.2,400 కోట్ల ప్రోత్సాహకాలను శుక్రవారం విడుదల చేశారు.ఈ మొత్తాన్ని నేరుగా లబ్ది బదిలీ డీబీటీ విధానం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.ఈ కార్యక్రమంలో మాట్లాడిన ప్రధాని మోదీ, ప్రభుత్వం, యువత మరియు పరిశ్రమలు కలిసి పనిచేసినప్పుడు ఉద్యోగాల సృష్టి అనేక రెట్లు పెరుగుతుందని అన్నారు. పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ద్వారా 70 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కాకుండా, లబ్ధిదారులకు సామాజిక భద్రతా రక్షణ కూడా అందించామని పేర్కొన్నారు.కొత్త ఉద్యోగాలను సృష్టించే సంస్థలు, యజమానులను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన తెలిపారు. ముఖ్యంగా తొలి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న యువతకు పరిశ్రమలతో అనుసంధానం కల్పించే వారధిగా ఈ పథకం పనిచేస్తోందని వివరించారు.పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ద్వారా ఉద్యోగాల కల్పనకు మద్దతు ఇస్తున్నామని యువతకు సాధికారత కల్పిస్తూ, భవిష్యత్తు కోసం బలమైన శ్రామిక శక్తిని నిర్మిస్తున్నామని ప్రధాని అన్నారు.

ఈ పథకం తొలి ఉద్యోగం పొందుతున్న యువతకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, పరిశ్రమలు మరియు యువత మధ్య బలమైన అనుసంధానాన్ని ఏర్పరుస్తుందని పేర్కొన్నారు. యువత ఆకాంక్షలు, నైపుణ్యాలు, సామర్థ్యాలే వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గదర్శకమని ఆయన అన్నారు.రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణలు, వ్యవస్థాపకత రంగాల్లో భారత యువత కీలక పాత్ర పోషిస్తారని ప్రధాని విశ్వాసం వ్యక్తం చేశారు. 21వ శతాబ్దంలో నైపుణ్యాలను పెంపొందించే, ఆవిష్కరణలను ప్రోత్సహించే, అత్యున్నత నాణ్యత ప్రమాణాలను పాటించే దేశాలకే ఎక్కువ అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

ఈ మూడు అంశాల్లో భారత్‌కు అపారమైన సామర్థ్యం ఉందని ప్రధాని పేర్కొన్నారు.పీఎంవీబీఆర్‌వై పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.99,446 కోట్ల వ్యయాన్ని కేటాయించింది. రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాల సృష్టిని లక్ష్యంగా నిర్దేశించింది.ఈ పథకం కింద తొలి ఉద్యోగం పొందిన ఉద్యోగులకు గరిష్ఠంగా రూ.15,వేల వరకు ఆర్థిక సహాయం అందజేస్తారు. ప్రతి కొత్త ఉద్యోగికి యజమానులకు నెలకు గరిష్ఠంగా రూ.3,000 వరకు ప్రోత్సాహకం అందజేస్తారు.తయారీ రంగంలో ఉపాధిని మరింత పెంచేందుకు ఈ పథకం కింద ప్రత్యేక ప్రయోజనాలను నాలుగేళ్ల వరకు పొడిగించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.



# ఖజానాకు ఆదాయమే లక్ష్యం

### రాబడి తెచ్చే రంగాలపైనే దృష్టి

### పొరుగు రాష్ట్రాలకు ఇసుక ఎగుమతి

### మంత్రివర్గ ఉపసంఘంలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క



**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త :** ఖజానాకు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మన వనరులే మన పెట్టుబడి అని, ప్రభుత్వానికి ఆదాయ వనరులు తీసుకువచ్చే రంగాలపై పూర్తిగా కేంద్రీకరించాలన్నారు. హైదరాబాద్ సచివాలయంలో శుక్రవారం ఆదాయ వనరుల సమీకరణపై మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలసి భట్టి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలోరి పర్యాటక సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాల్సి న అవరం ఉందన్నారు. పర్యాటక కేంద్రాల్లోని ప్రభుత్వ భూములు, స్థలాల ద్వారా ఖజానాకు ఆదాయాన్ని తీసుకురావాలని సూచించారు. గోవా, కేరళ వంటి రాష్ట్రాలు పర్యాటకాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజలకు ఉపాధిని కల్పించడమే కాకుండా, జీడీపీ పెరుగుదలకు ఉపయోగపడుతోందని చెప్పారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజం రంగాల్లో మరింత దూకుడుగా ముందుకు వెళ్లాలని సూచించారు. వారాంతాల్లో హెలీకాప్టర్ టూరిజాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. అలాగే శ్రీశైలం, నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ లో పర్యటకాన్ని పీపీపీ మోడల్లో అభివృద్ధి చేసి సంపద సృష్టించాలన్నారు. దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి లక్ష్యాల సాధనలో పర్యాటకం కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు.

సమగ్ర పర్యాటక అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి కేబినెట్ ముందుంచాలని ఆదేశించారు. కాగా లోయర్ మానేరు, అప్పర్ మానేరు, మేడిగడ్డ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పూడికతీత పనులపై కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష చేసింది. చట్టపరమైన నిబంధనలు పాటించే క్రషర్లకు అనుమతులు ఇవ్వాలని సబ్ కమిటీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. నది ఇసుకతో పోలిస్తే రోబో శాండ్ తక్కువ ధరకు లభిస్తోందని గుర్తించింది. ఇరుగు పొరుగు రాష్ట్రాలకు ఇసుకను ఎగుమతి చేయడంపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ఉప సంఘం సూచించింది. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ముఖ్యంగా స్లాబ్ ఆధారిత భూముల విలువ సవరణ వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయని అభిప్రాయపడింది. రవాణా శాఖకు సంబంధించి ఆదాయం, వసూళ్లు పెంచేలా చర్యలపై చర్చించింది. అందులో భాగంగా బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ల విషయంలో పన్నులపై రాష్ట్ర అధికారాన్ని సమర్థిస్తూ కేరళకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చినట్లు సబ్ కమిటీ గుర్తించింది. భారత్ సిరీస్ రిజిస్ట్రేషన్లపై చట్టపరమైన, విధానపరంగా తీసుకోవల్సి న అంశాలను ప్రస్తావించింది. బీహెచ్ సిరీస్ పన్నుల అంశంపై చర్చించేందుకు దక్షిణాది రాష్ట్రాల రవాణా మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించింది. అనంతరం పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణ కార్యక్రమాల ద్వారా ఆదాయ సమీకరణను సమీక్షించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్అథారిటీ కమిషనర్ శశాంక, మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ దురిశెట్టి అనుదీప్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రెటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, ట్రాన్స్ పోర్ట్ కమిషన్ ఇళాంభర్తి, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్. శ్రీధర్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వాణి ప్రసాద్, ఇండస్ట్రీస్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ ఆదిత్య, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్ తదతరులు పాల్గొన్నారు.

## యాంత్రీకరణకు ప్రాధాన్యత

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** ఆధునిక వ్యవసాయంలో యాంత్రీకరణకు అత్యంత ప్రాధాన్యత ఉందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఎర్త్‌కాన్ ఎక్స్‌పో-2026 ఎగ్జిబిషన్‌లో శుక్రవారం ఆయన స్టాళ్లను సందర్శించి అందులో ప్రదర్శించిన లోడర్, ఎక్స్‌వేటర్ యంత్రాల పనితీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కూలీల కొరత తీవ్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి యంత్రాలు రైతులకు పెద్ద ఎత్తున ఉపయుక్తమవుతాయన్నారు. తక్కువ సమయంలో వ్యవసాయ పనులను పూర్తి చేసుకునేందుకు తోడ్పడతాయని తెలిపారు. రైతులకు పొలంలో సులభంగా ఉపయోగపడే పోర్టబుల్ యంత్రాలను తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకువస్తున్న ఈ తరహా వినూత్న యంత్రాలకు మార్కెట్లో మంచి ఆదరణ లభించే అవకాశం ఉందన్నారు. ఇటువంటి యంత్రాలను వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో చేర్చినట్లయితే రైతులకు 40 శాతం సబ్సిడీతో అందించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం డీజిల్‌తో నడుస్తున్న ఈ యంత్రాలకు ప్రత్యామ్నాయంగా బ్యాటరీతో పనిచేసే నమూనాలను కూడా త్వరలో మార్కెట్‌లోకి తీసుకురావాలని సూచించారు. 2027 నాటికి ఈవీ హైడ్రాలిక్ ఎక్స్‌వేటర్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1.5 టన్నుల సామర్థ్యం గల మినీ హైడ్రాలిక్ ఎక్స్‌వేటర్ ఈవీ మార్కెట్‌లోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే వినియోగదారుల కోసం ప్రత్యేక డెమో జోన్ ఏర్పాటు చేయడంతో పాటు, ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

## 21వ శతాబ్దం సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలదే : మంత్రి శ్రీధర్‌బాబు

### ఖాజాగూడలో ఉత్సాహంగా హైదరాబాద్ ఎకనామిక్ ఫోరం

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూన్ 19, ప్రభాతవార్త:** వనరులు, పరిశ్రమలు, పెట్టుబడుల మీద 20వ శతాబ్దం పోటీపడిందని, కానీ 21వ శతాబ్దం సరికొత్త ఆలోచనలు, ప్రతిభ, ఆవిష్కరణలదేనని తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖమంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచంలోని అగ్రగామి ఆర్థిక ఆవిష్కరణల హబ్‌గా నగరాని న్ బలోపేతం చేసే లక్ష్యంతో నగరంలోని ఖాజాగూడలో శుక్రవారం మొదటి హైదరాబాద్ ఎకనామిక్ ఫోరం-2026ను నిర్వహించారు. ఒకే సిటీ, ఒకే విజన్, అపార అవకాశాలు అనే నినాదంతో నిర్వహించిన ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఐటి, పరి శ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరికొత్త ఆలోచనలతో తెలంగాణకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఆలోచన విజయవంతం అవుతుందని గ్యారెంటీ లేదని, కానీ నిజాయితీతో కూడిన ప్రతి ఆలోచనకు తెలంగాణలో మద్దతు లభించడంతో పాటు అవకాశం, ఎదిగేందుకు ప్రోత్సాహం లభిస్తాయన్నారు. గత దశాబ్ద కాలంలో గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారతదేశం 81 స్థానం నుంచి 39వ స్థానానికి చేరిందని, ఇది అద్భుతమైన వ ృద్ధి అని అన్నారు. దేశంలో పెరుగుతున్న ఆవిష్కరణల సామర్థ్యాన్ని సూచిస్తుందన్నారు. నేడు ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టంగా భారత్ నిలుస్తుందని తెలిపారు.



## పారిశ్రామిక తయారీ ఆవిష్కరణల ప్రతిభా ప్రదర్శన ఎఫ్‌టిసిసిఐ ఐఐటెక్స్-2026

**హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 19, ప్రభాతవార్త :** పారిశ్రామిక శక్తి, ఆవిష్కరణలు, తయారీరంగ ప్రతిభను ఐఐటెక్స్ 2026 ప్రదర్శించనున్నట్లు తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో మూడో ఎడిషన్‌ను ఎఫ్‌టీసీసిఐ శుక్రవారం సాయంత్రం ప్రకటించింది. ఈ ప్రదర్శన జూన్ 26 నుండి 28వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించబతుంది. ఈమేరకు ఎఫ్‌టీసీసిఐలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎఫ్‌టీసీసిఐ అధ్యక్షుడు ఆర్.రవికుమార్ తయారీదారులు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక పరిజ్ఞాన సంస్థలు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలను ఒకే వేదికైకి తీసుకువస్తూ ఐఐటెక్స్ తెలంగాణలోని అత్యంత ప్రాధాన్యమైన పారిశ్రామిక వేదికలో ఒకటిగా ఎదిగిందని ఆయన పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధికి తయారీరంగం ఇప్పటికీ వెన్నెముకగానే సాగుతోందని, ఉపాధి అవకాశాల సృష్టి, పెట్టుబడుల ఆకర్షణ, సరఫరా గొలుసుల బలోపేతం, కొంగ్రొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం కల్పిస్తోందని తెలిపారు. పరిశ్రమలకు ప్రభుత్వ అనుకూలమైన విధానాలు, బలమైన మౌలిక సదుపాయాలు, చురుకైన ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థలతో తెలంగాణ దేశంలో అత్యంత అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక గమ్యస్థానాలలో ప్రముఖంగా నిలిచిందన్నారు. ఐఐటెక్స్ ప్రదర్శనకే పరిమితం కాకుండా తెలంగాణ పారిశ్రామిక శక్తి, స్ఫూర్తి, తయారీరంగ ప్రతిభను ప్రతిబింబించే వేదికని రవికుమార్ పేర్కొన్నారు. ఇందులో వందకుపైగా ఎగ్జిబిటర్లు పాల్గొనున్నారని, తయారీ, ఇంజినీరింగ్, ఆటోమేషన్, పునరుత్పాదక ఇంధనాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలకు చెంది పదివేలకుపైగా వ్యాపార నిర్ణయాధికారులు హాజరుకానున్నట్లు రవికుమారు వెల్లడించారు.

# భూవివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

### రాష్ట్రంలో దశలవారీగా భూముల రీసర్వే: మంత్రి పొంగులేటి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 19:** భూ సమస్యలు, భూవివాదాలు లేని తెలంగాణను నిర్మించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భూ సర్వే నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని వచ్చే నెల నుంచి దశల వారీగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలుండగా తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాల నుంచి 70 గ్రామాల చొప్పున మొత్తం 2240 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని.. అది అతని జీవనాధారమని ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఈ రీసర్వే కార్యక్రమం చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారంగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, ఉపసంఖ్యలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దులు మారడం వల్ల అనేక ప్రాంతాల్లో భూముల అసలు హద్దులపై స్పష్టత లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం సమగ్ర రీసర్వే చేపడుతోందని తెలిపారు. భూ వివాదాల పరిష్కారంలో భాగంగా రాష్ట్రంలో నిజాం కాలం నుంచి నక్షాలు లేని 378 గ్రామాలను గుర్తించామని, వాటిలో ఇప్పటికే 5 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి భూదార్ నంబర్లు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన 373 గ్రామాల్లో కూడా రోవర్స్ వంటి ఆధునిక సాంకేతికతతో సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు పూర్తిగా స్వస్తి చెబుతున్నామని మంత్రి తెలిపారు.

## ప్రభుత్వం గుర్తించిన 7 రకాల సన్నాల్లో ఒక రకం వరినారు వద్దని వాతావరణ శాఖ హెచ్చరిక

**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త :** ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులను ఏడు సన్న రకాల నాణ్యమైన వరి పంటలను పండించడానికి ప్రోత్సహించాలని తెలంగాణ ప్రభుత్వం సూచించగా, వాటిలో ఒక రకం వరి నారుమడిని పెంచవద్దని భారత వాతావరణ శాఖ రైతులను హెచ్చరించింది. ఈ మేరకు తెలంగాణకు సంబంధించిన వ్యవసాయ వాతావరణ సలహా సేవా బులెటిన్‌లో ఇప్పటివరకు కురిసిన వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ నెలలో తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048) ఉపయోగించి రైతులు వరి నారును విత్తవద్దని ఐఎండి జూన్ 16న తెలిపింది. దానికి బదులుగా, రైతులు పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, మినుములు, ఆముదం వంటి వర్షాధార పంటలను సాగు చేయాలని పేర్కొంది. తేలికపాటి నేలల్లో ఒక వారంలో 50 నుండి 60 మిల్లీ మీటర్లు, బరువైన నేలల్లో అయితే 60 మిల్లీ మీటర్ల నుండి 75 మిల్లీ మీటర్ల వరకూ మొత్తం వర్షపాతం నమోదైన తర్వాత, లేదా వర్షపు నీటి పైభాగంలోని 15 నుండి 20 సెంటీమీటర్ల మట్టి తడిసి, ఆ తడిగానే ఉన్నప్పుడు మాత్రమే ఈ చర్యను చేపట్టాలని ఐఎండి తెలిపింది.

# వర్షాకాలంలో థర్మల్ కేంద్రాలకు సరిపడా బొగ్గు సరఫరా


### ఆటంకం లేకుండా ఓపెన్‌కాస్ట్ గనుల్లో ముందస్తు చర్యలు

### సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్



**హైదరాబాద్, జూన్ 19, ప్రభాతవార్త:** వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి కొంత ఆటంకం కలుగుతున్నప్పటికీ రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును అందిస్తామని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి స్పష్టం చేశారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో శుక్రవారం తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో ఛైర్మన్ డాక్టర్ హరీష్‌కు, డాక్టర్ బుద్ధప్రకాష్ మధ్య భేటీ జరిగింది. ఈ సందర్భంగా థర్మల్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై చర్చించారు. వర్షాకాలంలో యాదాద్రి సహా అన్ని థర్మల్ కేంద్రాల్లోనూ విద్యుత్ ఉత్పత్తి, అందుకు అవసరమైన బొగ్గుకు సంబంధించి ఇరువురు మధ్య చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉన్న బొగ్గు పరిమాణం, నిల్వల గురించి కూలంకషంగా చర్చించారు. విఘాతం కలగకుండా నాణ్యమైన బొగ్గును తగినంతగా సరఫరా చేసే సాధ్యాసాధ్యాలను గూర్చి ప్రస్తావించారు. దీనిపై డాక్టర్ బుద్ధప్రకాష్ స్పందిస్తూ సింగరేణి సంస్థ ఉత్పత్తి చేసే బొగ్గులో దాదాపు 93 శాతం బొగ్గు ఓపెన్ కాస్ట్ గనుల నుంచే వస్తుందన్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అయితే రాష్ట్ర విద్యుత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని థర్మల్ కేంద్రాలకు ఎటువంటి ఇబ్బంది, కొరత లేకుండా తగినంత బొగ్గు సరఫరా కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వర్ష ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే అన్ని ఓపెన్ కాస్ట్ గనులలో అనేక ముందస్తు చర్యలు చేపట్టామని వెల్లడించారు. సింగరేణి సంస్థ రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఏడాదికి దాదాపు 28 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేస్తోందన్నారు. రోజుకు 60 నుంచి 70 వేల టన్నుల బొగ్గును సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో బొగ్గు నాణ్యత విషయంలోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్ వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ తాడబోయిన శ్రీనివాస్, తెలంగాణ జెన్కో ఈడీ నగ్యా, డైరెక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ల కూటమి పాలనలో ఆత్మకూరుకు అగ్రస్థానం




**ఆత్మకూరు (నెల్లూరు), జూన్ 19 ప్రభాతవార్త:** రెండేళ్ళ ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ పాలనలో ఆత్మకూరును అభివృద్ధి, సంక్షేమంలో అగ్రస్థానంలో నిలిపామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో నియోజకవర్గ ప్రజల ఆనందోత్సాహాల మధ్య రాష్ట్రంలో ఎన్‌డిఎక ఊటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా 'నమ్మకం.. అభివృద్ధి.. సంక్షేమం' విజయోత్సవ సంబరాలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ రెండేళ్ళ పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను మంత్రి ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ళలో ఆత్మకూరు నియోజకవర్గానికి సంక్షేమ కార్యక్రమాలకు 3,467.17 కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు 3,084.53 కోట్లు వెచ్చించామని, మొత్తం 6,545.70 కోట్లతో రికార్డు స్థాయిలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. రైతుల హక్కులను కాపాడేందుకే గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామని, ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని చెప్పారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్, పించన్లు, ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 , తల్లికి వందనం వంటి పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు ప్రత్యక్ష లబ్ధి చేకూరిందన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేయడం తనకు మహా భాగ్యంగా భావిస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి దేవాదాయ శాఖకు సంబంధించి నిర్దేశించిన 11ప్రధాన వాగ్ధానాల్లో ఇప్పటికే 10 వాగ్ధానాలను అమలు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయలతో 800లకు పైగా పురాతన ఆలయాల పునర్నిర్మాణం చేపడుతూ భగవత్ సంకల్పంతో ఆలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, సోమశిల హైలెవల్ కెనాల్ పనులను పూర్తిచేసి మర్రిపాడు వరకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సోమశిల రిజర్వాయర్, సంగం బ్యారేజ్, ఎస్ఆర్ హైలెవల్ కెనాల్, కావలి కాలువ, కనిగిరి రిజర్వాయర్ వంటి కీలక ప్రాజెక్టుల పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు.

ఆత్మకూరు మెట్టప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. మర్రిపాడులో 300ఎకరాల విస్తీర్ణంలో 500కోట్ల పెట్టుబడితో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చిందని దీంతో స్థానిక యువతకు పెదనద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

ఎంఎస్ఎంఇ పార్క్, ఆటోనగర్ ఏర్పాటు ద్వారా పారిశ్రామిక వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ఆత్మకూరు పట్టణ అభివృద్ధిలో భాగంగా ఆటోనగర్, నగరవనం, క్రీడాప్రాంగణం వంటి ప్రాజెక్టులను మంజూరు చేశామని, మున్సిపాల్టీ పరిధిలో 75కోట్లతో మౌళిక వసతుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. నరగామీణాభివృద్ధికి పల్లె పండుగ కార్యక్రమాల కింద భారీ నిధులు కేటాయించి పనులు చేపడుతున్నామన్నారు.

గత రెండేళ్ళలో ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై రాష్ట్రాన్ని ముందడుకు తీసుకెళుతున్నామని మంత్రి పేర్కొన్నారు. రాబోయే మూడేళ్ళలో మరింత వేగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి ఆత్మకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టంచేశారు. తొలుత ఆర్‌డిఒ పావని, డిఎల్‌డిఒ రమణయ్యలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పలువురు సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమకు జరిగిన మంచిని వివరించారు. అనంతరం 28 మంది లబ్ధిదారులకు సుమారు 30లక్షలు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులనఉ మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మోడీతోనే మౌలిక సదుపాయాల పురోగతి



**తిరుపతి, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో 12యేళ్ళ ప్రగతి జాతీయభద్రత, మౌలిక సదుపాయాలు కల్పించబడ్డాయని బిజెపి నాయకులు తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం 12యేళ్ల ప్రగతి సాధించిన సందర్భంగా తిరుపతి ఆర్టీసి బస్టాండ్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. ప్రధానమంత్రి మోడీ దేశ పగ్గాలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా, దేశం సాధించిన అభివృద్ధి, సంక్షేమం, జాతీయ భద్రత, మౌలిక సదుపాయాల పురోగతిని ప్రజలకు వివరించే ప్రగతి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడంతో సంక్షేమ పథకాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పృథ్వీరెడ్డి, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండల గోపీనాథ్‌రెడ్డి, బిజెపి జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఎస్ మస్తాన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాహుల్ నాయకత్వంలో దేశ ప్రగతి సాధ్యం

- అలిపిరిలో కొబ్బరికాయలు కొట్టిన కాంగ్రెస్ నేతలు



**తిరుపతి, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతిపక్ష యువ నేత రాహుల్ గాంధీ నాయకత్వంలోని దేశ ప్రగతి, సుస్థిరిత సాధ్యమని కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు అన్నారు. శుక్రవారం రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని అలిపిరి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి తమ నేత రాహుల్ గాంధీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రజా సమస్యలపై అధికార పార్టీని నిలదీసే శక్తి సామర్థ్యాలు కలగజేయాలని ప్రార్థిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. 2029లో ప్రజాభిమానంతో భారతదేశ ప్రధానిగా రాహుల్ దేశ పగ్గాలు చేపడతారని విశ్వాసం వెలిబుచ్చుతూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పిసిసి ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శులు కంభంపాటి మురళీకృష్ణ, సుప్రజ, పార్టీ సీనియర్ నాయకుడు చిత్తూరు శివశంకర్ రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముసీనా బేగం, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు ఆమూరి కృష్ణమూర్తి, పాల మండల శివకుమార్, కార్యదర్శులు తవన్ కుమార్, మోహన్, ఉపాధ్యక్షుడు గొడుగుచింత గోపి, కార్యవర్గ సభ్యుడు వాసు తదితరులు పాల్గొన్నారు.

## పల్లెకాపులకు త్వరలో పట్టాలు పంపిణీ




**ముత్తుకూరు (నెల్లూరు), జూన్ 19 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు మండలంలో వున్న పిడతా పోలూరులో గత 70 సంవత్సరాల నుంచి పంటలు సాగు చేసుకుంటున్న పల్లెకాపులకు త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హామీ ఇచ్చారు. శుక్రవారం నెల్లూరు జిల్లాలో వినూత్నంగా ప్రారంభించిన పల్లె వీక్షణం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ముత్తుకూరు మండలం పిడతా పోలూరు గ్రామంలో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘం ద్వారా సహజ ఎరువులను తయారు చేస్తున్న కళ్యాణికి ప్రభుత్వం తరఫునుంచి ఆర్థిక సహాయం చేయనున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. పిడతా పోలూరులోని కొన్ని కాలనీలలో లో విద్యుత్తును అధిగమించి రానున్న రెండు నెలలలో సరైన విద్యుత్తును అందించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం స్థానిక సచివాలయం వద్ద ప్రజల నుండి అర్జులను స్వీకరించారు. అధికారులు గ్రామంలో గుర్తించిన పలు సమస్యల గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ పలువురు గ్రామస్తులు తెలిపిన గ్రామ సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం పలువురు లబ్ధిదారులయిన పెంచలమ్మ, శీనయ్య తదితరులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. వెంకటమ్మకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ను అందజేశారు. తొలుత సచివాలయం వద్ద డిఆర్డిఏ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్‌ని తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. స్వయ సహాయక గ్రూపు సంఘాలకు 4 లక్షల చెక్కు అందజేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పిఎండిఎస్ విత్తనాలను అందజేశారు. అనిమల్ హస్బెండ్రీ శాఖ ద్వారా ఫీడర్ కిట్లను లబ్బిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి నాగ అనూష, డిఆర్‌డిఎపిడి నాగరాజ కుమారి, ఐటీడీఏ పీవో శ్రీనివాసరావు, జిల్లా వైద్యశాఖ అధికారి సుజాత, వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ రాఘవేంద్ర, డీఈవో బాలాజీ రావు, వివిధ శాఖల అధికారులు, మండల రెవెన్యూ అధికారి స్వప్న, మండల పరిషత్ అధికారి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల దుర్మార్గాలపై పోరాటం ఆపం

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

**విజయవాడ, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన విజయవాడ సాయికృష్ణ మిస్సింగ్ వ్యవహారం, అలాగే క్రాంతికుమార్ అనుమానాస్పద మృతి కేసులపై సిబిఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని వైసిపి సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సాగుతున్న పోలీసుల దుర్మార్గాలపై తమ పోరాటం ఆగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సాయికృష్ణ ఇంటికి వైసీపీ అధినేత జగన్ వెళ్లి పరామర్శించే వరకు ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ఆయన నిలదీశారు. గత నెల 28వ తేదీనే అడ్వకేట్ కనకదుర్గ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. అయినా సరే బాధ్యులైన పోలీసులపై ఎందుకు కేసు నమోదు చేయలేదు? జగన్ ఆ కుటుంబానికి అండగా నిలబడేందుకు వెళ్తే తప్ప సీఐ మీద కేసు నమోదు చేయరా? అంటే రాష్ట్రంలో లాకప్ డెత్ జరిగిందని ప్రభుత్వం పరోక్షంగా అంగీకరించినట్లే కదా" అని ప్రశ్నించారు. సాయికృష్ణ పిన్ని కనకదుర్గ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన తర్వాతే అసలు కథ ప్రారంభమైందని, కేవలం సిఐ నాగరాజును సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని మండిపడ్డారు. పేరిపోగు క్రాంతికుమార్ కూడా సదరు సిఐ పెట్టిన థర్డ్ డిగ్రీ టార్చర్ భరించలేకే ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ రెండు మరణాల వెనుక సీఐతో పాటు ఇంకా చాలా మంది ఉన్నతాధికారుల హస్తం ఉందని, వారందరినీ ఈ కేసులో నిందితులుగా చేర్చాలని అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.

సాయికృష్ణ మృతదేహానికి సంబంధిం చిన ఫొటోలు, కాళ్లపై ఉన్న గాయాల దృశ్యాలు ఫేక్ అంటూ జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేస్తున్న ప్రచారాన్ని అంబటి రాంబాబు తీవ్రంగా తప్పుపట్టారు. "అవి ఫేక్ ఫొటోలు అయితే సాయికృష్ణను బతికుండగా చూపిం చండి. ఒకవేళ నేను చూపించిన ఆధారాలు తప్పు అయితే నాపై లీగల్‌గా కేసు పెట్టుకోండి. సాయికృష్ణ కేసులో తెరవెనుక ఉన్న పాత్రధారులంతా బయటకు రావాలని, అలాగే దళిత యువకుడు క్రాంతికుమార్ కుటుంబానికి కూడా ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.

## తిరుమల సమాచారం



### శ్రీవారి సేవలో హైకోర్టు జడ్జి గోపాలకృష్ణారావు

**తిరుమల, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు కుటుంబంతో శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.



### కర్ణాటక అభివృద్ధికి శ్రీవారి ఆశీస్సులు కోరా

**తిరుమల, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్ణాటక రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కలియుగ ప్రత్యక్షదైవం ఏడు కొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు కోరానని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డికె శివకుమార్ తెలిపారు. అందరికీ శుభాలు కలగాలని, స్వామివారి కటాక్షాలతో కర్ణాటక సస్య శ్యామలం కావాలని వేడుకున్నారు. కర్ణాటక సిఎం హోదాలో డికె శివకుమార్ శుక్రవారం వేకువజామున కుటుంబంతో కలసి ఆలయం వద్దకు చేరుకున్నారు. వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ మీదుగా ఆలయ మహాద్వారం వద్దకు రాగానే టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సివిఎస్ఒ మురళీకృష్ణ, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. అనంతరం ఆనందనిలయంలో శ్రీవారి అభిషేకసేవలో పాల్గొన్నారు. ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు రేణిగుంట విమానాశ్రయంలో శివకుమార్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

## 'తిరుమల విజన్ -2047' ప్రణాళికాబద్ధంగా అభివృద్ధిపై దృష్టి



**తిరుమల, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమలను "మోడల్ టౌన్"గా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి, పర్యావరణ నిర్వహణ, వారసత్వ పరిరక్షణపై దృష్టి సారించేందుకు "తిరుమల విజన్ -2047"టిటిడి అమలుచేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో "స్వర్ణాంధ్ర విజన్-2047"కి అనుగుణంగా పుణ్యక్షేత్రం తిరుమలను అన్ని విధాలా మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తీర్చిదిద్దేందుకు వ్యూహాత్మక ప్రణాళికలు అమలుచేయనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లావాసి, తిరుపతికి దగ్గరగా ఉన్న చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లికి చెందిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిన్నప్పటినుండే ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పట్ల భక్తివిశ్వాసాలు కలిగి ఉన్నాడు. అదే విశ్వాసంతో దేవుని దర్శనం కోసం వచ్చే భక్తులకు మరింత ఆధ్యాత్మిక భావన కలిగించేలా తిరుమలను తీర్చిదిద్దాలనే సంకల్పం బలంగా ఉంది. ఇప్పటికే కొండపై గోవిందనామ స్మరణ తప్ప మరొకటి వినిపించకూడదని ఆదేశాలిచ్చారు. అంతేగాక రాజకీయ నాయకులకు ప్రత్యేక ప్రోటోకాల్, హంగు ఆర్భాటం ఉండకూడదని, తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు చేయరాదని ఇప్పటికే స్పష్టంగా తెలిపారు. తిరుమల అభివృద్ధిలో సాంప్రదాయాన్ని, ఆధునికతతో సమతుల్యం చేసుకోవాల్సిన అవసరాన్ని చంద్రబాబు తెలియజేశారు. తిరుమల ఆధ్యాత్మికం, పవిత్రత, సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించి ముందు చూపుతో భక్తులకు సౌకర్యాలు, వసతి, దర్శనాలను మెరుగుపరిచారు.

**విజన్‌డాక్యుమెంట్ -2047 లక్ష్యాలు:** ఆధునిక పట్టణ ప్రణాళిక నిబంధనలను అనుసరించి తిరుమల పవిత్రతను పెంపొందించేందుకు శాశ్వతమైన వ్యూహాలను అమలుచేయడం, ఉత్తమమైన ప్రణాళిక లు, వారసత్వ పరిరక్షణ, పర్యావరణ బాధ్యతలకు ప్రాధాన్యతనివ్వడం, ప్రపంచ వ్యాప్తంగా తిరుమలను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు టిటిడి ప్రయత్నిస్తోంది.

**ప్రణాళిక లక్ష్యాలు:** తిరుమల విజన్ -2047 ప్రణాళిక లక్ష్యాలను మోడల్ టౌన్‌తో మిళితం చేసి ఒక బృహత్తరమైనభవిష్య ప్రణాళికలను రూపొందించడం, తిరుమలలో రాబోవు తరాల్లో మరింత ఆధ్యాత్మిక, సాంస్కృతిక పవిత్రతను కాపాడటమే ప్రణాళిక లక్ష్యంగా నిర్దేశించారు.

ఇప్పటికే తిరుమల పట్టణ ప్రణాళికపై ప్రత్యేక దృష్టి పెట్టిన టిటిడి విజన్ డాక్యుమెంట్ అవసరాన్ని గుర్తించింది. టిటిడిలో ప్రత్యేకంగా అర్బన్ డెవలప్‌మెంట్ టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. తిరుమలలో నిర్మితమవుతున్న భవనాలను టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం నిర్మించేలా చూస్తున్నారు. తిరుమల అభివృద్ధిపై దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధంచేయడంలో భాగంగా ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని జోనల్ అభివృద్ధి ప్రణాళికను సవరించడం, తిరుమలలో పవిత్రతను కాపాడుతూ భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడానికి వ్యూహాలను రూపొందిస్తున్నారు. వివరణ్మాతక నివేదికలు (డిపిఆర్‌లు), ప్రాముఖ్యత కలిగిన మౌళిక సదుపాయాలపై కార్యాచరణ ప్రణాళికలను తయారుచేయడం జరుగుతోంది.

## పద్మావతి అమ్మ తెప్పోత్సవాలకు ఏర్పాట్లు



**తిరుమల, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుచానూరు పద్మావతి అమ్మవారి తెప్పోత్స వాలు ఈనెల 25 నుండి 29 వరకు వైభవం గా నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్‌తో కలసి జెఇఒ డాక్టర్ శరత్ పరిశీలించారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తెప్పోత్సవాల్లో వినియోగించే తెప్పల ఫిట్‌నెస్‌ను పూర్తిగా పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహించాలని సూచించారు. అలాగే విద్యుద్దీపాల కాంతుల తో, పుష్పాల అలంకరణలతో తెప్పలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని అధికారు లను ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమా చార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీత కచేరీలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు, కోలా టాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు జెఇఒ డాక్టర్ శరత్ తెలిపారు. ఈ కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మికానందాన్ని పంచనున్నాయని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని పద్మావతి అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన భక్తులను కోరారు.

## తోతాపురికి రూ.18 చెల్లిస్తేనే రైతుకు గిట్టుబాటు!

**తిరుపతి, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** తోతాపురి మామిడికి రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం లాగే 4 రూపాయలు ప్రోత్సాహకంగా అందజేయడం హర్షదాయకమేనని, ప్రస్తుత పరిస్థితుల్లో రైతన్న ఆదుకునేందుకు ప్రోత్సాహకాన్ని ఆరు రూపాయలకు పెంచాలని ఎపి రైతు సంఘం, మామిడి రైతు సంఘం డిమాండ్ చేశాయి. శుక్రవారం తిరుపతి రైతు సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. రామానాయుడు, మామిడి రైతు సంఘం నాయకుడు డా. టి.జనార్ధన్, తిరుపతి రైతు సంఘం అధ్యక్షుడు జి.మునిరత్నం మాట్లాడుతూ ఈ సంవత్సరం తోతాపురికి 18 రూపాయలు చెల్లిస్తే తప్ప రైతుకు గిట్టుబాటు కాదని పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 40 వేల మంది మామిడి రైతుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం జిల్లా యంత్రాంగం మద్దతు ధర కల్పించి అమలు జేసే విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, రైతుసంఘం చిత్తూరు నేత శివారెడ్డి, తిరుపతి ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీయిజాన్ని అరికట్టాం

- విజయోత్సవ సభలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి, జూన్ 19 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రౌడీయిజాన్ని అరికట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని శాసన సభ్యుడు బొజ్జల సుదీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఓ కళ్యాణ మండపంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ళ విజయోత్సవ సభను పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు సారథ్యంలో ఏర్పాటు చేసారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా జిల్లా పార్టీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మీ, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్‌కుమార్, జనసేన ప్రతినిధి శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, శ్రీకాళహస్తిలో రెండేళ్ళలో చేపట్టిన అభివృద్ధి, సంస్కరణలకు సంబంధించి వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు శాంతిభద్రతలు అందించాలని కంకణం కట్టుకున్నామన్నారు. ఇది పేదల ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుంది. రెండేళ్ళలో రాష్ట్ర రూపురేఖలు మార్చటానికి ప్రణాళికా బద్ధంగా పనిచేసాం. మరో మూడేళ్ళలో శ్రీకాళహస్తి రూపురేఖలు మారిపోతాయని వివరించారు. కూటమిలోని బిజెపి, జనసేన కలసి పనిచేస్తూ పుణ్యక్షేత్రం పేరు ప్రతిష్టలు ఇనుమడింపజేయుటకు కృషి చేస్తామన్నారు. ఈ విజయ సాధనలో తమ పార్టీల కార్యకర్తల సహకారం ఉందన్నారు.

## యోగాంధ్ర సాధనే లక్ష్యం



**శ్రీకాళహస్తి, జూన్ 19 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం, మున్సిపాలిటి సంయుక్తంగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాలు శుక్రవారం పట్టణ ప్రజలను ఆకర్షించింది. రెండు శాఖలు ఈ నెల 21 వరకు యోగా సాధన కార్యక్రమాలను తమ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నారు. శుక్రవారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యే కార్యక్రమాలను రాజగోపురం సమీపంలో ఏర్పాటు చేసారు. మున్సిపల్ కమిషనర్ కెవి కృష్ణారెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం ఇఒ బికె వవెంకటేశు సారథ్యంలో ఏర్పాటు చేసారు. యోగ సాధకులు భారీ ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్ మున్సిపల్ దేవస్థానం సిబ్బంది, మెప్మా ప్రతినిధులు సుమారు 300కు పైగా పాల్గొన్నారు.

## మళ్లీ గందరగోళమే!



## సర్వదర్శన టైమ్‌స్లాట్ జారీలో తికమక

**తిరుమల, జూన్ 19 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న సామాన్యభక్తులకు మరింత త్వరగా సమయం ప్రకారం దర్శనం చేయించేందుకు టిటిడి ఆఫ్‌లైన్‌లో జారీ చేసే టైమ్‌స్లాట్ టోకెన్లలో మళ్లీ గందరగోళం నెలకొంది. గత మేనెల 1వ తేదీ నుండి జూన్ 15వరకు వేసవి సెలవులు కొనసాగడం, విపరీతంగా సామాన్యభక్తులు తిరుమలకు తరలిరావడంతో సామాన్యభక్తుల దర్శనాలకే టిటిడి ప్రాధాన్యతనిచ్చింది. ఈ నేపథ్యంలో సిఫార్సులేఖలు కూడా నిలుపుదలచేసిన విషయం విదితమే. వేసవిసెలవుల విపరీత రద్దీతో ప్రతిరోజూ అర్ధగంట దాటిన తరువాత తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో ఎస్ఎస్‌డి టైమ్‌స్లాట్ టోకెన్లు జారీ చేసేవారు.

అయితే వేసవిసెలవులు ముగియడంతో భక్తుల రద్దీ కొనసాగుతున్నా పలువురు భక్తులు ఏ సమయంలో టోకెన్లు ఇస్తారో తెలియక తికమకపడుతున్నారు. కొందరు ఉదయం టోకెన్లు జారీచేసే తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్దకు చేరుకుని పడిగాపులు కాసే పరిస్థితి నెలకొంది. అంతేగాక రాత్రివేళ మరీ టోకెన్ల కోసం మధ్యాహ్నం 2గంటల నుండే బారులు తీరడం జరిగింది. దీంతో టిటిడి అధికారులు ఈ గందరగోళం పరిస్థితులు లేకుండా సాఫీగా దర్శనాల టోకెన్లు జారీకి చర్యలు తీసుకున్నారు. ఇదివరకు లాగా గాక శుక్రవారం నుండి ఆ మూడు ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళ గాక పాత విధానంలో మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల మధ్య టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తున్నారు. వారంలో నాలుగురోజులు 8వేల టోకెన్లు, వారాంతంలో 10వేల టోకెన్లు వరకు జారీచేస్తుంటారు.

ఈటోకన్లు ఇవ్వడం ప్రారంభించడంతో గందరగోళంతో తెలియక భక్తులు అధికశాతం సాయంత్రం కౌంటర్ల వద్దకు రావడం జరిగింది. ఈ విషయాన్ని టిటిడి ముందుగా ప్రకటించక పోవడంతో భక్తులు అసహనం చెందారు.

ఫ్యాషన్ ఫ్యాషన్

# బొమ్మలతో బడికి ఖుషీ.. ఖుషీ !
















పిల్లలంటేనే బొమ్మలంటే చెవి కోసుకుంటారు. అవిచేతి కందితే వదలనే వదలరు వాటిని అక్కడే వదిలి వెళ్లాలన్నా వారికి మనస్కరించదు. ఒకవేళ బొమ్మలున్న బ్యాగ్ దొరికిందంటే వాటిని భుజన వేసుకుని స్కూలు కెళ్లొచ్చేస్తారు. కుక్కపిల్ల, సింహం, డైనోసార్ బొమ్మలకు నచ్చిన పేరు పెట్టుకుని పిల్లలు వాటితో ఆడుకుంటుంటారు.తీరా ప్లే స్కూల్‌కు బయలుదేరేటప్పుడు ఆ బొమ్మను వదల్లేరు. తమతోపాటు బడికి తీసుకెళ్లాలని మొండికేస్తారు. అలాంటివారి కోసమే ఈ యూనిమల్ విండో బ్యాక్ ప్యాక్. దీనికి ఓ వైపు స్ట్రాప్స్, రెండోవైపు మూడు నాలుగు బొమ్మలుంచేలా చిన్నన గదుల్లాంటి రంధ్రాలుంటాయి. నచ్చిన బొమ్మలను వీటిలో ఉంచితే చాలు. అవి కూడా తమతోనే ఉన్నాయనే భావన పిల్లల్లో ఉంటుంది. అలాగే ఆకాశం, నక్షత్రాలు, రాకెట్, అంతరిక్షం, వ్యోమగామిలాంటి డిజైన్లతో బ్యాక్‌ప్యాక్‌లొస్తున్నాయి. పిల్లల్లో ఉత్సాహాన్ని నింపడమే కాదు. ఇవి సృజనాత్మకతనూ పెంచుతాయి.

## అన్నీ అందులోనే ...

ఈ బ్యాక్ ప్యాక్‌కు చిన్నారులకు నచ్చే కుందేలు, కుక్కపిల్ల వంటి బొమ్మలను స్ట్రాప్‌తో అటాచ్ చేసే సౌకర్యం ఉంటుంది. దీంతోపాటు నీలి ఆకాశం, నక్షత్రాలు, ఇల్లు, తోట అంటూ పలురకాల ఊలు బొమ్మలూ బ్యాగుకు అతికించి ఉంటాయి. అలాగే డెనిమ్, శాటిన్ క్లాత్స్‌తో తయారవుతున్న కొన్ని బ్యాగులకు ఒవైపు బొమ్మను ఫిక్స్ చేయొచ్చు. దీనికోసం బెల్ట్‌లా స్ట్రాప్స్‌తో లేదా అరలాంటిది అటాచ్డ్‌గా ఉంటుంది. ఇందులో నచ్చిన బొమ్మను స్టఫ్ చేస్తే కదలకుండా కూర్చుంటుంది. ఉత్సాహంగా పరుగులు పెట్టి చటుక్కున కనిపించని పిల్లలను కనుసన్నల్లో ఉండేలా చేసే బ్యాగులు ఇప్పుడొస్తున్నాయి. చిన్నారి తగిలించుకున్న ఈ బ్యాగుకు 2వెనకవైపు అటాచ్డ్‌గా ఓ బెల్ట్ లేదా వైర్ ఉంటుంది. దీని రెండోకొనను పెద్దవాళ్లు తమ చేతికి తొడుక్కుంటే సరిపోతుంది. □

# ఇంట్లోనే 'బారామాసి' మధుర ఫల నివాసం !



**సీజన్ ఏదైనా, కాలం ఏదైనా మీ ఇంటికొచ్చే అతిథి, అభ్యాగతులకు, మధుర ఫలాలు తినిపించాలనుకుంటున్నారా? అయితే ఏడాది పొడవునా కాపుకాసే మామిడి రకాలపై దృష్టి ఉంచండి. పెంచడమ తెలికే సంరక్షణా మీదే.**

ప్రస్తుతం నాటిన ఏడాదికే కాపు మొదలై ఏడాది పొడవునా మామిడి ఫలాలను అందిస్తూ కాపుకాసే 'బారామాసి' మామిడి రకాలను పెంచేందుకు ఎంతో మంది మొగ్గు చూపుతున్నారు. బాల్కనీలు, డాబాలపై చిన్న కుండీల్లో సైతం ఇవి సులభంగా పెరుగుతూ, ఏడాది పొడవునా ఫలసాయాన్ని ఇస్తుండటంతో వీటికి ఆదరణ విశేషంగా పెరుగుతోంది. ఎక్కడో తోటల్లో పండే మధుర ఫలం ఇప్పుడు మన ఇంట్లో మన పెరట్లోనే పండుతుంది. సాధారణ బంగినపల్లి వంటి మామిడి ఫలాలకు తోటలే మంచి వాతావరణాన్నిస్తాయి. కానీ అతిఖరీదైన 'బారామాసి' అనే నిరం తరం కాపు కాసే మామిడి రకం మన ఇంట్లోనే పెంచుకునేందుకు వీలైనదిగా బాహ్య ప్రపంచానికి అందుబాటులోకి వచ్చింది. 'బారామాసి' అంటే హిందీలో పన్నెండు నెలలు అని అర్థం. ఏడాదిలో పలుమార్లు పూత పూసి కాయలు కాస్తాయి. ముఖ్యంగా అంటుకట్టిన హైబ్రిడ్ మొక్కలు పొట్టిగా ఉండి, కుండీల్లో పెంచడానికి అనువుగా ఉంటాయి. సాంప్రదాయ మామిడి రకాలు నాటిన తర్వాత ఫలసాయం ఇవ్వడానికి సుమారు 4 నుండి 5 ఏళ్ల సమయం పడితే, ఈ బారామాసి రకాలు కేవలం 9 నుండి 12 నెలల్లోనే పంటను చేతికి అందిస్తాయి. ప్రస్తుతం కాటిమెన్ (థాయ్‌లాండ్ రకం), ఎరుపు రంగుతో ఆకట్టుకునే హాంగ్ సియాంగ్ (రెడ్ డ్రాగన్), చీడపీడలను సమర్థవంతంగా తట్టుకునే దేశీయ రకమైన 'సదాబహార్' వంటివి విశేష ప్రాచుర్యం పొందాయి. ఈ మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి నీరు నిల్వ ఉండని సారవంతమైన మట్టి, ప్రతిరోజూ కనీసం 6 నుంచి 8 గంటల పాటు ప్రత్యక్ష సూర్యరశ్మి, తీవ్రమైన చలి నుంచి రక్షణ అవసరం. 20 డిగ్రీల నుంచి 38 డిగ్రీల మధ్య ఉండే ఉష్ణోగ్రతలు వీటికి అత్యంత అనుకూలం. ఈ 'బారామాసి' పండ్లు కమ్మని తీపి, స్వల్పమైన పులుపు కలయికతో ఎంతో రుచికరంగా ఉంటాయి. పీచు లేకుండా, ఆకర్షణీయమైన బంగారు పసుపు రంగు గుజ్జుతో ఉండే ఈ పండ్లు వినియోగదారులు బాగా ఇష్టపడుతున్నారు. తమ బాల్కనీలు, మిద్దె తోటల్లోనే మధుర రసాలు పెంచుకోగలగడం మహత్తర అవకాశం! □

# కూరగాయలు పాడవకుండా !



అప్పటికప్పుడు తాజాగా కూరగాయల్ని కోసుకొచ్చి వండే రోజులు కావివి. కనీసం మార్కెట్ నుంచి కూడా ఏ రోజుకారోజు తెచ్చుకోలేం. అందుకే, వారానికోసారి మార్కెట్ నుంచి కొనుక్కురావడం, ఒక రోజు ముందే కట్ చేసుకుని బాక్సుల్లో సర్దుకోవడం వంటి పనులు ఇప్పుడు అందరి జీవితాల్లోనూ ఓ భాగం అయిపోయాయి. ఇంతవరకూ బాగానే ఉన్నా భద్రపరచడమే ఓ పెద్ద సవాల్. వీటిని ముక్కల్లా కత్తిరించి స్టోర్ చేసినా, నేరుగా కూరగాయల్ని ఫ్రిజ్‌లో పెట్టాలనుకున్నా తేమ లేకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. లేదంటే వాటిల్లో నీరూరి పాడయిపోతుంటాయి. మీకూ ఇలాంటి అనుభవముందా అయితే ఈ సారి ఇందుకోసం డ్రెయిన్ స్టోరేజ్ బాక్సుల్ని ఎంచుకోండి. రకరకాల పరిమాణాల్లో దొరుకుతున్నాయి. ఈ బాక్సుల్లో ఉండే జాలీ నుంచి నీళ్లు అడుగుకి చేరడం వల్ల కూరగాయలూ, పండ్లూ ఏ మాత్రం పాడవ్వవు. □

# అసలైన భక్తి

ధర్మనిష్ఠ, దానధర్మాలు, అతిథి సత్కారాలకు పెట్టింది పేరుగా జీవించేవాడో భక్తుడు. ఓ రోజు రాత్రి కుటుంబసభ్యులు, పనివారు కూడా నిద్రపోయాక తలుపు చప్పుడైంది. అతడెళ్లి తలుపు తీస్తే ఓ వృద్ధుడు- అన్నం తిని వారమైంది అన్నాడు దీనంగా. హృదయం ద్రవించి, అయ్యా! భగవంతుడి తరఫున నా ఆతిథ్యం స్వీకరించి, అనుగ్రహించు అన్నాడు. వృద్ధుడు భిక్ష ఆరగించి 'అన్నం పెట్టిన మీకు కృతజ్ఞతలు. కానీ భగవంతుడి ప్రస్తావన ఎందుకు మధ్యలో? ఆయనపై నాకు నమ్మకం లేదు అన్నాడు. అది విని భక్తుడు నిశ్చేష్టుడయ్యాడు. పరమాత్మ ఉనికిని ప్రశ్నిస్తాడేంటని బాధపడ్డాడు. వృద్ధుడు అంతటితో ఆగకుండా కనిపిం చని ఆ దేవుణ్ణి నమ్మడం వృథా! అంటూ ఎద్దేవా చేశాడు. దాంతో భక్తుడు ఆగ్రహించి..అతడి ముందున్న పళ్లెం లాక్కుని బయటకు గెంటేశాడు. ఆ రాత్రి కలలో దైవం కనిపించి ఆకలి తీరకుండానే ఆ వృద్ధుణ్ణి గెంటేశావేం నాయనా? అన్నాడు. అది విన్న పరమాత్మ 'నాయనా! ఏళ్ల తరబడి అతను నా ఉనికిని సందేహిస్తూ, నిందిస్తున్నా.. భరిస్తూనే ఉన్నాను. అతడి అవసరాలు తీరుస్తూనే ఉన్నాను. నాస్తికుల్నీ ఆదరించే స్వామి అవ్యాజ ప్రేమ ఆ భక్తుణ్ణి ముగ్ధుణ్ణి చేసింది. □

ఆరోగ్య భాగ్యం

# రుమాటిక్ ఫీవర్

**ఇది దేహ రక్షణ వ్యవస్థకు** సంక్రమించే అనారోగ్యాలలో అతి ముఖ్యమైనదీ. దీన్నే కీళ్లవాత జ్వరం, ఆటోఇమ్యూన్‌డిసీజ్ అని అంటారు. ఇది శరీరంలో కనెక్టివ్ కణజాలం వున్న కీళ్ళు, చర్మం, గుండె, రక్తనాళాలు, నర్వస్ సిస్టమ్, మెదడును ఎఫెక్ట్ చేసే కాంప్లెక్స్ డిసీజ్. దీన్ని 5వ శతాబ్దంలో హిపోక్రాటిస్ గుర్తించడమైనది. ఇది 5-15 సంవత్సరాల పిల్లల్లో కన్పించే కీళ్ళవాత జ్వరం. ప్రతి సంవత్సరం 325,000 మంది పిల్లల్లో సంభవిస్తుంది. ప్రస్తుతం 33.4 మిలియన్ మందికి రుమాటిక్ గుండె జబ్బులున్నాయి. స్ట్రెప్టోకాకస్ గ్రూప్‌కి చెందిన బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ (జిఎఎస్) వల్ల పిల్లల్లో స్ట్రెప్ త్రోట్ (గొంతు నొప్పి), స్కార్లెట్ ఫీవర్, ఇంపెటెగో, సెల్యులైటిస్ వంటి చర్మవ్యాధులు వస్తాయి. దీన్నే స్ట్రెప్ బాక్టీరియా అంటారు. గొంతులో, చర్మంలో వచ్చే స్ట్రెప్టోకాకస్ బాక్టీరియా ఇన్ఫెక్షన్‌కు సరిగా చికిత్స చేయక పోవడం వల్ల, అసలు చికిత్స చేయించుకోక పోవడం వల్ల పిల్లలకి దాపురించే ఉపనరదవ వ్యాధే రుమాటిక్ ఫీవర్. ఇది 1% బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల వచ్చే కాంప్లికేషన్. ఇది స్ట్రెప్ బాక్టీరియా ఆటో ఇమ్యూన్ రియాక్షన్ ఇది ఒక వ్యక్తి యొక్క రోగ నిరోధక ప్రతిస్పందన కారణంగా ఉంటుంది. ఇది పెద్దవారిలోరాదు. ఇది అంటూ వ్యాధి కాదు.కాని స్కార్లెట్ ఫీవర్ గొంతునొప్పి అంటు వ్యాధులు ఇవి దగ్గడం, తుమ్మడం వల్ల, శ్వాస ద్వారా, రోగికి సన్నిహితంగా ఉన్నప్పుడు వస్తుంది.

**వ్యాధి లక్షణాలు :** ఇన్ఫెక్షన్ సోకిన 1-5 వారాల తర్వాత వ్యాది లక్షణాలు కన్పిస్తాయి. 100-163 ఎఫ్ వరకు ఉన్నట్టుండి జ్వరం వస్తుంది. మోకాళ్ళు, మడమలు, మోచేయి, మణికట్టు వంటి పెద్ద కీళ్ళు ఎర్రగా వాచి, ముట్టుకున్న నొప్పిగా, వెచ్చగా ఉంటాయి. ఏ పాటి తాకిడి కూడా భరించలేరు. ఒక కీలు వాచి, దాని వాపు తగ్గిపోయి రెండవ కీలులో బాధ మొదలవుతుంది. దీన్నే ఫ్లిట్టింగ్ ఆర్థ్రయిటిస్ అంటారు. దద్దుర్లు, నిస్సత్తువ, అలసట, ముక్కు నుండి రక్తం కావడం, మోకాలు, మోచేతులు, వెన్నముక ప్రాంతంలోని చర్మం క్రింద చిన్న చిన్న నొప్పి లేనట్టి బుడిపెలుంటాయి. తలనొప్పి, ఎర్రగా ఉబ్బి నట్లుండే టాన్సిల్స్ వాపు ఉంటుంది. అషిలిపై ఎర్రటి రాష్ ఉంటుంది. మెడలోని లింఫ్ గ్రంధుల వాపు, వికారం, కడుపునొప్పి, వాంతులు, ఆకలి లేక పోవడం, బరువు తగ్గడం, కాళ్ళు, ముఖంలో అసంకల్పిత కదలికలు, జర్క్స్ ఉంటాయి. దీన్నే స్వీడన్‌హోమ్ కొరియా అని అంటారు. కొంత మందిలో ఉన్నట్టుండి నవ్వడం, ఏడ్వడం వంటి బిహేవియర్ ప్రాబ్లమ్స్ ఉంటాయి. ఈ లక్షణాలు ఎకునకవగా అక్యూట్ రూమాటిక్ ఫీవర్‌లో ఉంటాయి. ఛీతీలో నొప్పి, పడుకున్న శ్వాస తీసుకోలేకపోవడం, అబ్‌నార్మల్ హార్ట్ బీట్స్, అబ్‌నార్మల్ రిథమ్స్, గుండె దడ, మర్‌మర్స్, గుండె కవాటలోపాలుంటాయి. రుమాటిక్ గుండె జబ్బులు. రుమాటిక్ ఫీవర్ ఒకసారి కాని , కంటిన్యూగాక 5-10 సంవత్సరాలు వచ్చినపుడు గుండె, రక్తనాళాలు దెబ్బతినడం 25-40 సంవత్సరాలున్న పెద్ద వారిలో కన్పించడం వల్ల దీన్ని రూమాటిక్ హార్ట్ డిసీజ్ అని అంటారు. □



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# తెర

# #NN5 హ్యూమరస్ క్రియేటివ్ పోస్టర్ ద్వారా అనౌన్స్‌మెంట్



రైజింగ్ యంగ్ స్టార్ నార్నే నితిన్ 'మ్యాడ్', 'ఆయ్', 'మ్యాడ్ స్క్వేర్' వంటి వరుస విజయాల తర్వాత తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు. 'జూనియర్' చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన రాధా కృష్ణతో సరికొత్త రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ కోసం జతకట్టారు. వివి5 చిత్రాన్ని ప్రతిష్టాత్మక కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. నార్నే నితిన్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ వినూత్నంగా ఆకట్టుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్ పోస్టు తరహాలో డిజైన్ చేసిన ఈ పోస్టర్ యూత్‌ఫుల్ రొమాంటిక్ వైబ్‌ను అందిస్తోంది. నీలాకాశం నేపథ్యంగా ఓ భవనం అంచున టీషర్ట్, జీన్స్, స్నీకర్స్‌లో కూల్‌గా కూర్చున్న నార్నే నితిన్ కనిపిస్తుండగా, ఎరుపు రంగు డ్రెస్‌లో ఉన్న ఓ యువతి పోస్టులోని హార్ట్ ఐకాన్‌ను ట్యాప్ చేయబోతున్నట్లు చూపించారు."ఆకాశంలో ఉంటుంది మూన్... నువ్వే నా లైఫ్‌కి క్వీన్..." అనే ఫన్నీ లైన్‌తో పాటు వేలాది లైక్స్, కామెంట్స్, ట్రెండీ హ్యాష్‌ట్యాగ్స్ పోస్టర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతేకాకుండా నార్నే నితిన్ బావ, యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఈ పోస్టును లైక్ చేసినట్లు చూపించడం అభిమానులను మరింత ఆకట్టుకుంటోంది. ప్రేమ, హాస్యం, భావోద్వేగాల సమ్మేళనంగా రూపొందనున్న ఈ చిత్రం ప్రేక్షకులకు పూర్తి స్థాయి వినోదాన్ని అందించబోతోంది. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, నిరంజన్ దేవరమానే ఎడిటింగ్ నిర్వహిస్తున్నారు. శివ కామేశ్ డి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. శరణ్య పొట్ల, అజయ్ గద్దె ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తున్నారు.

# 400 కోట్ల క్లబ్‌లో చేరిన 'పెద్ది'



'పెద్ది'లో నేటి నుంచి 5 నిమిషాల 56 సెకన్ల కొత్త సన్నివేశాలు జోడింపు 400 కోట్ల క్లబ్ లో చేరిన పెద్ది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది ప్రపంచవ్యాప్తంగా 400 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి విజయవంతంగా రన్ అవుతోంది. రెండు వారాలుగా థియేటర్లలో ప్రభంజనం సృష్టిస్తూ పలు రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం, ఇప్పుడు మూడో వారంలోకి మరింత బలంగా అడుగుపెట్టేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం సినిమాకు కొత్త సన్ని వేశాలను జోడిస్తున్నట్లు అధి. కారికంగా ప్రకటిం చింది. నేటి నుంచి ప్రేక్షకులు అదనంగా 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల కొత్త ఫుటేజ్‌ను థియేటర్లలో చూడబోతున్నారు. కొత్త సన్నివేశాలు రిపీట్ ఆడియన్స్ మరింత అలరించనున్నాయి.అంతేకాకుండా, ఈ చిత్రం గురువారం నుంచి రెగ్యులర్ టికెట్ ధరలతో అందుబాటులోకి రానుంది. టికెట్ ధరల తగ్గింపు ఫ్యామిలీ ఆడియన్స్‌ను మరింతగా ఆకర్షించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

# 300కె ప్రీ సేల్స్‌తో సమంత 'మా ఇంటి బంగారం'



ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా 'మా ఇంటి బంగారం' సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీ మన తెలుగు రాష్ట్రాలతో పాటు మా ఇంటి బంగారం మూవీ ఓవర్సీస్ మార్కెట్లలో మంచి బజ్ క్రియేట్ చేస్తోంది. ఇప్పటికే ఈ సినిమా ఓవర్సీస్ ప్రీసేల్స్‌లో 300కె దాటేయటం విశేషం. టికెట్ బుకింగ్స్ కూడా వేగంగా కొనసాగు తున్నాయి. టికెట్ బుకింగ్స్ పరంగా మా ఇంటి బంగారం సినిమాకు వస్తోన్న రెస్పాన్స్, ట్రెండ్ చూస్తుంటే ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి ఓపెనింగ్ సాధించేలా కనిపిస్తోంది. ప్రస్తుతం ఉన్న బజ్..అడ్వాన్స్ బుకింగ్స్‌ను దృష్టిలో పెట్టుకుని చూస్తే ఈ సినిమా ఓవర్సీస్‌లో ప్రతిష్టాత్మకమైన 1 మిలియన్ క్లబ్‌లో చేరే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. సరసమైన టికెట్ ధరలు కూడా డిమాండ్‌ను మరింత పెంచాయి. దీంతో ఓపెనింగ్ వీకెండ్‌లో సినిమా చూసే కుటుంబ ప్రేక్షకులకు ఇది బెస్ట్ ఆప్షన్‌గా మారింది. యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌ను కలగలిసిన సినిమా కావటమే అతి పెద్ద బలంగా మారింది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో సమంత పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది.అడ్వాన్స్ బుకింగ్స్ అన్ని మార్కెట్లలో కూడా బలంగా కొనసాగు తున్నాయి. ఇది ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ఉన్న నమ్మకాన్ని స్పష్టంగా చూపిస్తోంది. సమంత భారీ ఫ్యాన్ ఫాలోయింగ్‌తో పాటు, డైరెక్టర్ నందినీ రెడ్డితో ఆమెకున్న సక్సెస్‌ఫుల్ కాంబో క్రేజ్ కూడా ఈ సినిమాకు మరింత బలం చేకూరుస్తోంది. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంలో ఇంకా శ్రీనివాస్ గవిరెడ్డి, మంజూష, దిగంత్, గుల్షన్ దేవయ్య, శ్రీముఖి, గౌతమి,ఆనంద్, లక్ష్మి తదితరులు కీలక పాత్రల్లో నటించారు.



# 'ది ఇండియా స్టోరీ' అఫీషియల్ పోస్టర్ రిలీజ్

జీ స్టూడియోస్ సమర్పణలో, ఎంఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సహకారంతో తెరకెక్కుతున్న 'ది ఇండియా స్టోరీ' చిత్రానికి సంబంధించిన తొలి అధికారిక పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో కాజల్ అగర్వాల్ ఓ న్యాయ వాదిగా, శ్రేయస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రిగా కనిపిస్తున్నారు. అలాగే శ్రేయస్ కుమార్తె పాత్రలో కనిపిస్తున్న చిన్నారి ద్వారా, లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్న ఒక తీవ్రమైన సమస్య వెనుక ఉన్న మానవీయ కోణాన్ని పోస్టర్ బలంగా ఆవిష్కరించింది. ముంబై హైకోర్టు నేపథ్యంతో రూపొందించిన ఈ పోస్టర్‌లో, సాక్షుల బోనులో ఉంచిన పురుగుమందు సిలిండర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆహార కల్తీ అనే అత్యంత కీలకమైన సమస్యపై సాగే కోర్ట్‌రూమ్ డ్రామాకు ఇది సంకేతంగా కనిపిస్తోంది.ఈ చిత్రానికి చెట్టన్ డీకే దర్శకత్వం వహించగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించి నిర్మిస్తున్నారు. జూలై 24, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. భారతదేశంలో ప్రజారోగ్యా నికి సంబంధించిన అత్యంత కీలకమైన, తరచూ నిర్లక్ష్యానికి గురయ్యే ఆహార కల్తీ సమస్యను ఈ చిత్రం ప్రధానాం శం. సాధారణ ప్రజలు ప్రతిరోజూ వినియోగించే ఆహార పదార్థాల వెనుక దాగి ఉన్న ప్రమాదా లను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజంలో అవగాహన పెంచే ప్రయత్నం చేయనుంది. దర్శకుడు చెట్టన్ డీకే మాట్లాడుతూ, ఆహార కల్తీ కారణంగా కుటుంబ సభ్యులు, కావాల్సిన వారిని కోల్పోయిన ప్రతి భారతీయుడి కథే 'ది ఇండియా స్టోరీ'. మన సమాజంలో అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్న ప్పటికీ అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఆహార కల్తీ ఒకటి. ఇది మనందరి రోజువారీ జీవితాలను ప్రభావితం చేసే అంశం.

# 'బాలన్ ది బాయ్' మర్చిపోలేని ఫీల్: నాగచైతన్య



పాన్ ఇండియా స్థాయిలో "బాలన్ ది బాయ్" సినిమా పలువురు సెలబ్రిటీల ప్రశంసలు దక్కించుకుంటోంది. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ ఇలాంటి సినిమా గత రెండేళ్లలో రాలేదని అభినందిం చగా..ఇప్పుడు హీరో నాగ చైతన్య 'బాలన్ ది బాయ్' సినిమాను అప్రిషియేట్ చేశారు. ఈ సినిమా చూస్తున్నంతసేపు ఆ మూవీ ఫీల్ లోనే ఉండపోయానని, 'బాలన్ ది బాయ్' సినిమా మర్చిపోలేని అనుభూతికి గురిచేసిందని అన్నారు. నాగచైతన్య ప్రశంసలతో మూవీ లవర్స్‌లో ఈ సినిమాపై మరింతగా అంచనాలు పెరుగు తున్నాయి. 'బాలన్ ది బాయ్' సినిమా చూసిన తర్వాత నాగచైతన్య స్పందిస్తూ ఈ సినిమా సరికొత్త కథ, ఆశ్చర్యపరిచే కథనం, చూపు తిప్పుకోలేని చిత్రీకరణతో ఆకట్టుకుంది. ప్రతి సీన్ ఊహకు అందకుండా సాగుతూ ఆశ్చర్య పరిచింది. ఎండ్ టైటిల్స్ తర్వాత కూడా నేను అదే ఫీల్‌లో ఉండిపోయాను. ఈ సినిమా ఇచ్చిన అనుభూతి నుంచి బయటకురాలేకపోయా. జితూ మాధవన్ స్క్రిప్ట్ ఇంప్రెస్ చేసింది. ఆయన 'మంజుమ్మెల్ బాయ్స్', 'ఆవేశం' సినిమాల్లాగే ఈ చిత్రాన్ని కూడా తెలుగు ఆడియెన్స్ ఆదరిస్తారు. అన్నారు.గ్రాండియర్ ఫిలిం మేకింగ్‌కు మారుపేరైన కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా 'బాలన్ ది బాయ్' సినిమాను నిర్మిస్తున్నాయి. ఈ చిత్రానికి 'ఆవేశం' ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్ తో "మంజుమ్మెల్ బాయ్స్' చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహి స్తున్నారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 19న హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'బాలన్ ది బాయ్' సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది.

# 'మారెమ్మ' జూలైలో విడుదల



మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్‌డ్రామా 'మారెమ్మ' తో హీరోగా బిగ్ స్క్రీన్ పై అడుగు పెడుతున్నారు. ఈ చిత్రంతో మంచాల నాగరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మయూర్ రెడ్డి బండారు మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.'మారెమ్మ' ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, ఫస్ట్ సింగిల్ 'బావ బావ' సాంగ్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.తాజాగా రిలీజ్ టైం పై అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రం 2026 జూలై లో రిలీజ్ కానుంది.ఈసారి బోనాల జాతర థియేటర్లలో దుమ్ములేప బోతున్నాయ్ అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్ డివైన్ వైబ్ తో అందరినీ ఆకట్టుకుంది.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ ప్రశాంత్ అంకిరెడ్డి అందించగా, సంగీతాన్ని ప్రశాంత్ ఆర్ విహారి సమకూర్చారు. ఎడిటర్‌గా దేవ్ రాథోడ్, ఆర్ట్ డైరెక్టర్‌గా రాజ్‌కుమార్ మురుగేసన్ పని చేస్తున్నారు.

# దమ్మంటే రా.. బాక్సింగ్ రింగ్‌లో తేల్చుకుందాం

**ముంబై, జూన్ 19:** ఐపీఎల్‌లో స్లాప్ గేట్ ఉదంతం జరిగి 18 ఏళ్లవుతున్నా వివాదం చల్లారడం లేదు. దమ్ముంటే బాక్సింగ్ రింగ్‌లో తేల్చుకుందాం అంటూ హర్భజన్‌కు శ్రీశాంత్ సవాల్ విసరడం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. 2008 ఐపీఎల్‌లో శ్రీశాంత్‌ను హర్భజన్ చెంపదెబ్బ కొట్టడం, గ్రౌండ్‌లోనే శ్రీశాంత్ బోరుబోరున కళ్ల నుండి నీరు కార్చడం అప్పట్లో సంచలనంగా మారింది. ఒక్క చెంపదెబ్బకు అప్పట్లో హర్భజన్ కోట్లలోనే మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. 18 ఏళ్ల తర్వాత ఈ వివాదం మరో సారి తీవ్ర రూపం దాల్చింది.

2008 ఐపీఎల్ సీజన్ సందర్భంగా జరిగిన ఈ ఘటనను గుర్తుచేసేలా హర్భజన్ సింగ్ ఇటీవల ఒక వాణిజ్య ప్రకటన షూట్ చేయడమే వివాదానికి కారణమైంది. పాత గాయాలు మర్చిపోయారని భావిస్తున్న తరుణంలో భజ్జీ చేసిన ఈ యాడ్ శ్రీశాంత్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఓ ఇంటర్వ్యూలో గతంలో వారిద్దరూ బాక్సింగ్ గ్లోవ్స్ ధరించి దిగిన ఒక పాత ఫోటోను చూపిస్తూ శ్రీశాంత్ తీవ్రంగా స్పందించారు. యాక్టింగ్‌లు, కమర్షియల్ యాడ్స్ ఆపి, ధైర్యముంటే తనతో బాక్సింగ్ రింగ్‌లో పోటీ




పడాలని భజ్జీకి సవాల్ చేశాడు .తాను రింగ్‌లో నీ కోసం వేచి చూస్తుంటానని శ్రీశాంత్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

# ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆటగాళ్ల ముష్టిఘాతాలు



**వాంకోవర్, జూన్ 18:** ఫుట్‌బాల్ గ్రౌండ్ బాక్సింగ్ రింగ్‌గా మారింది. ఆటగాళ్లు ఒకరిపై ఒకరు ముష్టిఘాతాలకు దిగారు. ఇది సాకర్ వరల్డ్ కప్‌లో చోటుచేసుకుంది. వాంకోవర్‌లో జరిగిన కెనడా, ఖతార్ మ్యాచ్‌లో ఇరు జట్ల ఆటగాళ్లు తన్నుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. మ్యాచ్ ముగియగానే కెనడా ఆటగాళ్లు ఖతార్ జట్టువైపు దూసుకొచ్చారు. ఆటగాళ్లు ఒకరిపై ఒకరు దాడి చేసుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో మైదానంలోకి వచ్చిన భద్రతా సిబ్బంది... ఇరుజట్లను వేరు చేసి అక్కడినుంచి పంపించి వేశారు. ఈ సమయంలో మైదానంలో గందరగోళం నెలకొంది. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

మ్యాచ్ అనంతరం కెనడా హెడ్ కోచ్ జెస్సీ మార్ష్, ఖతార్ మేనేజర్ జులెన్ లోపెటెగీతో కరచాలనం చేస్తుండగా వాళ్లిద్దరి మధ్య గొడవ మొదలైంది. జులెన్‌తో కెనడా కోచ్ దురుసుగా ప్రవర్తించడం ఖతార్ ఆటగాళ్లకు ఆగ్రహం తెప్పించింది. అంతకుముందు మ్యాచ్‌లో బంతిని పాస్ అందించేడానికి ఇస్మాయిల్ కోనె ప్రయత్నిస్తున్న సమయంలో ఖతార్ డిఫెండర్ అస్సిమ్ మదిబో కావాలనే ప్రమాదకరంగా అడ్డుకున్నాడు. దీంతో ఇస్మాయిల్ కాలు ఫ్రాక్చర్ కావడంతో స్ట్రెచర్‌పై తీసుకెళ్లాల్సి వచ్చింది. ఇది కెనడా ఆటగాళ్ల కోపానికి కారణమైంది.



# విజయంతో నాకౌట్‌కు మెక్సికో

**గ్వాడలజారా, జూన్ 19:** ఫిఫా ప్రపంచకప్‌లో మెక్సికో వరుసగా రెండో విజయం నమోదు చేసింది. గ్రూప్-ఏ లో దక్షిణ కొరియాపై ఏకైక గోల్‌తో నెగ్గింది. 50వ నిమిషంలో గోల్ సాధించిన రోమో మెక్సికోకు గెలుపందించాడు. ఈ విజయంతో నాకౌట్‌కు అర్హత సాధించిన తొలి జట్టుగా మెక్సికో నిలిచింది. రెండు పటిష్టమైన జట్ల మధ్య పోరు అభిమానులకు కిక్ ఇచ్చింది. తొలి అర్ధభాగం హోరాహోరీగా సాగింది. బంతిని ఎక్కువగా మెక్సికో నియంత్రణలో కొనసాగింది. మరోవైపు దక్షిణ కొరియా ప్రత్యర్థిని బాగానే అడ్డుకుంది. దీంతో తొలి భాగంలో ఏ జట్టు కూడా గోల్ సాధించలేకపోయాయి.

ఇక రెండో అర్ధభాగం ప్రారంభమైన ఐదు నిమిషాలకే తొలి గోల్ నమోదైంది. మెక్సికో ప్లేయర్ రోమో అదిరే షాట్‌తో బంతిని నెట్స్‌లోకి పంపించాడు. మెక్సికో తొలి గోల్ సాధించడంతో స్టేడియం ఒక్కసారిగా హోరెత్తింది. ఆ తర్వాత మ్యాచ్ రసవత్తరంగా సాగింది. గోల్స్ సమం చేయడానికి కొరియా చేసిన ప్రయత్నాలను మెక్సికో డిఫెండర్లు వమ్ము చేశారు. 75వ నిమిషంలో మెక్సికో ప్లేయర్ రౌల్ జిమెనెజ్ దాదాపు గోల్ చేసినంత పని చేశాడు. దీన్ని కిమ్ అద్భుతంగా అడ్డుకున్నాడు. మ్యాచ్ మరో మూడు నిమిషాల్లో ముగుస్తుందనగా... హో సుయంగ్ యాంగ్, హ్యూన్‌జున్‌లు బంతిని రెండుసార్లు గోల్ వైపునకు పంపించారు. దీనిని సమర్థంగా అడ్డుకున్న మెక్సికో విజయం ఖరారు చేసుకుంది.

దక్షిణ కొరియా ఎంత బలమైందో తమకు ముందే తెలుసని, ఆ జట్టు మమ్మల్ని ఒత్తిడిలోకి నెట్టడంతో పాటు అన్ని ఛాన్స్‌లను అడ్డుకుందని మెక్సికో కోచ్ జేవియర్ అగ్యురే అన్నారు. చివరికి, ఏదో ఒక చిన్న పొరపాటే ఫలితాన్ని నిర్ణయిస్తుందని అనిపించింది. అది గొప్ప మ్యాచ్ ఏమీ కాదు, కానీ ప్రత్యర్థి జట్టు మాకు పెద్దగా ఏమీ చేయనివ్వలేదన్నారు.

# బ్రెజిల్ స్టెప్స్‌కు హైతీ సవాల్



**ఫిలడెల్ఫియా, జూన్ 19:** ఫిఫా ప్రపంచకప్ గ్రూప్-సిలో ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ బ్రెజిల్ మరోపోరుకు సిద్ధమైంది. తొలి పోరులో మొరాకోతో 1-1తో డ్రాగా ముగించి నిరాశపరిచిన సాంబా జట్టు... ఈ సారి అండర్ డాగ్ హైతీతో కీలక మ్యాచ్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్‌కు గెలుపు తప్పనిసరి. లేదంటే నాకౌట్ అవకాశాలు క్లిష్టంగా మారతాయి. మరోవైపు స్కాట్లాండ్ చేతిలో ఓడిన హైతీ... సంచలనం సృష్టించాలని ఆశిస్తోంది.

**ఒత్తిడంతా సాంబాపైనే**

ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ స్పష్టమైన ఫేవరెట్ అయినా ఒత్తిడి కూడా అదే స్థాయిలో ఉంటుంది. కార్లో అన్సెలోట్టి ట్రెయిన్డ్ టీమ్ తొలి మ్యాచ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. మొరాకోపై డ్రాతో విమర్శలు ఎదుర్కొంటున్న బ్రెజిల్ ఈ మ్యాచ్‌లో దూకుడైన ఆటతీరుతో పూర్తి మూడు పాయింట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. జట్టులో వినీషియస్, రఫిన్హా వంటి స్టార్ ఆటగాళ్లు కీలకంగా మారనున్నారు. అన్సెలోట్టి కొన్ని వ్యూహాత్మక మార్పులు చేసే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చారు.

**హైతీ లక్ష్యం సంచలనం**

1974 తర్వాత ప్రపంచకప్‌కు అర్హత సాధించిన హైతీ...తొలి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై ఓడినా పోరాట పటిమతో ఫ్రెష్ అనిపించుకుంది. తొలి మ్యాచ్‌లో బ్రెజిల్ ఆటలో కనిపించిన లోపాలను హైతీ సద్వినియోగం చేసుకుంటే మ్యాచ్ ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది. బ్రెజిల్ వంటి దిగ్గజ జట్టుతో ఆడటం తమకు గొప్ప అవకాశమని హైతీ కోచ్ సెబాస్టియన్ మిగ్నే పేర్కొన్నారు. ఒత్తిడి అంతా బ్రెజిల్ పైనే ఉంటుందని, తాము స్వేచ్ఛగా ఆడతామని చెప్పారు.

**హెడ్ టు హెడ్ :** ఇప్పటివరకు బ్రెజిల్, హైతీ రెండుసార్లు తలపడగా, రెండింటిలోనూ సాంబా టీమ్ ఘన విజయం సాధించింది. 2004లో 6-0తో, 2016లో 7-1 తేడాతో హైతీని ఓడించింది. మొత్తం 13 గోల్స్ చేసిన బ్రెజిల్, కేవలం ఒక గోల్ మాత్రమే ఇచ్చుకుంది.



# మకావ్ ఓపెన్ సెమీస్‌లో అష్మిత

**మకావ్(చైనా), జూన్ 19:** భారత షట్లర్ అష్మిత చాలిహా మకావ్ ఓపెన్ బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్ సూపర్300 టోర్నీలో జోరు కొనసాగుతోంది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో అష్మిత 21-16, 21-18తో కేవలం 37 నిమిషాల్లోనే కిమ్ మిన్ సున్(కొరియా)పై గెలుపొందింది. సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి గేమ్ ఆరంభంలో అష్మిత, కిమ్ పోటాపోటీగా తలపడి పాయింట్లు రాబట్టారు. దీంతో14-14వరకు సమవుజ్జీగా నిలిచారు. ఈదశలో జోరు చూపిన అష్మిత వరుసగా 4 పాయింట్లు సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. నెట్‌గేమ్‌తో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేస్తూ అష్మిత తొలి గేమ్‌ను 21-16తో నెగ్గి శుభారంభం చేసింది. రెండో సెట్ లో కిమ్ ఆరంభంలో ఆధిక్యం చాటింది. మిడ్ గేమ్‌లో పుంజుకుని అష్మిత 11-5తో ఆధిక్యం చాటినా.. కిమ్ వరుస పాయింట్లతో 18-16 లీడ్ సాధించింది. ఈ దశలో ఎడమచేతి భారత షట్లర్... ప్రత్యర్థిని ఒత్తిడికి గురిచేస్తూ వరుసగా అయిదు పాయింట్లు సాధించి గేమ్‌ను, మ్యాచ్‌ను ముగించింది. కాగా ఎనిమిదో సీడ్ అనమోల్ ఖర్బ్ సవాల్ క్వార్టర్ ఫైనల్లో ముగిసింది.14-21, 21-15, 21-13తో నాలుగో సీడ్ హాన్ క్విన్ గ్జి(చైనా) చేతిలో ఓడింది.

# టిజి20 లీగ్ ఆపాలంటూ హైకోర్టుకెక్కిన క్రికెటర్లు

**హైదరాబాద్, జూన్ 19(వార్త క్రీడా ప్రతినిధి):** తెలంగాణ టీ20 లీగ్ ఆరంభానికి సమయం దగ్గరపడుతుండగా, మరోవైపు ఈ లీగ్‌ను వెంటనే ఆపాలని తెలంగాణ క్రికెటర్లు హైకోర్టును ఆశ్రయించారు. హెచ్‌సీఏ నిర్వహిస్తున్న టీజీ 20 లీగ్‌కు చట్టబద్దత లేదని పిటిషన్ దాఖలు చేశారు. టీజీ 20 లీగ్ వెంటనే ఆపాలని కోర్టును అభ్యర్థించారు. క్రికెటర్ అంబటి రాయుడు, టీజీ 20లీగ్ గవర్నింగ్ కౌన్సిల్ తమను మోసం చేసిందని క్రీడాకారులు పిటిషన్‌లో పేర్కొన్నారు.మరోవైపు హెచ్‌సీఏ నిర్వహిస్తున్న టీజీ20 లీగ్‌కు బీసీసీఐ నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేవని, ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధంగా జరుగుతున్న టోర్నీఅని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ధరమ్ గురువారెడ్డి లేఖ విడుదల చేశారు. టోర్నీ యాజమాన్య హక్కుల వెనక పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగిందని ఆరోపించారు. కాగా టీజీ 20 లీగ్ తొలి సీజన్ మ్యాచ్‌లు జూన్21 నుంచి ఉప్పల్ స్టేడియంలో జరగనున్నాయి. 8జట్లు తలపడనున్నాయి. ప్రతి జట్టు మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది.



# జాతీయ ఐస్ హాకీకి ఎంపికైన ఆర్యన్ కర్రా

**హైదరాబాద్, జూన్ 19(వార్త క్రీడా ప్రతినిధి):** ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ వేదికగా జరిగే 15వ జాతీయ ఐస్ హాకీ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు ఆర్యన్ కర్రా ప్రాతినిధ్యం వహిస్తాడు. ఈమేకు తెలంగాణ ఐస్ హాకీ అసోయేషన్ తెలిపింది. ఈ పోటీలు జూలై 1 నుంచి ఎనిమిది రోజుల పాటు జరుగుతాయి.అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఆర్యన్ రాకతో తెలంగాణ జట్టు మరింత బలోపేతం కానుంది. గతంలో ఇటలీలోని రోకారాసోలో జరిగిన వరల్డ్ ఇన్‌లైన్ హాకీ చాంపియన్‌షిప్‌లో భారత జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2018 ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు బ్రాంజ్ మెడల్ అందించాడు. 61వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపించాడు.




# వారాంతంలో మార్కెట్ల భారీ పతనం

**ముంబయి, జూన్ 19:** భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా నష్టపోయాయి. వరుసగా ఐదు సెషన్లలో లాభాలు పొందిన స్టాక్ మార్కెట్ శుక్రవారం నష్టాల బాటలో నడిచింది. సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్607.08 నష్టపోయి 76,802.90 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 155 పాయింట్లు నష్టపోయి 24,013 పాయింట్ల వద్ద ముగిసింది. ఒక దశలో బీఎస్ఈ సెన్సెక్స్ 940.26 పాయింట్లు నష్టపోయి 76,469.72 కనిష్టానికి చేరింది. గ్లోబల్ ఐటీ దిగ్గజ కంపెనీ యాక్సెంచర్ ప్రకటించిన త్రైమాసిక ఫలితాలు నిరాశాజనకంగా ఉండటం, గతంలో ప్రకటించిన 5 శాతం రెవెన్యూ వృద్ధి అంచనాలను 4 శాతం తగ్గించడం మార్కెట్‌లో ఐటీ షేర్ల పతనానికి దారితీసింది. యాక్సెంచర్ ప్రకటనతో దేశీయ ఐటీ షేర్లు భారీగా నష్టపోయాయి.నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.65 శాతం పతనమైంది. అమెరికా మార్కెట్లో యాక్సెంచర్ షేర్లు18శాతం పతనమయ్యాయి.భారతీయ ఐటీ కంపెనీలకు సంబంధించి ఇన్ఫోసిస్ 6.5 శాతం, టీసీఎస్ 3.06శాతం, టెక్ మహీంద్రా 2.3 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీ 2.23 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 1.81 శాతం, విప్రో 1.28 శాతం నష్టపోయాయి. బీఎస్ఈలో ఎటర్నల్, పవర్ గ్రిడ్, భారతి ఎయిర్‌టెల్, టైటాన్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, ఐటీసీ, ట్రెంట్, ఎల్ అండ్ టీ షేర్లు లాభాలు పొందాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, హిందుస్తాన్ యునీలీవర్ సంస్థలు నష్టపోయాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 7 పైసలు పెరిగి, 94.33వద్ద కొనసాగింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య ఒప్పందం కుదరడం, హార్ముజ్ జలసంధి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో చమురు ధరలు ఒకటిశాతం పైగా పతనమయ్యాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 78.33 డాలర్లుగా, డబ్ల్యూటీఐ (వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్) క్రూడాయిల్ ధర కూడా ఒకటి శాతం పైగా తగ్గి 75.88 డాలర్ల వద్ద కొనసాగింది.

# హార్ముజ్ రాకపోకలతో దిగివచ్చిన బ్రెంట్‌క్రూడ్


**టెహ్రాన్,వాషింగ్టన్,జూన్ 19:** అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఈరోజు భారీగా తగ్గుముఖం పట్టాయి.హార్ముజ్ జలసంధి గుండా ఆయిల్ ట్యాంకర్ల రాకపోకలు తిరిగి ప్రారంభం కావడంతో మార్కెట్‌లోకి సరఫరా పెరగనుందన్న అంచనాలతో ధరలు దిగివచ్చాయి. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 54 సెంట్లు తగ్గి 78.31డాలర్లవద్ద ట్రేడ్ అవ్వగా,యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ ఆయిల్ ధర 46 సెంట్లు తగ్గి 76.14 డాలర్లకు చేరింది. ముందురోజు ఈ రెండు సూచీలు మార్చి ప్రారంభం తర్వాత అత్యంత కనిష్ట స్థాయిని తాకాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై సంతకం చేసిన కొన్ని గంటల్లోనే, సౌదీ అరేబియాకు చెందిన మూడు ట్యాంకర్లు సహా పలు నౌకలు హార్ముజ్ జలసంధిని దాటాయి.ఈ మూడు ట్యాంకర్లలోనే దాదాపు 6 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు ఉంది. మధ్యప్రాచ్య గల్ఫ్‌లో నిలిచిపోయిన 85 మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురు రాబోయే రోజుల్లో ప్రపంచ మార్కెట్లలోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి తోడు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను ఎత్తివేయనుండటంతో సరఫరా మరింత పెరగనుంది. పశ్చిమాసియాలోని ఇతర దేశాలు కూడా ఎగుమతులను పునఃప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. యుద్ధ సమయంలో విధించిన అన్ని ఫోర్స్ మేజర్ నోటీసులను తక్షణమే ఎత్తివేసినట్లు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ నిన్న ప్రకటించింది. తమ ఆయిల్‌ఫీల్డ్‌లు ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని, సాధారణ ఉత్పత్తి స్థాయికి క్రమంగా చేరుకుంటామని ఇరాక్ చమురు శాఖ మంత్రి బాసిమ్ మహమ్మద్ తెలిపారు. హార్ముజ్ జలసంధి గుండా ట్యాంకర్ల రద్దీ పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుందని నిర్ధారించుకునే వరకు ట్రేడర్లు వేచి చూసే ధోరణిలో ఉన్నారని




## బ్యారెల్ ధరలు 78.31 డాలర్లే

మార్కెట్ నిపుణులు అంటున్నారు. నౌకల రాకపోకలు నిలకడగా కొనసాగితేనే ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని కేసీఎం చీఫ్‌మార్కెట్ అనలిస్ట్ టిమ్ వాటరర్ అభిప్రాయపడ్డారు. యుద్ధానికి ముందు ప్రపంచంలోని చమురు, ఎల్ఎన్‌జీ ఐదోవంతు ఈజలసంధి గుండానే రవాణా అయ్యేది.




# జియో ఐపిఒకోసం సెబీకి ముసాయిదా దాఖలు

# చరిత్రలోనే రెండో అతిపెద్ద ఐపిఒకు బాటలు

**ముంబయి, జూన్ 19:** భారతీయ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓ రాబోతోంది. డిజిటల్, టెలికాం దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు వెళ్లేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని, దీనికి సంబంధించిన ముసాయిదా పత్రాలను ఈ రోజే సెబీకి సమర్పించబోతున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ప్రకటించారు.రిలయన్స్ 49వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయనే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. దివంగత ధీరూభాయ్ అంబానీ ఆశయాలను తాను ముందుకు తీసుకెళ్లినట్లే ఇప్పుడు తన వారసులు ఆకాశ్, ఈశా,అనంత్ అంబానీలు ఈ జియో ఐపీఓ ప్రక్రియను ముందుండి నడిపిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో సరికొత్త వృద్ధి అవకాశాలకు వారు నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు. గ్లోబల్ స్థాయిలో సాంకేతిక కంపెనీలను భారత్ నిర్మించగలదని ఈ జియో లిస్టింగ్ ప్రపంచానికి నిరూపిస్తుందన్నారు.

పదేళ్ల క్రితం భారత్‌లో వాయిస్ కాల్స్, డేటా ధరలు అధికంగా, స్పీడ్ చాలా తక్కువగా ఉండేవని ముకేశ్ గుర్తుచేశారు. దేశంలో డిజిటల్ అసమానతలను తొలగించాలనే లక్ష్యంతోనే జియో ప్రయాణం మొదలైందని తెలిపారు. వాయిస్ కాల్స్‌ను పూర్తిగా ఉచితం చేసి హైస్పీడ్ డేటాను సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రతి భారతీయుడికి డిజిటల్ లైఫ్‌ను సాధ్యం చేసిన జియో ఇప్పుడు తన తదుపరి పెద్ద మిషన్‌కు సిద్ధమవుతోందని స్పష్టం చేశారు. ఈ జియో ఐపీఓ భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓగా నిలవబోతోంది. నివేదికల ప్రకారం ఈ ఐపీఓ విలువ సుమారు రూ.33,600 కోట్లుగా ఉండే అవకాశం ఉంది.

ప్రముఖ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంక్ జెఫ్రీస్ అంచనా ప్రకారం రిలయన్స్ జియో మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.15,12,000 కోట్లుగా ఉంది. భారత్‌లో ఇప్పటివరకు జరిగిన ఐపీఓల్లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓ అతిపెద్దది. దీని విలువ రూ. 27,870 కోట్లు. ఇప్పుడు రాబోతున్న జియో ఐపీఓ ఆ రికార్డును అధిగమించనుంది.ప్రస్తుతం జియో ప్లాట్‌ఫామ్స్ 52.40 కోట్ల మంది ఖాతాదారులతో దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ప్లాట్‌ఫామ్‌గా రికార్డు సృష్టించింది. ఇందులో కేవలం జియో 5జీ నెట్‌వర్క్‌ను వాడుతున్న వారి సంఖ్యే 26.80 కోట్లుగా ఉంది. అలాగే వీరి సరికొత్త హోమ్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీస్ అయిన జియో ఎయిర్ ఫైబర్ ఇప్పటికే 1.30 కోట్ల ఇళ్లకు కనెక్ట్ అయి ఉంది.

# 10 బిలియన్ డాలర్లు తగ్గిన ఫారెక్స్ ఖజానా



**ముంబయి, జూన్19:** భారత ఫారెక్స్ నిల్వలు 9.985 బిలియన్ డాలర్లు తగ్గి 671.625 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈనెల 12తో ముగిసిన వారంలో ఫారెక్స్ వివరాలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శుక్రవారం వెల్లడించింది. బంగారం నిల్వల విలువలో భారీ తగ్గుదల ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది.అంతకుముందు వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 711 మిలియన్ డాలర్లు తగ్గి 681.610 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, జూన్ 12తో ముగిసిన వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 846 మిలియన్ డాలర్లు పెరిగి 544.290 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ మారక నిల్వల్లో ఇది ప్రధాన భాగం.డాలర్ విలువలో లెక్కించే విదేశీ కరెన్సీ ఆస్తుల్లో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాతర కరెన్సీల విలువ పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది. బంగారం నిల్వల విలువ 10.754 బిలియన్ డాలర్లు తగ్గి 103.821 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ తగ్గుదల మొత్తం విదేశీ మారక నిల్వలపై గణనీయమైన ప్రభావం చూపింది. అదేవిధంగా, ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు 66 మిలియన్ డాలర్లు తగ్గి 18.699 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ఐఎంఎఫ్ వద్ద భారత రిజర్వ్ స్థాయి కూడా 11 మిలియన్ డాలర్లు తగ్గి 4.815 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి. దేశ విదేశీ మారక నిల్వల్లో బంగారం విలువ తగ్గుదల ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, విదేశీ కరెన్సీ ఆస్తుల పెరుగుదల కొంతమేర ఉపశమనం కలిగించిందని ఆర్బీఐ అంచనావేసింది.

# 1650 ఉపగ్రహాలతో జియో శాటిలైట్ ఇంటర్నెట్

**న్యూఢిల్లీ, జూన్ 18:** దేశ టెలికం రంగంలో సంచనాలతో దాదాపు గుత్తాధిపత్యం సాధించిన రిలయన్స్ జియో ఇప్పుడు శాటిలైట్ ఇంటర్నెట్‌పైనా కన్నేసింది. సుమారు 1,650 ఉపగ్రహాలతో నేరుగా నింగి నుంచే ఇంటర్నెట్, ఇతర టెలికం సేవలను అందించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం సుమారు రూ. లక్షన్నర కోట్లు వ్యయం చేయనుంది. అనుమతులపై కేంద్రప్రభుత్వం ఇప్పటికే సానుకూలత వ్యక్తం చేసింది. జియో శాటిలైట్ ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తే భారత డిజిటల్ సార్వభౌమత్వం పెరుగుతుందని, విదేశీ వ్యవస్థలపై ఆధారపడటం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా శాటిలైట్ ఇంటర్నెట్ రంగంలో ఉన్న పెద్ద సంస్థలకు జియో గట్టిపోటీ ఇచ్చే అవకాశం ఉంది.

లియో కక్ష్యలో ఉపగ్రహాలతో భూమి ఉపరితలం నుంచి సుమారు 400 కిలోమీటర్ల నుంచి 650 కిలోమీటర్ల ఎత్తు (లోఎర్త్ ఆర్బిట్ లియో)లోకి ఉపగ్రహాలను పంపి వాటి సాయంతో నేరుగా ఇంటర్నెట్‌ను అందిస్తారు. ఇందుకోసం ప్రత్యేకమైన పరికరాలనుగానీ, ఫోన్లను గానీ వినియోగించాల్సి ఉంటుంది. శాటిలైట్ ఇంటర్నెట్‌తో నగరాలు, గ్రామీణ ప్రాంతాలనే కాదు కొండలు,గుట్టలు, పర్వతాలు, అడవులు, మారుమూల ప్రాంతాలకూ ఇంటర్నెట్, టెలికం సర్వీసులు అందుతాయి. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ ఈ రంగంలో అగ్రగామిగా ఉంది. స్టార్‌లింక్ సుమారు 10వేల ఉపగ్రహాలతో ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తోంది. తర్వాతి స్థానంలో ఉన్న అమెజాన్ లియో ఇప్పటికే వెయ్యికిపైగా ఉపగ్రహాలతో సేవలందిస్తోంది. ఇక మనదేశానికి చెందిన భారతీ గ్రూప్(ఎయిర్‌టెల్ మాతృసంస్థ) వాటాలున్న యూరోప్ సంస్థ యూటెల్‌సాట్ వన్‌వెబ్ జాయింట్ వెంచర్ కూడా ఇప్పటికే సుమారు 600 ఉపగ్రహాలను ప్రయోగించి రేసులో ఉంది. అయితే జియో వీటన్నింటికీ భిన్నంగా శాటిలైట్ ఇంటర్నెట్‌నూ అనుసంధానించి.. సమగ్ర టెలికం ఇంటర్నెట్ వ్యవస్థగా నిలవనుంది.





# ఎన్ఎస్ఈ కోలోకేషన్ కేసు సెటిల్‌మెంట్‌కు సత్వర పరిష్కారం

**ముంబయి, జూన్ 19:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కోలోకేషన్ కేసు సెటిల్‌మెంట్‌కు సెబీ అంతర్గతంగా ఆమోదం తెలిపిందని, ఈ వ్యవహారం త్వరలోనే పరిష్కారమయ్యే అవకాశం ఉందని సెబీ ఛైర్‌పర్సన్ తుహిన్‌కాంతపాండే శుక్రవారం వెల్లడించారు.ఎన్ఎస్ఈ సెటిల్‌మెంట్‌కు అంతర్గతంగా ఆమోదం లభించింది. ఈ అంశం త్వరలోనే పరిష్కారమవుతుందని పాండే తెలిపారు. దాదాపు దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న ఐపిఒ కోసం ఎన్ఎస్ఈ ఇటీవల డ్రాఫ్ట్ రెడ్ హెరింగ్ ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజ్ లిస్టింగ్ ప్రక్రియ మరో కీలక దశకు చేరుకుంది. డీఆర్‌హెచ్‌పీలో ఎన్ఎస్ఈ, కోలోకేషన్ కేసుకు సంబంధించి సెబీతో ప్రతిపాదిత సెటిల్‌మెంట్ కోసం రూ.1,391 కోట్ల ప్రొవిజన్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సవరించిన సెటిల్‌మెంట్ మొత్తంగా రూ.1,491 కోట్ల ప్రతిపాదనను సమర్పించామని, దీనికి తుది నియంత్రణ అనుమతి కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొంది. ఈ తాజా పరిణామం వల్ల ఎన్ఎస్ఈ పబ్లిక్ లిస్టింగ్‌కు చాలా కాలంగా అడ్డంకిగా ఉన్న ప్రధాన సమస్యల్లో ఒకటి త్వరలోనే పరిష్కారమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్ఎస్ఈ లిస్టింగ్ దాదాపు పదేళ్లుగా కొనసాగుతోంది. సంస్థ తొలిసారిగా 2016లో ఐపీఓ ముసాయిదా పత్రాలను దాఖలు చేసినప్పటికీ, కోలోకేషన్ వివాదం వెలుగులోకి రావడంతో నియంత్రణ సంస్థల పరిశీలన ప్రారంభమై నిలిచిపోయింది.ఆ తర్వాత కోలోకేషన్ కేసుకు సంబంధించిన సెటిల్‌మెంట్ దరఖాస్తులు సహా పలుపెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు ఎన్ఎస్ఈ చర్యలు చేపట్టింది.2024లో షేర్‌హోల్డర్లు 4:1 బోనస్ ఇష్యూకు ఆమోదం తెలపడంతో ఐపీఓ ప్రక్రియ మళ్లీ వేగం పుంజుకుంది. అనంతరం 2026 జనవరిలో సెబీ లిస్టింగ్‌కు సుముఖత తెలపగా, ఫిబ్రవరిలో ఐపీఓకు అధికారిక అనుమతి మంజూరు చేసింది.నియంత్రణ సంస్థల సమీక్ష అనంతరం సంస్థ ధరల శ్రేణి, సబ్‌స్క్రిప్షన్ తేదీలు ప్రకటించి, స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌కు సిద్ధమయ్యే అవకాశం ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.